అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 20-01-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 331 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశ నిర్ణయాలను వెల్లడిస్తున్న ప్రకాశ్ కరత్, చిత్రంలో పశ్చిమబెంగాల్ కార్యదర్శి ఎండీ సలీం

పాలస్తీనాలో శాంతికి రాజకీయ పరిష్కారం కనుగొనాలి

ఇజ్రాయిల్, హమాస్ మధ్య కాల్పుల విరమణను స్వాగతించిన సీపీఐ(ఎం)

పలు అంశాలపై కొల్‌కతాలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ చర్చ

పార్టీ జాతీయ మహాసభలకు సన్నాహాలు

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని సీపీఐ (ఎం) స్వాగతించింది. ఈ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. పదిహేను నెలలకు పైగా గాజాలోని పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగించిన జాతి నిర్మూలన యుద్ధంలో 46 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 1.20 లక్షల మంది గాయపడ్డారని పార్టీ తెలిపింది. కాల్పుల విరమణ తొలి దశ ఆరు వారాల పాటు ఉనికిలో ఉంటుందని, ఆ తర్వాత శాంతిని, రాజకీయ పరిష్కారాన్ని కనుగొనే వరకూ దానిని కొనసాగించాలని అభిప్రాయపడింది. పాలస్తీనాలో శాంతి నెలకొనేలా, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు చర్యలు చేపట్టేలా భారత ప్రభుత్వం దౌత్యపరంగా కృషి చేయాలని సూచించింది. ఈ నెల 17-19 తేదీల మధ్య కొల్‌కతాలో సమావేశమైన సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ పలు అంశాలపై చర్చించింది. వాటిపై ఆదివారం ఒక ప్రకటన ...3లో



హైదరాబాద్‌లో

భారీ ఐటీ పార్క్

రూ. 450 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం

- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- క్యాపిటల్‌ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు



క్యాపిటల్‌ల్యాండ్ ప్రతినిధులతో సీఎం రేవంత్ , మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో భారీ పెట్టుబడి పెట్టేందుకు సింగపూర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ ముందుకొచ్చింది. రాష్ట్రంలో రూ.450 కోట్లతో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ప్రకటించింది. ఆ దేశంలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందంతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కంపెనీ నిర్ణయం తీసుకుంది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ ఐటీ పార్క్‌ను అభివృద్ధి చేయనుంది. క్యాపిటల్ ల్యాండ్ చేపట్టే కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలు రాయిగా నిలుస్తుందని సీఎం ఈ సందర్భంగా అభిప్రాయ పడ్డారు. బ్లూ చిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఐటీ పార్కులో అందుబాటులో ఉంటాయి. కంపెనీ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సీఈవో గౌరీశంకర్ నాగభూషణం మాట్లాడుతూ రేవంత్ సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిర వృద్ధి చెందుతోందనీ, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించటం ఆనందంగా ఉందని అన్నారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్‌పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఇన్వెస్ట్ మెంట్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఎంవో ప్రత్యేక ...11లో



ముగిసిన సింగపూర్ పర్యటన

దావోస్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి బృందం

నేటి నుంచి వరల్డ్ ఎకనామిక్స్ ఫోరమ్

భారీ పెట్టుబడులే లక్ష్యంగా ప్రణాళికలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. అక్కడ నుంచి ఆదివారం రాత్రి సీఎంతో ...10లో



12లో..

అమ్మాయిలు, అబ్బాయిలు ఖోఖో చాంపియన్స్

అరంగేట్ర ప్రపంచకప్ టైటిల్స్ మన సొంతం

ఖోఖో ప్రపంచకప్ 2025

భారత్ చరిత్ర సృష్టించింది. ప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా 39 జట్లు పోటీపడిన ఉత్కంఠభరిత ప్రపంచకప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అమ్మాయిలు నేపాల్‌ను చిత్తు చేయగా.. అబ్బాయిలు సైతం నేపాల్‌పై ఘన విజయం సాధించారు.

ట్రంప్ ప్రమాణస్వీకార వేళ హోరెత్తిన నిరసనలు

వాషింగ్టన్‌లో భారీ ప్రదర్శన

ఇతర నగరాలలో కూడా ఆందోళనలు

'ట్రాన్స్ లైవ్స్ మ్యాటర్', 'స్టాండప్...ఫైట్ బ్యాక్', 'ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బి సైలెంట్' అంటూ నినాదాలు



వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపడుతున్న తరుణంలో వాషింగ్టన్ నగరం నిరసనలతో హోరెత్తింది. ట్రంప్ విధానాలను నిరసిస్తూ వేలాది మంది ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'ట్రాన్స్ లైవ్స్ మ్యాటర్', ...11లో

నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

70 మంది మృతి

వివరాలు 11లో

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే

రాష్ట్రంలో 402 మంది రైతుల ఆత్మహత్యలు

బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు


11లో..

మూడు గంటలు ఆలస్యంగా

అమల్లోకి కాల్పుల విరమణ..

15 నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ

11లో..



తప్పుదోవ పట్టిస్తున్న పతంజలి ప్రకటనలు

బాబా రాందేవ్‌పై అరెస్ట్ వారెంట్

కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు ఉత్తర్వులు

వివరాలు 11లో

మరోసారి రైతు ఉద్యమానికి

తలవంచిన మోడీ సర్కార్

ఫిబ్రవరి 14న చర్చలకు రమ్మని కేంద్రం ప్రకటన

వైద్య సాయం పొందుతున్న దల్లేవాల్

ఎంఎస్పీపై చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లు

11 నెలలుగా పరిష్కారంకోసం ఆందోళనలు



న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం ఆందోళన సాగిస్తున్న పంజాబ్ అన్నదాతలలో చర్చలు జరుపుతామని కేంద్రం ప్రకటించింది. దీంతో ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వైద్య సాయం పొందేందుకు అంగీకరించారు. అయితే పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించేంత వరకూ నిరవధిక దీక్ష కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లో నిరసన తెలుపుతున్న రైతులతో ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో చర్చలు జరుపుతామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ నేతృత్వంలో కేంద్ర వ్యవసాయ ...11లో



మద్దతు ధర సాధనకు ఐక్య ఉద్యమాలు

- టి. సాగర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం



పంటలకు మద్దతు ధరలను సాధించేందుకు అన్ని రైతు సంఘాలతో కలిపి ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తాం. ఐక్య కార్యాచరణ రూపొందించి, సమరశీల పోరాటాలు చేస్తాం. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుబాటులోకి తెచ్చేలా ఒత్తిడి పెంచుతాం. సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో నిర్మించాలి. భవిష్యత్తులో భూ నిర్వాసితుల సమస్యలు పెరుగుతాయి. ప్రభుత్వం రహదారులు, ప్రాజెక్టులు, పరిశ్రమల ...11లో

సాగేదెట్టా?

కష్టాల కడలిలో రైతన్న

'ఇట్లయితే సాగేదెట్టా. చేయి చాచి అడిగినా గత సర్కారు మా గోడు పట్టించుకోలేదు. కష్టాల కడలిలో నుంచి మేము బయట పడేదెట్టా' ఏ రైతు నోట విన్నా ఇదే ఆవేదన. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన విధానాలే రైతుల కష్టాలకు కారణమవుతున్నాయి. అవి తీసుకున్న నిర్ణయాలే అన్నదాతలకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. చివరకు తాము పండించిన పంటను ఎంతకు అమ్ముకోవాలో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారంటే అర్థం చేసుకోవచ్చు. విత్తనం విత్తే నాటి నుంచి పంటను అమ్ముకునేదాకా రైతు ఎదుర్కొంటున్న కష్టాలు, బాధలు వర్ణనాతీతం. కౌలు రైతుల గోస కష్టాలమయం. అది ఎవరికీ పట్టనిది. గత పాలకుల నుంచి నేటి పాలకుల వరకు అనుసరిస్తున్న విధానాల్లో ఏలాంటి మార్పూ లేదు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వలేదు.

సర్కారు విధానాలే రైతుల మెడకు ఉరితాళ్లు

గాలికొదిలేసిన నాటి బీఆర్ఎస్ సర్కారు

ధరణి సృష్టించిన సమస్యలెన్నో...

హామీలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

కౌలు రైతులకు గుర్తింపేది?

అన్నదాతలకు అండగా తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రైతు సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైతు సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించింది. రాష్ట్రంలో 11.5 లక్షల పోడు రైతులకుగానూ, సుదీర్ఘ పోరాట ఫలితంగా నాలుగు లక్షల రెండువేల మందికి పట్టాలను సాధించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసి, మిగతా సబ్సిడీలను ఇవ్వలేదు. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వం మూడు సాగు చట్టాలను తీసుకొచ్చి రైతులను కూలీలుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. పచ్చని పంట పొలాలను కార్పొరేట్లకు కట్టబెట్టేలా కేంద్రం తీసుకున్న నిర్ణయంపై రైతన్న కన్నెర్ర చేశారు. జాతీయస్థాయిలో సుదీర్ఘ కాలం పోరాటం సాగింది. రైతుసంఘాలు, కార్మిక, సామాజిక సంఘాలు జాతీయ పోరాటానికి మద్దతుగా నిలిచాయి. లక్షల మంది ...11లో



మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ క్యాలెండర్

- టీ స్కైలాబ్ బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మార్క్స్, పూలే అంబేద్కర్ వంటి మహనీయుల స్ఫూర్తిని పంచేలా కేవీపీఎస్ క్యాలెండర్ ఉందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కులో ఆ పార్కు ప్రెసిడెంట్ పీవీ నిరంజన్ రెడ్డితో కలిసి ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్కైలాబ్ బాబు మాట్లాడుతూ మహనీయుల చిత్రపటాలు వారి విలువైన నినాదాలతో నేటి తరం స్ఫూర్తి పొందే విధంగా క్యాలెండర్‌ను ముద్రించినట్టు తెలిపారు. కేవీపీఎస్ అట్టడుగు వర్గాల ఐక్యత కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు సామాజిక న్యాయం కోసం పోరాడుతుందని తెలిపారు. మనుస్మృతి ఆధిపత్య బావజాలంపై ప్రతిఘటన ఉద్యమాలు జరిపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్కు ప్రెసిడెంట్ కార్యదర్శి సైకం మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వడిత్య కళ్యాణ్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం దశరథ్, ఎస్ రమేష్ రెడి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రావు వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్ నేర్చుకోండి ప్రాణాలను కాపాడండి

- డాక్టర్ మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఆర్ (ఛాతి మర్ధన) నేర్చుకుని ఆపదలో ఉన్న వారిని కాపాడాలని గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని ప్రతినిధి, సీపీఆర్ కార్యక్రమం కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం కార్డియో పల్మనరీ రెసిటేషన్ (సీపీఆర్ - ఛాతి మర్ధన)లో హైదరాబాద్‌లోని గాంధీ అలుమ్ని ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉచిత శిక్షణనిచ్చారు. మూడు రోజుల పాటు ఒక గంటపాటు ఇవ్వనున్న ఈ శిక్షణ మొదటి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. హాజరైన ప్రతి ఒక్కరికి ఒక గంటపాటు సీపీఆర్‌లో డాక్టర్లు శిక్షణనిచ్చి సర్టిఫికెట్లను అందజేశారు. మొదటి రోజు 600 మంది వరకు హాజరయ్యారు. సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం కొనసాగనున్నది.

మొదటి రోజు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మనిషి స్పృహ కోల్పోయినప్పుడు గుండె ఆగిపోవడం లేదా ఎక్కువగా కొట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. అలా జరిగినప్పుడు మెదడుకు రక్త సరఫరా ఆగిపోతుందని చెప్పారు. ఈ సరఫరా 5 నుంచి 10 నిమిషాలపాటు ఆగిపోతే మనిషి అక్కడే మరణిస్తారని చెప్పారు. ఈ దశలో ఆయన సమీపంలో ఉన్నవారికి సీపీఆర్ తెలిసి ఉంటే ప్రాణాలను కాపాడేందుకు అవకాశముంటుందని తెలిపారు.

గుండెపోటు కేసుల్లో సీపీఆర్ అందినవారు బతికిన ఘటనలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహామూర్తి మాట్లాడుతూ రోగుల సహాయం కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. అలుమ్నితో కలిసి సీపీఆర్ శిక్షణ చేపట్టడం బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలుమ్ని ఆఫీస్ మేనేజర్ పవన్ కుమార్, శివరుద్ర, నాగరాజు తదితరులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నాం

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యశ్రీకి సంబంధించి ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. పదేండ్లు ఆరోగ్యశ్రీని నీరుగార్చి, ఇప్పుడు అదే పథకం గురించి ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారి తీరు.. దొంగే, దొంగ దొంగ అని అరిచినట్టుగా ఉందని విమర్శించారు. వారి హయాంలో హాస్పిటళ్లకు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. ప్యాకేజీల ధరలు రివైజ్ చేయలేదని పేర్కొన్నారు. సుమారు 730 కోట్లు బాకీ పెట్టి పోయారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలతో సహా రూ.1130 కోట్లు ఏడాదిలో చెల్లించినట్టు తెలిపారు. ప్రతి నెలా నిధులు విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్యాకేజీల రేట్లు రివైజ్ చేసి, 22 శాతం మేర చార్జీలు పెంచినట్టు చెప్పారు. హాస్పిటళ్ల యాజమాన్యాలు లేవనెత్తిన ఇతర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన

- అవినీతి, అక్రమాలు, దోపిడీకి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే కారణం :కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక, అవినీతి పాలన నడుస్తున్నదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. అవినీతి రహిత పాలన అందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న, అవినీతి అక్రమాలకు, దోపిడీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. పదేండ్ల అధికారంలో మోడీ క్యాబినెట్‌లోని కేంద్ర మంత్రులపైనా, ప్రభుత్వంపైనా రూపాయి అవినీతి చేసినట్టు కూడా ఆరోపణలు రాలేదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో పలు పార్టీల నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రజానీకం బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎనిమిది పార్లమెంట్ స్థానాలు ఇచ్చారని గుర్తు చేశారు.

పెట్టుబడుల పేరుతో మరోసారీ రేవంత్ మోసం

- ఆయన మాటలకు చేతలకు సంబంధం లేదు : బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెట్టుబడుల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారీ మోసానికి తెరలేపారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గతంలో అమెరికా, దావోస్ పర్యటనలతో భారీగా పెట్టుబడులు తెచ్చామని అసత్య ప్రచారం చేశారని గుర్తు చేశారు. తాజాగా అదే తరహ జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా తనను గుర్తించడం కోసమే రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కొత్త పెట్టుబడులు పక్కన పెడితే ఉన్న కంపెనీలు బిచాణా ఎత్తేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాలనను గాడిలో పెట్టలేక విదేశీ పర్యటన పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తాజాగా చేపట్టిన సింగపూర్, దావోస్ పర్యటనలో వస్తున్న పెట్టుబడులన్ని ఫేకేనని విమర్శించారు.



ముస్తాబవుతున్న సంగారెడ్డి



- రాష్ట్ర మహాసభలకు విస్తృత ఏర్పాట్లు
- బహుముఖ కార్యక్రమాలు, వైద్య శిబిరాలు,క్రికెట్ పోటీలు
- భారీ ఫ్లెక్సీలు, గోడరాతలు, పోస్టర్ ప్రచారం
- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జీపుజాత ప్రచారం
- వివిధ కళారూపాల శిక్షణ, పాటల చిత్రీకరణ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలకు సంగారెడ్డి ముస్తాబవుతోంది. మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎర్రజెండా సిద్ధాంత, పోరాటాల ప్రాధాన్యతను తెలియజేస్తూ బహుముఖ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలు, క్రికెట్ ఇతర ఆటల పోటీలు నిర్వహిస్తూ యువతను భాగస్వామ్యం చేస్తున్నారు. భారీ ఫ్లెక్సీలు, గోడరాతలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ సీపీఐ(ఎం) పేరిట లక్ష ఇండ్లను తిరిగి ప్రజల నుంచి విరాళాలు సేకరించే మాస్ క్యాంపెయిన్ జయప్రదంగా సాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ జెండా ఆవిష్కరణలు, జీపుజాత ప్రచార కార్యక్రమాలతో మహాసభల ప్రచారం మరింత ఊపందుకుంది. పోరాటాల సారథి ప్రజా ఉద్యమ కేంద్రం కేవల్ కిషన్ భవన్ ఎర్రతోరణలు, లైట్ల వెలుగులతో ముస్తాబైంది. 25న జరిగే భారీ బహిరంగ సభకు వేదిక, బ్యానర్స్, ప్రతినిధుల సభలు జరిగే గోకుల్ గార్డెన్ అలంకరణ వంటి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జీపుజాత, జెండావిష్కరణలు




ఈ నెల 17న ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ శాఖల ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. పార్టీ శాఖలున్న ప్రాంతాలు, గ్రామాలు, మండల, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచారం నిర్వహించేందుకు ఆదివారం జీపుజాత సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని ముఖ్యమైన పట్టణాల్లో జీపుజాత పర్యటించనుంది.

బహుముఖ కార్యక్రమాలు

ఈ నెల 25–28 తేదీల్లో జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఏర్పడిన ఆహ్వాన సంఘం బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తూ అన్ని వర్గాల ప్రజల్ని భాగస్వామ్యం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించింది. ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని పోరాడే సీపీఐ(ఎం) తన రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు దోహదపడే వైద్య శిబిరాలు పెట్టి పార్టీ విశిష్టతను తెలియజేసే ప్రయత్నం చేశారు. యువతను సైతం ఎర్రజెండా మహాసభల ప్రచారంలో భాగస్వామ్యం చేసేందుకు క్రికెట్ పోటీలు నిర్వహించగా వందలాది మంది యువకులు క్రీడల్లో పాల్గొన్నారు. వీరికి బహుమతుల్ని అందజేశారు. ఇప్పటికే కవులు, రచయితలతో జనకవనం, మేధావుల చేత సెమినార్లు, సదస్సులు నిర్వహించింది. మతోన్మాదం, సరళీకరణ విధానాలు, రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణ ముఖ్య అంశాలపై జరిపిన సెమినార్స్‌లో కార్మికులు, మధ్యతరగతి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు

రాష్ట్ర మహాసభల సందర్భంగా వివిధ కళలకు సంబంధించి పీఎన్ఎం ఆధ్వర్యంలో కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాటల శిక్షణ పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా మహిళలకు కోలాట శిక్షణ ఇస్తున్నారు. మహాసభల విశిష్టత, ఎర్రజెండా గొప్పదనం, సీపీఐ(ఎం) ప్రజా పోరాటాలకు సంబంధించి ప్రత్యేకంగా పాటల్ని రచించారు. ఆనందాచారి, సుద్దాల అశోక్‌తేజ వంటి ప్రముఖ రచయితలు రాసిన పాటల్ని చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన గానం, మ్యూజిక్‌తో కూడిన పాటలు ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు పీఎన్ఎం ప్రయత్నిస్తున్నది.



గోడరాతలు, ఫ్లెక్సీలు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర మహాసభల సందర్భంగా విస్తృతంగా గోడరాతలు రాశారు. సీపీఐ(ఎం) మహాసభల్ని జయప్రదం చేయాలని, పార్టీ సిద్ధాంత నినాదాలను తెలియజేస్తూ ఎర్రజెండా, సుత్తికొడవలి గుర్తుతో కూడి గోడరాతల్ని విస్తృతంగా రాశారు. హైదరాబాద్- సంగారెడ్డి -ముంబయి జాతీయ రహదారి వెంట రాసిన గోడ రాతలు ప్రజల్ని పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. పట్టణంలో ఇప్పటికే భారీ ఫ్లెక్సీలు పెడుతున్నారు. అదే విధంగా సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ బెలూన్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. మహాసభల సందర్భంగా 25న స్థానిక పీఎస్ఆర్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మూడు జిల్లాల్లోనూ ఆవిష్కరించి విస్తృతంగా అంటించారు. తెలుగు, ఊర్దూలో ముద్రించిన కరపత్రాలు, బ్రోచర్స్, స్టికర్స్ ద్వారా ప్రచారం చేశారు.

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

పోరాటాల గడ్డ సంగారెడ్డిలో జరుగుతున్న మహాసభలు రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొచ్చేందుకు దోహదపడే చర్చలు, నిర్ణయాలు చేయబడతాయని ఆ పార్టీ నాయకులు ఇప్పటికే ప్రకటించారు. పార్టీ సిద్ధాంతంలోని ప్రధాన అంశాలు, ప్రజా పోరాటాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సీపీఐ(ఎం) వైఖరిని తెలియజేస్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్రత్యేక టీమ్స్ సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆ దిశగా కృషి చేస్తోంది. సీపీఐ(ఎం) మహాసభల సందర్భంగా చేస్తున్న ప్రతి పనికి సంబందించిన ఫొటోలు, వీడియోల్ని అందమైన పోస్టర్స్‌గా మార్చి వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

ఎర్రజెండా పట్ల ప్రజల్లో ఆపూర్వ ఆదరణ



నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా లక్ష కుటుంబాల్ని కలిసి మహాసభల గురించి తెలియజేయాలని పిలుపునిచ్చాం. ఆ దిశగా సంగారెడ్డి జిల్లా కమిటీ పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, సదాశివపేట, కొండాపూర్, కంది, పుల్కల్, చౌటకూర్ కేంద్రాలతో పాటు మెదక్, సిద్దిపేట జిల్లాలోని అనేక ప్రాంతాల్లో దళాలుగా ఏర్పడి మాస్ ఫండ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. పారిశ్రామిక కార్మికులు షిఫ్టుల వారిగా డ్యూటీలు చేస్తూనే ఖాళీ సమయాల్లో ఫండ్స్ సేకరణ కోసం ఇంటింటికీ తిరిగే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. సీపీఐ(ఎం) కరపత్రం పంచుతూ మహాసభల నిర్వహణ, ప్రాధాన్యత, పార్టీ నిర్వహించే పోరాటాలు, సిద్ధాంత నిబద్ధత గురించి ప్రజలకు వివరిస్తూ విరాళాలు అడుగుతున్నాం. ఎర్రజెండా పార్టీ అనగానే అన్ని వర్గాల ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తుంది. పోరాడే పార్టీలుండాలని పేదలు, మధ్య తరగతి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు కోరుకోవడమే కాకుండా లేదనకుండా తోచిన ఆర్థిక సహాయం అందజేయడం సంతోషంగా ఉంది.

చుక్క రాములు, ఆహ్వాన సంఘం చైర్మెన్

పసుపు బోర్డుకు సార్థకత

పసుపునకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటిస్తేనే..



- పసుపు బోర్డును స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్సీ కవిత
- త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేసినట్టు వెల్లడి

దిగుమతులపై కేంద్రం నియంత్రణ విధించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అయితే, క్వింటాలు పసుపునకు రూ. 15 వేల కనీస మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తూతూమంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అరవింద్ రాజకీయాల్లో కూడా లేరని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని, ప్రొటోకాల్‌ను పాటించలేదని, ఇది ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధమని అన్నారు. పసుపు బోర్డును ఏర్పాటు చేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశానని గుర్తు చేశారు. పలువురు ముఖ్యమంత్రులను కలిసి మద్దతుగా లేఖలు సేకరించానని, ప్రధాని మోడీని రెండు సార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. దీనిపై పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడటమే కాకుండా ప్రయివేటు మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అంతేకాకుండా, పసుపుకు కనీస మద్దతు ధరను ప్రకటించాలని, దిగుమతులపై నియంత్రణ విధించాలని కూడా కేంద్రానికి అనేక సార్లు వినతులు అందించానని అన్నారు. ఇలా తాను గతంలో త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని వెల్లడించారు. 2014లో 8 లక్షల క్వింటాళ్ల దిగుమతి అయితే ఇప్పుడు రెట్టింపయ్యిందని, అయినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.రకరకాల మాటలతో రైతులను, ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ ఎంపీ అరవింద్‌పై విరుచుకుపడ్డారు. గాలి మాటలు మాట్లాడటం మానేసి పసుపునకు మద్దతు ధర సాధించాలని హితవు పలికారు. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిదని, పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని గతంలో అరవింద్ అన్నారని, పసుపును అవహేళన చేసిన అరవింద్‌కు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడం వల్లే గతంలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద గతంలో కేసీఆర్ 42 ఎకరాలు కేటాయించారని, ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జాక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించిందని, దాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మెన్ దాదన్నగారి విఠల్ రావు, బాజిరెడ్డి జగన్, నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్, మాజీ చైర్మెన్ అలీమ్ నాయకులు పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత బడా చొక్కారావు మృతిపై సందేహాలు!

- చనిపోయాడంటూ ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు పార్టీ లేఖ విడుదల
- మృతి అనుమానమే అంటున్న రాష్ట్ర ఇంటెలిజెన్స్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత బడా చొక్కారావు అలియాస్ సుధాకర్ చనిపోయారంటూ వచ్చిన వార్తలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మావోయిస్టు పార్టీలో కీలక నేతగా, స్పెషల్ మిలిటరీ కమిషన్ కార్యదర్శిగా చొక్కారావు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా కూడా ఆయన పనిచేస్తున్నారు. కాగా, 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో దాదాపు 17 మంది మావోయిస్టులు మరణించినట్టు ఆ పార్టీ చెబుతుండగా..పోలీసులు మాత్రం 12 మంది మాత్రమే చనిపోయారని కొందరి పేర్లను ప్రకటించారు. అయితే, మావోయిస్టు పార్టీ పేరుమీద ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో విడుదలైన లేఖలో సైతం కొన్ని పేర్లను ఇచ్చారు. అందులో సుధాకర్‌బాబు పేరు ఉన్నట్టుగా పేర్కొన్నారు. అయితే, వీరిపై అంతర్గతంగా విచారించిన యాంటీ నక్సలైట్ విభాగం అధికారులు మాత్రం చొక్కారావు మృతి వార్తను ధ్రువీకరించడం లేదు. నవతెలంగాణతో ఒక సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి మాట్లాడుతూ..'చొక్కారావు చనిపోయారని వారు చెబుతున్నారు. కానీ, మాకు ఇప్పటివరకూ సమాచారం ధ్రువీకరణ కాలేదు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన పార్టీ సీపీఐ

- కూడు, గూడు, భూమి కోసం పోరాటాలతో పేదల పక్షాన నిలిచింది
- మనమెందుకు అధికారంలోకి రాలేకపోతున్నామో ఆలోచన చేయాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి
- సిద్దిపేటలో ఘనంగా సీపీఐ శతజయంతి వేడుకలు

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

భారత కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీ అని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. కూడు, గూడు భూమి, కోసం అనేక పోరాటాలు చేసి పేదల పక్షాన నిలిచిన ఘనత సీపీఐదేనని అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శివానుభవ మండపం హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ శతజయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని విక్టరీ టాకీస్ నుంచి శివమ్స్ ఫంక్షన్ హాల్ వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. శతజయంతి సభలు జరుపుకున్నాం కానీ.. మనం అధికారంలోకి ఎందుకు రాలేకపోతున్నామో ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రపంచంలోని చైనా, వియత్నాం, ఫిలిప్పీన్స్, క్యూబా వంటి దేశాల్లో పేదలకు విద్యా వైద్యం అందించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అక్కడి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు.

భారతదేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కార్మికుల హక్కులు హరించే విధంగా ఎన్డీయే ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని, వాటిపై ఏఐటీయూసీ, ఇతర కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పోరాటాలు చేయడంతో వెనక్కి తగ్గిందని తెలిపారు. దున్నేవానికే భూమి కావాలని పోరాటాలు చేసి అనేకమంది అసువులు బాసారని గుర్తుచేశారు.



ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

- కార్మిక-కర్షక పోరాటాలను ఉధృతం చేయాలి
- కార్మిక కర్షక ఐక్యత ర్యాలీలో..తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కార్మిక కర్షక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. 1982లో తమిళనాడులో రైతాంగ హక్కుల కోసం జరిగిన కార్మిక, కర్షక రైతాంగ ప్రదర్శన పైన ఆనాటి ప్రభుత్వం విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో 10 మంది నాయకులు అక్కడికక్కడే చనిపోయారు. వారిలో నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు రైతులు, ముగ్గురు కార్మికులు ఉన్నారని వారి పోరాటాన్ని స్మరించుకుంటూ జనవరి 19న సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాలనే దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవన్ నుంచి హమాల్‌వాడీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడ్ శోభన్‌తో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడారు. ఆనాడు కార్మిక కర్షక నేతలు లేవనెత్తిన కోరికలు నేటికీ నెరవేరలేదని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బెనారస్ నగరంలో కార్మిక వర్గ ప్రదర్శనపైన జనవరి 19న ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి కాల్పులు జరిపిందని, నిర్బంధంతో ఉద్యమాన్ని అణిచివేయాలని చూసిందని తెలిపారు. నేడు అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చి నిర్బంధ శ్రమ దోపిడీకి పూనుకోవాలని చూస్తున్నదని అన్నారు. మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని చూసిందని, పూర్తిగా మార్కెట్‌ను ప్రయివేటుపరం చేయబోతున్నారని, విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించి రైతాంగ బోర్‌లకు మీటర్లు బిగించి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నదని తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తివేయాలని కుట్ర జరుగుతుందని విమర్శించారు. ఆన్‌లైన్ పేమెంట్, ఆన్‌లైన్ మస్టర్, ఆధార్ కార్డు అనుసంధానం పేరుతో కూలీల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. బడ్జెట్లో నిధులను పూర్తిగా తగ్గించిందని, దీనివల్ల పెద్ద ఎత్తున పని దినాలు పడిపోయాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గోవర్ధన్, లక్ష్మి, చామతి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్‌తో ముకేశ్ అంబానీ దంపతులు భేటీ

- ప్రమాణస్వీకారానికి హాజరు

వాషింగ్టన్ డీసీ : అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ఒక రోజు ముందు డోనాల్డ్ ట్రంప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మెన్ ముకేశ్ అంబానీ దంపతులు భేటీ అయ్యారు. యూఎస్ క్యాపిటల్‌లో జరిగే ట్రంప్ ప్రమాణస్వీకారోత్సవంలోనూ అంబానీ దంపతులు హాజరుకానున్నారని ఈ కార్యక్రమానికి సంబంధించిన ఒక అధికారి తెలిపారు. వేదికపై ట్రంప్ క్యాబినెట్ మంత్రులు, అధికారులు, ఇతర ప్రముఖ అతిథులతో ఈ జంట కూడా ప్రముఖ స్థానం కలిగి ఉంటారని అధికారి చెప్పారు.

పాలస్తీనాలో శాంతికి రాజకీయ పరిష్కారం కనుగొనాలి



(మొదటిపేజీ తరువాయి)
విడుదల చేసింది. ఆ వివరాలు...

జమిలి ఎన్నికల బిల్లుపై...



లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిం చేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం పార్లమెం టులో రెండు బిల్లుల్ని ప్రవేశపెట్టింది. వీటిలో మొదటిది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. ప్రస్తుతం అమలులో ఉన్న మూడు క్లాజులను సవరించాలని, రాజ్యాంగంలో కొత్తగా ఓ క్లాజును చేర్చాలని అది ప్రతిపాదించింది. పూర్తి పదవీకాలం ముగియక ముందే లోక్‌సభ రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరపాలని వీటిలో ఒక సవరణ చెబుతోంది. ఉదాహరణకు ఎన్నికలు జరిగిన మూడు సంవత్సరాలకు లోక్‌సభ రద్దయితే తదుపరి ఎన్నికలను రెండు సంవత్సరాల కాలపరిమితికి మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్ర శాసనసభలకు సంబంధించి కూడా ఇలాంటి సవరణనే ప్రతిపాదించారు. ఏదైనా రాష్ట్ర శాసనసభ పదవీకాలం మధ్యలోనే రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరుపుతారు. ఇది రాజ్యాంగంలో పొందపరచిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య మౌలిక స్వభావానికి వ్యతిరేకం. ఇలా రాష్ట్ర శాసనసభ పదవీకాలాన్ని కుదించడం సమాఖ్యకు, ఎన్నికైన శాసనసభ్యుల హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఈ రెండు బిల్లులను తదుపరి పరిశీలన, సమీక్ష నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి నివేదించడం జరిగింది.

'ఒకే దేశం...ఒకే ఎన్నిక' విధానాన్ని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విలువ ఇచ్చే వారందరూ ఈ రాజ్యాంగ సవరణ బిల్లుల్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చింది.

మందిరం-మసీదు వివాదాలపై...

1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశంలోని పలు స్థానిక న్యాయస్థానాలలో పిటిషన్లు దాఖలయ్యాయి. మసీదుల స్వభావాన్ని అవి ప్రశ్నిస్తున్నాయి. వాటి కింద దేవాలయాలు ఉన్నాయని వాదిస్తున్నాయి. ఆయా ప్రదేశాలలో సర్వేలు నిర్వహించాలని కోరుతున్నాయి. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో ఇలాగే జరిగింది. అక్కడ పిటిషన్ దాఖలైన రోజే కోర్టు సర్వేకు ఆదేశించింది. ఆ తర్వాత జరిగిన ఘటనలు నిరసనలకు, ఐదుగురు ముస్లిం యువకుల మరణానికి కారణమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు హిందూత్వ శక్తుల అజెండాను ఎలా ముందుకు తీసుకుపోతున్నారో ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. రాజస్థాన్‌లో కూడా స్థానిక కోర్టు అజ్మీర్ షరీఫ్ దర్గాలో సర్వే నిర్వహించాలన్న పిటిషన్‌ను అనుమతించింది.



1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ హిందూ సంస్థలు దాఖలు చేసిన కొన్ని పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు...దిగువ కోర్టులో దాఖలైన అన్ని వ్యాజ్యాలు, వాటి ఆదేశాల ప్రకారం జరుగుతున్న సర్వేలపై స్టే విధించింది.

ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సమర్థించాలని, ప్రార్థనా స్థలాలపై వివాదాలను లేవనెత్తేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకొని చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సుప్రీంకోర్టును కోరింది.

యూజీసీ ముసాయిదా నిబంధనలపై...

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ముసాయిదా నిబంధనలు-2025ను కేంద్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వ నియంత్రణలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల ఎంపికలో రాష్ట్రాలకు ఉన్న హక్కులపై ఈ నిబంధనలు నేరుగా దాడి చేస్తున్నాయి. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం త్రిసభ్య ఎంపిక కమిటీని నియమించే అధికారం గవర్నర్-చాన్సలర్‌కు సంక్రమిస్తుంది. దానికి చాన్సలర్ ఎంపిక చేసిన వ్యక్తే చైర్‌పర్సన్‌గా ఉంటాడు. ఎంపిక కమిటీకి ఎవరిని నియమించాలనే విషయంలో రాష్ట్రాలు చెప్పేదేమీ ఉండదు. అంటే దీనర్థం ప్రభుత్వ అజమాయిషీలోని యూనివర్సిటీలలో గవర్నర్లు-చాన్సలర్ల ద్వారా కేంద్రం తన ఇష్టానుసారం వైస్ చాన్సలర్లను నియమించవచ్చు. గవర్నర్లు ఇప్పటికే ఏకపక్షంగా చాన్సలర్ పదవిని అడ్డం పెట్టుకొని నిబంధనల్ని తుంగలో తొక్కుతున్న ఉదంతాలను మనం చూస్తున్నాము. బీజేపీ-ఆర్ఎస్ఎస్ శిబిరానికి సన్నిహితంగా ఉండే వారిని వైస్ చాన్సలర్లుగా రుద్దుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన నిబంధన. దీనిని తప్పనిసరిగా వ్యతిరేకించాల్సిందే. ముసాయిదాకు తుది రూపు ఇస్తే బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఈ నిబంధనలను సవాలు చేయాల్సి ఉంటుంది.

వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా ఫ్రేమ్‌వర్క్‌పై...

రైతుల ఆందోళన కారణంగా ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాలలోని అంశాలను తిరిగి తెర పైకి తెచ్చేందుకు ఈ విధాన ఫ్రేమ్‌వర్క్ ప్రయత్నిస్తోంది. ప్రయివేట్ హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని ఇది ప్రతిపాదిస్తోంది. కార్పొరేట్ ప్రాసెసర్లు, ఎగుమతిదారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాల నుంచి కొనుగోళ్లు జరిపేందుకు అనుమతిస్తోంది. సంప్రదాయ మార్కెట్ యార్డులు కార్పొరేట్ నియంత్రణలోకి వెళతాయి. రాష్ట్రంలో ఒకే రకమైన మార్కెట్ ఫీజును, ట్రేడింగ్ లైసెన్స్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ముసాయిదా ప్రతిపాదించింది. బడా కార్పొరేట్ సంస్థలు ఏపీఎంసీ మార్కెట్ యార్డులకు వెళ్లకుండా నేరుగా రైతుల నుంచే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఇది వీలు కల్పిస్తోంది.



పార్టీ జాతీయ మహాసభలకు సన్నాహాలు

ఈ సంవత్సరం ఏప్రిల్ 2-6 తేదీల మధ్య మదురైలో జరగనున్న 24వ పార్టీ మహాసభల ముందు ఉంచే ముసాయిదా రాజకీయ తీర్మానంపై కేంద్ర కమిటీ చర్చించింది. ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కేంద్ర కమిటీ ఖరారు చేసింది. పార్టీలోని అన్ని స్థాయిలలో చర్చించేందుకు వీలుగా దీనిని ఫిబ్రవరి 1వ తేదీన విడుదల చేస్తారు. పార్టీ మహాసభలకు సంబంధించిన 'సంస్థాగత ముసాయిదా తీర్మానాన్ని' ఖరారు చేసేందుకు మార్చి 22, 23 తేదీలలో సమావేశం కావాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.



ముసాయిదా విధానానికి వ్యతిరేకంగా కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చ ప్రారంభించిన ఆందోళనకు కేంద్ర కమిటీ పూర్తి మద్దతు తెలిపింది.

ఈ విధానానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని పార్టీ శాఖలన్నింటికీ పిలుపునిచ్చింది.

ఈసీ నిబంధనలపై...

ఎన్నికల నిబంధనలకు ఎలక్షన్ కమి షన్ ఏకపక్షంగా మార్పులు ప్రకటించింది. వీడి యోలు, ఇతర డిజిటల్ విచారణలు సహా ఎలక్ట్రానిక్ రికార్డులు పొందేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సంబంధిత పౌరులకు అవకాశం లేకుండా చేసింది. ఎన్నికల కమిషన తీసుకున్న ఈ తిరోగమన చర్య స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియపై మరో దాడే. ఈ అంశంపై చర్చించి, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు వీలుగా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర కమిటీ ఎన్నికల కమిషన్‌ను కోరింది.

కేజ్రీవాల్‌ను అడ్డుతొలగించేలా బీజేపీ కుట్ర : అతిశీ

న్యూఢిల్లీ : అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్నికల్లో ఓడించలేని బీజేపీ అతన్ని 'తొలగించడానికి' కుట్ర చేస్తోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై దాడి చేసిన వ్యక్తుల్లో ఒక వ్యక్తి తరచూగా పర్వేష్ వర్మతో కనిపిస్తుంటారని అతిషి పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌పై పర్వేష్ వర్మ పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్ కారుపై శనివారం రాళ్లదాడి జరిగిన



నేపథ్యంలో కేజ్రీవాల్ భద్రతపై అతిశీ ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌తో కలిసి అతిశీ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కేజ్రీవాల్‌పై దాడి చేసి, కారుపై రాళ్లు విసిరిన వ్యక్తులు తీవ్రమైన నేరస్తులు. వారిపై దోపిడీ, హత్యాయత్నంతో ఇప్పటికే కేసులు నమోదై ఉన్నాయి' అని తెలిపారు. కేజ్రీవాల్‌పై దాడిలో పాల్గొన్న రాహుల్ అలియాస్ షంకీ పర్వేష్ వర్మకు 'అత్యంత సన్నిహితుడు' అని తెలిపారు.

మూసీ ప్రక్షాళన కోసం సీపీఐ(ఎం) పోరుయాత్ర

నేడు ప్రభుత్వ ఎజెండాగా.. మూసీ ప్రక్షాళన

ఫలించిన 180 రోజుల ఎర్రజెండా పోరాటం
మూసీ ప్రక్షాళనకై వెంటనే డీపీఆర్ ప్రకటించాలి : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

మూసీ వెంట మసిబారిన బతుకులను మార్చడానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 180 రోజుల పాటు సాగిన మూసీ ప్రక్షాళన పోరుయాత్ర, బస్సు యాత్ర పోరాట ఫలితమే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వ మూసీ ప్రక్షాళన ఎజెండా. మూసీ ప్రక్షాళనకై, ప్రత్యామ్నాయంగా గోదావరి-కృష్ణా జలాల సాధనకై యాదాద్రి భువనగిరి జిల్లావ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం జరిగింది. పలుమార్లు సెమినార్లు, చర్చాగోష్టులు జరిగాయి. సీపీఐ(ఎం) పోరుయాత్ర పేరుతో ఊరూరా సభలు, ఊరేగింపులు నిర్వహించి వేలాదిమందిని చైతన్యపరిచింది. లక్ష సంతకాల సేకరణ కోసం అనేక గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి సంతకాలు చేయించడంతో పాటు గ్రామాల్లో సామూహిక నిరసనలు చేపట్టారు. జిల్లాలో నిర్మిస్తున్న బస్వాపురం ప్రాజెక్టు నీటిని మూసీ కాల్వలోకి మళ్ళిస్తే కాలుష్యం నుంచి శాశ్వత విముక్తి లభిస్తుందని, దీనికనుగుణంగా ప్రభుత్వం సర్వే నిర్వహించాలని ఆపార్టీ డిమాండ్ చేసింది. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే ఆందోళనా పోరాటాల్లో ప్రజలు మహోద్యమంగా కదిలి.. పాలకుల మెడలు వంచి మూసీ కాలుష్య ప్రక్షాళన సాధించుకోవాలనే లక్ష్యంగా ఎర్రజెండా ప్రజలకు అండగా నిలిచింది.

ఒకప్పుడు జిల్లాకు వరప్రదాయినిగా భావించిన మూసీనది నేడు దుఃఖదాయినిగా మారింది. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తెలంగాణలో పుట్టి తెలంగాణలోనే ముగించబడిన ప్రస్థానం మూసీది. హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల గొంతు తడిపి బీడుబారిన భూములకు పచ్చదనాన్ని అందించింది. చారిత్రక అనుబంధం కలిగి ఈ ప్రజల జీవితాలతో పెనవేసుకొని పరవళ్లు తొక్కింది. మూసీనదికి ఐదు ఫీడల్ చానల్ ద్వారా పిల్లాయిపల్లి కాలువ, మూసీనది కాలువ, భీమలింగం కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువ, ఆసిఫ్ నగర్ కాలువతో ముడిపడి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్, పోచంపల్లి, భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, రామన్నపేట, మోత్కూర్, ఆత్మకూర్‌తోపాటు నల్లగొండ జిల్లాలో చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, కేతేపల్లి, శాలిగౌరారం వరకు ఉంది. 40ఏండ్ల కింద ఎంతో స్వచ్ఛతను సంతరించుకున్న మూసీనీరు ఇప్పుడెందుకు కాలకూట విషంగా మారింది? దీనికి కారకులెవరు? పాలకుల బాధ్యత ఏమిటి? అని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు 180 రోజులపాటు చెట్టు, పుట్ట, ఊరు, నగరం అని తేడా లేకుండా ప్రజలను చైతన్య పరిచేందుకు సీపీఐ(ఎం) పోరుబాట సాగింది. మూసీ కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రబలుతున్న వ్యాధులకు కారకులు ఎవరు? ప్రశ్నలకు జవాబులు వెతకడమే కాదు, ఎదురు తిరిగి నిలదీయకుంటే ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు అంధకారమవుతుందని చాటిచెప్పింది.

కాలుష్యానికి కారణమిదే..

మూలాలను వెతికి ఎర్రజెండా పోరుబాట పట్టింది. ప్రతిరోజు మూసీలో వందలాది పరిశ్రమల వ్యర్థాలు, రసాయన పదార్థాలు కలుస్తున్నాయి. ఫార్మా కంపెనీలు ఇష్టానుసారంగా వదిలిన ఔషధవ్యర్థాలు, పటాన్ చెరు, జీడిమెట్ల, నాచారం పారిశ్రామిక ప్రాంత కెమికల్స్, మూసీ వెంట వెలిసిన కంపెనీల వేస్టేజీ మూసీలో కలుపుతున్నారు. అలాగే జనసాంద్రత కలిగిన హైదరాబాద్ నగరం మురికి నీరు, మానవ వ్యర్థాలు, డిటర్జెంట్ నీళ్ళు, చెత్తాచెదారంతో మూసీ తన ఉనికిని కోల్పోయి డంపింగ్‌యార్డుగా మారిపోయింది. రెండేండ్ల కింద దాదాపు 350 మిలియన్ల లీటర్ల కాలుష్యం మూసీలో కలిసేది. ఇప్పుడది క్రమంగా పెరిగి 1625 మిలియన్ లీటర్లకు చేరుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూసీ నది కాలుష్య కేంద్రంగా మారింది. స్విట్జర్లాండ్‌కు చెందిన సంస్థ 'ఫార్మా స్యూటికల్ పొల్యూషన్ ఇన్ ది వరల్డ్- రివర్స్' పేరుతో అధ్యయనం చేసి 1405 దేశాల్లోని 258 నదుల్లో నీటి పరీక్షలు నిర్వహించింది. మనదేశంలోని యమున, మూసీ నదుల నీళ్లను పరిశీలించి ప్రపంచంలోని డేంజరస్ నదుల్లో మూసీ 22వ స్థానంలో ఉన్నదని 'ది ప్రొసిడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమి ఆఫ్ సైన్సెస్' అనే జర్నల్‌లో వివరాలు ప్రచురించింది. దాని ప్రకారం.. మూసీ నీటిలో 48 రకాల క్రియాశీలక ఔషధ పదార్థాల (ఏపీఐ) ఆనవాళ్ళు ఉన్నట్టు శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో తెలిపారు. ద యాంటీ బయాటిక్స్ (బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు వాడే మందులు), యాంటీ డిప్రెసెంట్లు ఎక్కువ మోతాదులో ఉన్నాయని వెల్లడించారు. నీటిలో 0.3 మి.గ్రా. ఉండాల్సిన బయోకెమికల్ ఆక్సిడెంట్లు 172 ఎంజీ నుంచి 185 ఎంజీ వరకు చేరాయి. ఈ పరివాహక ప్రాంతంలో 70కి.మీ దాకా నీరు కలుషితమైంది. 40 లీటర్ల లోతుల్లో కాలుష్య కారకాలు ఉన్నాయి. అంతేకాదు, ఈ నీటి ద్వారా ప్రజారోగ్యం దెబ్బతిని రకరకాల క్యాన్సర్లు, కిడ్నీ జబ్బులు, చర్మ వ్యాధులు, గర్భస్రావాలు, ఆర్థరైటిస్, గొంతునొప్పి, కడుపునొప్పితోపాటు అంతుచిక్కని వింత వ్యాధులతో వెలకట్టలేని నష్టం జరుగుతుందని సైంటిస్టులు తమ పరిశోధనల్లో తెలిపారు.

ఆరోగ్యం దెబ్బతింటున్నా.. జీవనాధారాన్ని వదలలేని పరిస్థితి

మూసీపైనే ఆధారపడిన బతుకులు ఒకవైపు తమ ఆరోగ్యం దెబ్బతింటున్నా పంటలు, భూములను వదిలివెళ్లలేక బతుకెళ్లదీస్తున్నారు. దశాబ్దాలుగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు మూసీపై ఆనకట్టలు నిర్మించి.. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, భీమలింగం, ఆసిఫ్‌నహర్ కాల్వల ద్వారా పంటలు పండించుకొంటున్నారు. ప్రధానంగా భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, రామన్నపేట, ఆత్మకూరు, మోత్కూరు మండలాల్లో వందకుపైగా గ్రామాల్లో వరి, కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. పాడి పరిశ్రమ, మత్స్యసంపద కూడా ఇక్కడ జీవనాధారంగా ఉన్నది. అనేక అధ్యయనాల్లో తేలిన అంశాలను బట్టి పండించిన పంటలతో పాటు పాలు, మత్స్య సంపదలో కూడా పలు హానికరమైన విషపదార్థాలు ఉంటున్నట్టు తేలింది. క్రమేపీ ఈ ప్రాంతంలో పండిన పంటలు, చేపలు, వాడటానికి ప్రజలు భయపడుతున్న పరిస్థితి ఉంది. మూసీయేతర ప్రజలు ఈ పంటలను నిరాకరిస్తున్నారు. ఈ స్థితి రోజురోజుకు పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఈ పరిణామాలతో ప్రజల ఆరోగ్యమే కాకుండా ఆదాయమూ దిగజారుతున్నది.


నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వాలు

ఇంత జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రపు చర్యలే తీసుకుంటున్నాయి. ప్రక్షాళన పేరిట హైదరాబాద్‌లో కొన్ని చోట్ల నీటి శుద్ధికేంద్రాలు పెట్టి చేతులు దులుపుకున్నాయి. నిత్యం 1500 మిలియన్ లీటర్ల మురుగు, మానవ వ్యర్థాలు వెలువడుతుంటే ఎస్‌టీపీల ద్వారా కేవలం 750 మిలియన్ లీటర్ల నీటినే శుద్ధి చేస్తున్నారు. మిగతా మురుగంతా మూసీలోనే కలుస్తుంది. ప్రజారోగ్యాన్ని తీవ్రంగా నష్టపరిచే భయానక రసాయనాలు మూసీలో కలుపుతున్న పరిశ్రమలపై కఠినచర్యలు తీసుకోకుండా పాల్యూషన్ కంట్రోల్ బోర్డు మొద్దు నిద్ర నటిస్తున్నది. మూసీపై పర్యవేక్షణ లేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇప్పటి వరకు ఎక్కడా నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కూడా హైదరాబాద్ మేరకు పరిమితమై పనిచేస్తున్నది. అదికూడా ప్రక్షాళన వదిలి సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నది. దీనివల్ల ఉపయోగం లేదు. ఇక కేంద్ర ప్రభుత్వం మూసీ ప్రాంత ప్రజల బతుకులను గాలికి వదిలేసి తమకు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తోంది. నదుల ప్రక్షాళనకై ఎస్ఆర్‌సీపీ (జాతీయ నదుల సంరక్షణ ప్రణాళిక) జలశక్తి అభియాన్ లాంటి పథకాలు ఉన్నా మూసీ ప్రక్షాళనకు నయా పైసా విదల్చడం లేదు. తెలంగాణ మూసీ ఫ్రంట్ రూ.8వేల కోట్ల ప్రతిపాదనలు పంపి ఏండ్లు గడుస్తున్నా నిధులు మంజూరు చేయకుండా కేంద్రం మాటలతో కాలయాపన చేస్తున్నది. ప్రతియేటా కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (ఎన్ఎంసీజీ) పేరుతో గంగా ప్రక్షాళనకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వం మూసీపై ఎందుకు వివక్ష చూపిస్తుందో కేంద్రాన్ని నిలదీయాల్సి ఉంది. తెలంగాణ ప్రాంత బీజేపీ ఎంపీలు, నేతలు మూసీ ప్రక్షాళనపై సమాధానం చెప్పాలి.

ప్రజలు ఏమి అనుకుంటున్నారు...

సీపీఐ(ఎం) సుదీర్ఘ పోరాట ఫలితంగా కనువిప్పైన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు చేపడ్తామని ప్రకటించింది. మూసీ పరివాహక ప్రాంతంలో ఏండ్ల తరబడి నివాసం ఉంటున్న పేద, బడుగు, బలహీన వర్గాలపై హైడ్రా పేరుతో కూల్చివేతలు మొదలుపెట్టింది. మూసీ ప్రక్షాళన జరుగుతుందా? లేక సుందరీకరణపై దృష్టి కొనసాగుతుందా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. హైదరాబాద్‌లో మూసీ చుట్టూ ఏండ్ల తరబడి దశాబ్దాల కాలంగా నివాసం ఉంటున్న పేద ప్రజలను తరిమి ఆ ప్రాంతంలో రిసార్ట్స్ నిర్మాణం, పార్కులు, వాకింగ్‌ట్రాక్‌లు, సైకిలింగ్ ట్రాకులు.. నిర్మించాలన్న తపనతో అడుగులు ముందుకు వేస్తున్నట్టు కనిపిస్తుంది. సుందరీకరణ కన్నా ప్రక్షాళనపై ప్రేమ ఉంటే వెంటనే మూసీపై డీపీఆర్‌ను ప్రకటించి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి.

మూసీ ప్రక్షాళనకు వెంటనే డీపీఆర్ ప్రకటించాలి



సీపీఐ(ఎం) పోరాట ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మూసీ ప్రక్షాళనకై డీపీఆర్‌ను ప్రకటించి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. మూసీ ప్రక్షాళన చేస్తున్నామని చెప్పడం తప్ప కార్యాచరణ లేదు. మల్లన్న సాగర్ ద్వారా 5 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించి హిమాయత్ సాగర్, గండిపేట చెరువులు నింపి కింది ప్రాంతాలకు కృష్ణా, గోదావరి నీటిని ఇస్తామని ప్రభుత్వం చెబుతుంది కానీ ఇప్పటివరకు స్పష్టత లేదు. మూసీ ప్రక్షాళన పేరుతో హైదరాబాద్‌లో 10 కి.మీ ప్రక్షాళన చేసి వదిలేస్తామంటే ఊరుకునేది లేదు. యాదాద్రి జిల్లా పరిస్థితి ఏంటనేది ప్రశ్నగా మారింది. ఇప్పటి వరకు ప్రభుత్వానికి ప్రణాళిక లేదు, నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. మూసీనది కలుషితం చేస్తున్న పరిశ్రమలపై నేటివరకు చర్యలు తీసుకోలేదు. కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎన్ని ఎస్టీపీలు మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేస్తారో స్పష్టం చేయాలి. మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి కోసం బీబీనగర్ ఎయిమ్స్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. పాలకుల నిర్లక్ష్యానికి గురై ప్రజల ఆరోగ్యం, పంటలు నష్టపోయిన వారికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. మూసీ పరివాహక ప్రాంతాన్ని స్పెషల్ జోన్‌గా గుర్తించి అభివృద్ధి చేయాలి. బసవపురం వేగంగా పూర్తి చేసి మూసీ పరివాహక ప్రాంత కాలువలను గోదావరి నది నీటితో అనుసంధానం చేయాలి. లేకుంటే ప్రజల పక్షాన సీపీఐ(ఎం) మరోసారి పోరాటం చేస్తుంది.

-ఎండీ జహంగీర్, సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి



విహంగమై ఎగురుతున్న

పాఠశాలలకు సెలవులు ఇచ్చారు
బాల్యం ఆకాశంలో పతంగయ్యింది
వీధులలో అల్లరి వరదై పారుతుంది
ఇల్లంత సందడితో నిండుతుంది
చదువు పంట సాగు చేసిన
కనురెప్పలు
తాళ్ళను విప్పుకొని నిద్ర చెట్టు కింద
రెప్పలు వాల్చాయి
తల్లిదండ్రులకు బాల్యం
గుండెచప్పుడు వినిపిస్తుంది
బాల్యం ఇంట్లో పెరుగు మీగడై
వొలికి పోతుంది
చదువు బరువు మోసి మోసి
వంగిన మనసు
జూలు విప్పుకొని నిటారై
పరుగు తీసింది
ఎప్పుడు చదువు చిల్కొయ్యకు
వేలాడుతున్న బాల్యం
విడుదలయ్యింది
పొట్టనిండా తింటే
నిద్ర దేవత వచ్చి
ఆవహిస్తుందని వెలితిగా ఉండే
చిన్ని బొజ్జలు నిండుగై
గురకపెడుతున్నాయి
ఉదయం సంధ్యా చూడక
పెలుసుబడ్డ బాల్యం
సూర్యరశ్మిలో తానం చేస్తుంది
మట్టి సొబగులు తెలియక
పీచుకట్టిన ఇప్పుడు అందులో
బొర్లి తనువుకు రుద్దుకుంటున్నాయి
మబ్బుల ఇరుకుల్లో
ఇరికిన చందమామ
స్వేచ్ఛగా ఇప్పుడు వెలుగులీనుతుంది

- గుండెల్లి ఇస్తారి
9849983874

సూఫీ పద్యం

వాకింగ్ అంటే
పొద్దున సాయంత్రం
పార్కుల్లోనో సర్వీసు రోడ్డుమీదో
కాలుకొద్ది తిరిగి రావటం అనే
తెలుసు మనకు-

సంభాషణ అంటే
పక్కనున్నపుడో ఎదురుపడినప్పుడో
ఇరుగుపొరుగుతో ఏదో ఒక మతలబును
వీలుకొద్ది పంచుకోవడం అనే గుర్తు మనకు-

నేను ముప్పై ఏండ్లకు పైగా
ఉదయ సాయంత్రాలు నడుస్తూ ఉండటాన్నే
బాగున్నానంటున్నాడొకాయన
తేనీటి రసభాషణంలో-



సమీపం దూరం
ఏ కరచాలనాన్ని నిరాదరించింది లేదు
ఆరుపదుల జీవికలో
సహవాసులు నాకో లాగరిథం పట్టిక
అంటున్నాడొకాయన
వాకరిని తనక్కూడా నడిపిస్తూ-

అబద్ధాల్ని నిజాలుగా రక్తికట్టించే
నీతిబాహ్యపు లోకాన
కట్టుకథలతో సత్యాన్ని తుదముట్టించే
విలోమ జగత్తులో
తన లోపలకు తను నడవకుండా
తనతో తను మాట్లాడుకోకుండా
మనిషి

బయట ఎన్నేండ్లు నడుస్తూ
ఎంత మందితో
ఎంత సుదీర్ఘంగా సంభాషించినా
బాగుండేది
బావుకునేది
వట్టి గుండుసున్నా అన్నాడో సూఫీ
అత్తర్ పద్యమొకటి ఆలాపిస్తూ-

ఆడంబరం తెర చించి
అహంభావం చెర విడిపించి
నడకనూ పలకరింపునూ
ముర్షిద్ వెనకాల ముస్తాబు చేయడానికి
సమయం లేదాయె.

- డా.బెల్లి యాదయ్య
9848392690

స్త్రీల పట్ల తెలుగు శతకాల చూపు!

ఈ శ్రీనివాస రెడ్డి

ఆంధ్ర వాఙ్మయమున శాఖోపశాఖలుగా వికాసమునందిన కావ్య ప్రక్రియల్లో శతకమొకటి. ప్రాకృత, సంస్కృత ప్రక్రియల ననుసరించి తెలుగు శతక రచన ప్రారంభమై, కాలక్రమేణా విశిష్ట సాహితీ ప్రక్రియగా రూపొందింది. తెలుగులో పన్నెండో శతాబ్దంలో శతకమావిర్భవించినది. ఈ ఎనిమిది వందల యేండ్లలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపంలోనూ స్వభావంలో ఎంతో మార్పు చెందింది. భారతీయ భాషల్లో ఎందులోనూ శతక ప్రక్రియ తెలుగులో వలె బహుముఖ వికాసము పొంది వైశిష్ట్యం పొందలేదు. నేటికీ ఏ మూలనో ఒక చోట శతకం వెలువడుతూనే ఉన్నది. సజీవ స్రవంతి వలె అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్నది శతకమే.

శతక పద్యాల్లో ఎక్కువగా లోక నీతులు, సామాజిక చైతన్యానికి సంబంధించినవి ఉంటాయి. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని పద్యాల్లో కనపరిచేవారు శతకకారులు. కుటుంబ వ్యవస్థలోని లోటు పాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అస్తవ్యస్తత మీద వీరు కలం ఝళిపించేవారు. ఈ పద్యాలకు బహుళ ప్రచారం లభించటానికి కారణాలు చాలా ఉన్నాయి. సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకొనేట్టు వారికి పరిచితమైన భాషలో, స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా, శక్తివంతంగా వ్యక్తీకరించటం, సామాన్యులైన వారిలో తమను ఒకనిగా భావించుకుని నీతి ఉపదేశం చేయటం ప్రధాన గుణం. సునిశితమైన హాస్య, వ్యంగ్య, అధిక్షేప చమత్కృతులతో కల్పించి, నవ్వించి ఎదుటివారి లోపాలను, తన లోపాలను, గుర్తెరిగి ఉపదేశించిన రీతిని గమనించేట్టు చేసే శైలిని ప్రదర్శించే వారు.

కానీ దురదృష్టవశాత్తు శతకాల్లో స్త్రీలకు ఇవ్వాల్సిన గౌరవమైన స్థానాన్ని ఇవ్వలేదు. మహిళల హక్కుల గురించి గాని, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి గానీ, వారు గురవుతున్న వివక్షత గురించి గానీ శతకాల్లో ఎక్కడా వివరించినట్టు మనకు కనపడదు. దానికి కారణం బహుశా శతకకారులు ఎక్కువ మంది పురుషులు అవ్వటం, వారు రచించిన కాలంలో సమాజంలో పురుషాధిక్యత ఎక్కువగా ఉండటం. శతకకారులు కూడా సామాన్య ప్రజానీకం వలే, పితృస్వామ్య వ్యవస్థ వైపు మొగ్గుచూపుతూ స్త్రీల పట్ల చిన్న చూపు కలిగి ఉండటం ఇంకొక కారణం.

మొదటగా మనం, వేమన శతకంలోని పద్యాలను పరిశీలించినట్లయితే మహిళల వ్యక్తిత్వాన్ని ఎంతో చులకనగా ఆయన చిత్రీకరించాడని చెప్పక తప్పదు. భార్య సంపద ఉన్నప్పుడు మాత్రమే భర్తను గౌరవిస్తుందని, భార్యను అదుపులో పెట్టుకోలేకపోతే గౌరవం ఇవ్వదని, మహిళలు మగవారికి ఎదురు చెప్పకూడదని, భర్త ఎంత చెడ్డ వాడైనా కూడా అతనిని సేవిస్తూ ఉండాలనే అభిప్రాయాన్ని తన పద్యాల్లో కనపరిచాడు. ఆధునిక భావజాలం కల వేమన మహిళల పట్ల ఇటువంటి ఆలోచనలు కనపరచడం కొంతవరకూ దురదృష్టకరం. వేమన మొదట స్త్రీలోలుడు. వేశ్యా వాటికల చుట్టూ తిరిగినట్టు చరిత్ర చెబుతోంది. వేమన రాజకీయాలు పట్టించుకోక ఒక వేశ్య వలలో చిక్కుకుంటాడు. వేమన వదిన నరసాంబ రాణి. ఆ వేశ్య.. రాణి ఆభరణాలు ధరించి అద్దంలో చూసుకోవాలని కోరుతుంది. మాతృప్రేమ గల నరసాంబ రాణి బులాకి తప్ప మిగతా అభరణాలు యిచ్చింది. వేశ్య బులాకీ కూడా కావాలని పట్టుబట్టింది. చీకట్లోనూ దీపంలాగే వెలిగే బులాకీని, ఆభరణాలు అన్నీ వేసుకున్న తర్వాత వేశ్య నగ్న దేహం చూడమనే షరతుతో ఇస్తుంది. అలా చూసిన వేమనకు మగువంటే విరక్తి కలిగి రోతపుట్టి, కోటకు వెళ్లి పడుకుంటాడు. బహుశా అటువంటి వారి సాంగత్యం వల్లే మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయానికి వచ్చి ఉండొచ్చు.

ఆలి తొలుత వంచ కథముదైతా వెనుక
వెనుక వంతు ననుట వెర్రితనము
చెట్టు ముదరనిచ్చి చిదిమితే బోవునా
విశ్వదాభిరామ వినుర వేమ

"భార్యను తొలిగానే అదుపులో పెట్టుకోవాలి. తర్వాత అదుపులో పెట్టుకోవచ్చులే అనుకొనుట వెర్రితనం. చెట్టు పెద్దదైన తర్వాత సులభంగా పీకలేం"

కలిమినాడు మగని కామముగాజూచును
లేమిఁజిక్కునాడు, లేవకుండు
మగువ మగనినైన మడియంగ జూచును
విశ్వదాభిరామ వినుర వేమ

"సంపద వున్నప్పుడు భార్య భర్తను ప్రేమతో చూస్తుంది. పేదరికంలో మంచంపై నుండి లేవకుండా ఇటువంటి భర్త చనిపోయినా బాగుండుననుకుంటుంది"

పై పద్యాల వంటివి స్త్రీలను చులకనగా చూపుతూ, పితృస్వామ్యాన్ని సమర్థిస్తూ చెప్పటం వేమన ప్రగతిశీల వ్యక్తిత్వానికి మచ్చగా మిగిలిపోతుంది.



> తెలుగులో శతక సాహిత్యం పామరులకూ పండితులకూ వారధిగా నిలిచింది. వీటిలో వేమన శతకానికీ, సుమతీ శతకానికీ ఉన్న ప్రాచుర్యము గురించి వేరే చెప్పాల్సిన పని లేదు. శతక రచనల్లో కవికి బోలెడంత స్వేచ్ఛ ఉంది. చదివేవాడికి కూడా రోజుల తరబడి ఒకే గ్రంథాన్ని అధ్యయనం చేయాల్సిన పని బడదు. కనుక ఒక్క పద్యంతోనే కవికీ, చదువరికీ అనుబంధం ఏర్పడవచ్చును. శతకాలు క్లుప్తంగా విషయాన్ని విడమరచి చెప్పే సాధనాలు. అందుకే ఇవి ప్రజా కవిత్వముగా ఆదరణ సంతరించుకొని ఉండవచ్చును. ఇంతటి ప్రాచుర్యం గల శతకాల్లో స్త్రీని తక్కువగా చూపి వర్ణించుట, వ్యక్తిత్వాన్ని కించపరచడం ఎంతైనా ఆక్షేపణీయం.

ఇప్పటి "సామాజి స్పృహ" పరంగా ఉన్న అవగాహనతో చూస్తే కొన్ని పద్యాల్లో కనిపించే ఆనాటి దృష్టి అసంబద్ధంగా కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీల పట్ల, కొన్ని కులాల పట్ల వ్యక్తమైన అభిప్రాయాలు దురాచారాలుగా అనిపిస్తాయి. ఎవరైనా తమ కాలానికి సంబంధించిన అభిప్రాయాలకు బందీలే అని మనం గ్రహించాలి.

క్రీ.శ. 1220-1280 మధ్య కాలంలో బద్దెన లేదా భద్ర భూపాలుడు రచించిన సుమతీ శతకంలో మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయాలే కనపడతాయి. ఇతడు కాకతీయ రాణి రుద్రమదేవి (1262-1296) రాజ్యంలో ఒక చోళ సామంత రాజు. బహుశా ఒక మహిళ రాజ్యమేలటం ఇష్టపడక పోవడం లేదా ఒక మహారాణి కింద సామంతురాజులా కొనసాగటానికి అభిజాత్యం అడ్డు కావడమో కానీ, మహిళల పట్ల ఇటువంటి అభిప్రాయలు వ్యక్తం చేసి ఉండవచ్చు. మహిళల నోళ్లలో నిజాలు దాగవని ప్రజలకు విశ్వాసం ఉండదని, భార్యలు కేవలం సంపాదన ఉన్న భర్తలకే గౌరవిస్తారని, స్త్రీలు ప్రేమిస్తారని నమ్మకూడదని అభిప్రాయాలను కవి తన పద్యాల్లో వ్యక్తం చేశాడు.

అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య, కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యముఁ
దెల్లని కాకులును లేవు తెలియర సుమతీ

అల్లుని మంచితనము, గొల్లవాని పాండిత్య జ్ఞానమును, ఆడదాని యందు నిజమును, పొల్లు ధాన్యములో బియ్యమును, తెల్లని రంగు కాకులు లోకములో నుండవు.

కోమలి విశ్వాసంబున
బాములతోఁజెలిమి యన్య భామలవలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును బొంకుర సుమతీ

స్త్రీల నమ్మకమును, పాముల స్నేహమును, పరస్త్రీల మోహమును, వేపచెట్ల తియ్య దనమును, రాజుల విశ్వాసమును నమ్మరాదు. అవి అసత్యములుగా నిర్ణయించి జీవనము చేయాలి అని భావం.

గడనగల మననిఁజూచిన
నడుగగడుగున మడుఁగులిడుచు రతివలు తమలో
గడ నుడుగు మగనిఁ జూచిన
నడుపీనుఁగు వచ్చెననుచు నగుదురు సుమతీ!

స్త్రీలు సంపాదన ఉన్న భర్తను చూస్తే అడుగులకు మడుగులు ఒత్తుతారు, పూజిస్తారు. సంపాదన లేని మగడిని చూస్తే నడిచే శవం వచ్చిందని హీనంగా మాట్లాడతారు.

ఇదే వరుసలో మర్రి వెంకయ్య రచించిన భాస్కర శతకం, పక్కి వెంకట నరసింహ కవి రచించిన కుమార శతకాలు కూడా వస్తాయి. వీరు కూడా మహిళల వ్యక్తిత్వాలను పురాణాల ఆధారంగా ఎప్పటివో పాత కథల ఆధారంగా చిత్రీకరించారు తప్ప కాలానుగుణంగా వస్తున్న మార్పులను వీరి పద్యాలలో కనపరచ లేకపోయారు.

అంగన నమ్మరాదు తనయంకెకురాని మహాబలాఢ్యువే
భంగుల మాయలొడ్డి చెఱపందల పెట్టు, వివేకియైన
సారంగధరుం బదంబుఁగరంబులు గోయఁగజేసెఁదొల్లిచి
త్రాంగియనేకముల్ నుడవరాని కుయుక్తులు పన్ని భాస్కరా!

స్త్రీ వ్యామోహముచే పురుషుని కోరగా అతడు నిరాకరించినచో వానికి అనేక నిందారోపణములు చేసి, రాజులచే కఠిన శిక్ష విధించు వరకు తన పన్నాగము వదలదు. పూర్వము చిత్రాంగియను స్త్రీ సారంగధరుని ప్రేమించగా, అతడు నిరాకరణ తెలుపగా రాజు వద్దకు వెళ్ళి అనేక ఫిర్యాదులు చేసి అతని కాళ్ళు, చేతులు నరికించినది కదా! అందుకే అలాంటి స్త్రీలను నమ్మరాదు. బలవంతుడైననూ బాధలకు గురియగును.

ఋణ మధిక మొనర్చి సమర్పణ
చేసిన తండ్రి విద్యరాని కొడుకు
లక్షణశాలి రాణి దుశ్చారిణియగు
జననియును దల్ప రిపులు కుమారా!

ఓ కుమారా! కుమారులకు అప్పులను ఆస్తులుగా ఇచ్చిన తండ్రి, విద్యలేని కుమారుడు, అందమైన భార్య, చెడునడత గల్గిన తల్లి ఆలోచించినచో వీరందరూ శత్రువులే సుమా!

సాధారణంగా ఇతర కావ్య, సాహిత్య ప్రక్రియలు పండితులకు పరిమితమైనాగాని, శతకాలు మాత్రం సామాన్య ప్రజానీకంలో ఆదరణపొందినవి. ఇలా తెలుగులో శతక సాహిత్యం పామరులకూ పండితులకూ వారధిగా నిలిచింది. వీటిలో వేమన శతకానికీ, సుమతీ శతకానికీ ఉన్న ప్రాచుర్యము గురించి వేరే చెప్పాల్సిన పని లేదు. శతక రచనల్లో కవికి బోలెడంత స్వేచ్ఛ ఉంది. చదివేవాడికి కూడా రోజుల తరబడి ఒకే గ్రంథాన్ని అధ్యయనం చేయాల్సిన పని బడదు. కనుక ఒక్క పద్యంతోనే కవికీ, చదువరికీ అనుబంధం ఏర్పడవచ్చును. శతకాలు క్లుప్తంగా విషయాన్ని విడమరచి చెప్పే సాధనాలు. అందుకే ఇవి ప్రజా కవిత్వముగా ఆదరణ సంతరించుకొని ఉండవచ్చును. ఇంతటి ప్రాచుర్యం గల శతకాల్లో స్త్రీని తక్కువగా చూపి వర్ణించుట, వ్యక్తిత్వాన్ని కించపరచడం ఎంతైనా ఆక్షేపణీయం.

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న నేటి ఆధునిక యుగంలో మహిళలను కించ పరిచే భావనలు వచ్చే పద్యాలను నేటి తరానికి అందుబాటులో లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. లేదా కాలానుగుణంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా శతకాల్లోని పద్యాలను కూడా మార్చాల్సిన అవసరం ఉంది.

గుండెకో స్వాంతన

నాకిప్పుడొక గుండె తోడు కావాలి
లేకుంటే ఆ గుండె శబ్దించే లయాత్మక ధ్వని
ఆగిపోతుందేమోననెలా

సగం మోదం
అర్థం ఖేదం
ఆనందం పంచే అమృత హృదయం
విషాదం మింగించే హాలహలం
ఈ ద్వయం నిరంతరం
నా మస్తిష్కంలో జొరబడి
తెగ అల్లకల్లోలం చేస్తున్నాయి

అంతర్వాహినిలో అసమాన
నిరుపమాన ప్రేమ కెరటాలు
ఒక్కోసారి శాంతంగా
ఇంకోసారి అవిశ్రాంతంగా
సందడి చేస్తూ అలజడి సృష్టిస్తూ
ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి

ఉన్నట్టుండి ఆకాశంలో విహారం
అధాటున అవనిపై పడదోయటం
ఇప్పుడు నా జీవనగమనంలో

ఎన్నెన్నో తీయని రాతిరి కలలు
మరెన్నో కరకు రాతి దెబ్బలు

అప్పుడప్పుడూ
నా గుండె గిన్నెలో కాసిన్ని
తేనెల మాటల ఊటలు జార్చినట్టే జార్చి
ఆ గిన్నెకు సూక్ష్మపు బెజ్జాలు పెట్టి
ఆ తావిని ఒలకబోస్తూ

అంటే మనసుకు సుగంధం పూసినట్టే పూస్తూ
తటాలున తిరస్కారపు సమ్మెతో కొట్టినట్టుగా

అందుకే... కనుకనే
నా గుండెకిప్పుడు
స్వాంతన కూర్చే లేపనం పూసే
ప్రేమ ధన్వంతరి కావాలి

ఈ నా హృదయంపై శాంతిగొల్పే
కమ్మని పలుకుల వాన కురవాలి
వదులైన తీగను సవరించి
శృతిలో పలికించే అనురాగ వీణ కావాలి.

- నాగముని. యం (నాగ్)
9490856185

చిరిగిన నోటు



నా చేతుల్ని నెలంతా కీబోర్డుకి
హవనంగా వేసా...
వేల లైన్ల కౌంటింగ్‌లో
అక్కడక్కడా వొవర్ మినిట్స్ కష్టం
ఉబ్బిన చేతల సాక్షిగా వగచుతాయి
నోళ్లు తెరిచిన కోరిక గొంతుక దప్పికని
పది జీతంరాళ్లు తీర్చలేక చతికిల బడ్డాయి
ఖర్మకాలి పేయి రెస్ట్ కోరితే
మొత్తంలోని కోతలు కలవర పెడతాయి
నెల జీతం కోసం
కళ్లు కాలెండర్‌కి ఉరేసుకుంటాయి
చిరిగిన వొక్క నోటుకై
బతుకుని ఉద్యోగానికి తాకెట్టు పెట్టినాను...
మధ్యతరగతి ఆశల కేకలలో
నిత్యం సతమతవుతూ జీవిస్తున్నాను.

- పుష్యమీ సాగర్, 7997072896

సాహితీ వార్తలు

21న వుప్పల నరసింహం యాదిలో సభ

సీనియర్ జర్నలిస్ట్, కథా రచయిత, వ్యాసకర్త వుప్పల నరసింహంను యాది చేసుకుంటూ ఈ నెల 21న మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం 1వ అంతస్తులో హైదరాబాద్ మిత్రులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సభ నిర్వహించనున్నారు. వుప్పల బాలరాజు సభాధ్యక్షులుగా, జయధీర్ తిరుమల రావు, బి.ఎస్.రాములు వక్తలుగా, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎస్.యం.ప్రాణ్ రావు, తుమ్మలపల్లి రఘురాములు, శంకర నారాయణ, అనిల్ అట్లూరి, వనపట్ల సుబ్బయ్య, కెపి.అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ తదితరులు ప్రసంగించనున్నారు.

రచనాతురాణాం న ధనం..

నేను పెన్ను పెట్టుకున్నన్ని రోజులూ
నా జేబుకి ఓ వెన్నెముక ఉండేది
క్రమంగా నేను
జేబులో డబ్బులు దోపుకోవటం చూసి
నా పెన్ను



తన పత్తీ (పాళీ), బుర్రా (క్యాప్) కొట్టుకొని
వద్దని మొత్తుకోవటం మొదలెట్టింది
నేనసలు విని బతికితే కదా!
పర్యవసానం...
ఇప్పుడు నా జేబుకి వెన్నునొప్పి వచ్చింది
పెన్ను పెయిన్‌తో రాయటమే లేదు

- నలిమెల భాస్కర్

అక్షర వైజయంతి 'స్వాతి శ్రీపాద'కు 'శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి పురస్కారం'

- డా. పత్తిపాక మోహన్, 9966229548

దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా తెలుగు నేల మీద ప్రతిభామూర్తులైన స్త్రీమూర్తులను సత్కరిస్తూ, ప్రతిష్ఠాత్మక 'శ్రీమతి సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం' అందిస్తోంది సుశీలా నారాయణ రెడ్డి ట్రస్టు. మహాకవి, భారతీయ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి సతీమణి సుశీలమ్మ పేర కుటుంబ సభ్యులు 1984లో ప్రారంభించగా, తొలి పురస్కారం విదుషీమణి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మకు అందించారు. ఇప్పటిదాకా నలభై ఒక్క మంది విద్వన్మణులైన స్త్రీ మూర్తులకు ఈ పురస్కారాన్ని అందించగా దీన్ని 'రసమయి' తన వేదిక మీద నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం 2025కు గాను ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, తెలుగు ఆంగ్ల భాషానువాదకులు, విశ్రాంత కేంద్రీయ విద్యాలయ ఆంగ్లోపాధ్యాయిని స్వాతి శ్రీపాదకు దక్కింది.

నాలుగు దశాబ్దాలుగా రచనలు చేస్తున్న స్వాతి శ్రీపాద, మరో ముగ్గురు కవులు తమ తొలి రచనలు ఇందూరు భారతి ద్వారా అచ్చువేశారు. స్వాతి శ్రీపాద నిజామాబాద్ డిగ్రీ కళాశాల విద్యార్థినిగా ఉన్నప్పుడే ఈ సంకలనం వచ్చింది. స్వాతితో ఇందులో కవిత్వం తెచ్చిన ఆనాటి నిజామాబాద్ నవ యువ కవులు ఏ.సూర్యప్రకాష్, సైబ, బద్దూరిలు. 'చౌరస్తా' పేరుతో వచ్చింది. కవుల ముఖ చిత్రాలతో సైక్లోస్టైల్ ప్రింటు రూపంలో వచ్చిన ఈ కవితా సంకలనం ఆనాటి తెలంగాణ యువ కవుల బలమైన సంతకాల్లో ఒకటి. 1970 నుంచి కవిత్వం రాస్తున్న స్వాతి శ్రీపాద నిరంతరం కవిత్వం, ఇతర ప్రక్రియల్లో రచనా వ్యాసంగం నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగరీత్యా వాటిని మరో రెండు దశాబ్దాల వరకు పుస్తకంగా తేలేదు. అటు తరువాత వెనుతిరిగి చూడలేదు. ఇప్పటి వరకు ఎనమది కవితా సంపుటాలు, ఆరు కథా సంపుటాలు, ఎనిమిది నవలలు, నలభైకి పైగా వివిధ భాషల్లోంచి తెలుగులోకి, తెలుగు నుంచి ఆంగ్లలోకి అనువాదాలు అచ్చయ్యాయి. తొలి యువ కవుల కవిత్వం చౌరస్తా తరువాత ఏర్చికూర్చిన కొన్ని కవితలను 'హృదయంలో అడుగులు' పేరుతో ప్రచురించింది స్వాతి. అటు తరువాత 'మనసుకు చూపుంటే...', 'ఎడారులు, ఎండ మావులు', 'సుప్తక్షణం', 'పోతబొమ్మ', 'కలలకు కాలం చెల్లింది' తెలుగు కవితా సంపుటాలు. 'వాకింగ్ టుగెదర్' పేరుతో ఆంగ్ల కవితా సంపుటి వచ్చాయి. 'మూగవీణ', 'అవతలివైపు', 'పొరలు', 'పంజరం విడిచి', 'మల్లెలు-కనకాంబరాలు' స్వాతి ప్రచురించిన కథా సంపుటాలు. 'పడమటి సూర్యోదయం', 'అపరిష్కృతం', 'పునరాగమనం', 'శిశిర వసంతం', 'చుక్కాని దీపం', 'జీవన వేదం', 'టగ్ ఆఫ్ వార్', 'ఎక్కడి నుంచి ఇక్కడి దాకా..' అచ్చయిన నవలా సాహిత్యం. నలభైకి పైగా తెలుగు, ఇంగ్లీష్‌లో చేసిన అనువాదాల్లో సాహిత్య అకాడమి, నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా వంటి సంస్థలతో పాటు డా.సినారె, డా.ఎన్.గోపి, కె.శివారెడ్డి మొదలు నేటి నవ యువతరం రచయితలు, కవుల రచనలను ఆంగ్లంలోకి చేశారు. తెలుగులోకి ఆంగ్లం, హిందీ నుంచి తెచ్చినవి, బాల సాహిత్య అనువాదాల సంఖ్య ఎక్కువే.



కవయిత్రిగా స్వాతి శ్రీపాదది విలక్షణ అభివ్యక్తి, చక్కని భావ చేతన. దీనిని తొలి కవిత్వం నుంచి నేటి దాకా తన రచనల్లో చూపుతారామె. ముఖ్యంగా 'సుప్త క్షణాలు' కవితా సంపుటి చూస్తే స్వాతి అభివ్యక్తి, శిల్పం తెలుస్తుంది. 'ఒక్కడ ఎవరైనా ఒకటే' కవితా సంపుటి కూడా ఇలాంటిదే. ఇందులోని ప్రతి కవిత పదునైన భావచిత్రాలకు ఆలవాలంగా నిలుస్తుంది. దీనికి సిరికోన సిలీకాన్ వ్యాలీ బహుమతి వచ్చింది. తనకు తారసపడిన అనేక సంఘటనలు, సందర్భాలను, తన మస్తిష్కాన్ని తొలచిన అంశాలను కవయిత్రి ఇందులో కవిత్వంగా మలిచింది.



కథా, నవలా రచయిత్రిగా స్వాతి శ్రీపాద ప్రతి అక్షరంలో సామాజిక సమస్యలు, సంఘర్షణలను, తన మనసులోని అలజడులను కథలుగా మలిచింది. ఒకటని కాదు ప్రతి సంపుటి అందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. విహారి కితాబు ఇచ్చినట్టు 'కథా సంవిధానాన్ని ఇడుపుగా పట్టుకున్న నేర్పరి' స్వాతి శ్రీపాద. మానవ జీవనంలోని అనేక పార్శ్వాలను ఎంత బాగా తన రచనల్లో వ్యక్తీకరించారో అమలిన శృంగారతత్త్వాన్ని కూడా తన రచనల్లో చక్కగా చెబుతారీమె. అందుకు స్వాతి రాసిన 'నీ కోసమె... నే' అనే కథ ఉదాహరణ. స్వాతి కథా కథన కౌశలానికి, నిర్వహణతో పాటు చక్కని ఉహకు ఈ కథను మేలిమిరాయిగా పట్టి చూపొచ్చు. వీరి అనేక కథలు మధ్యతరగతి నేపథ్యాన్ని, అందులోని సాధకబాధకాల్ని వ్యాఖ్యానిస్తాయి. వాటికి కొన్నిసార్లు తాను పుట్టి పెరిగిన నిజామాబాద్ నేపథ్యంగా నిలిస్తే మరికొన్నింటికి తాను పనిచేసిన ఇతర రాష్ట్రాల్లోని భాషా ప్రదేశాలు ఆకారాలవుతాయి. మరికొన్ని తాను నివసిస్తూ నిత్యం చూస్తున్న అపార్టుమెంట్ జీవితాలు, అమెరికా జీవితాలను చూపిస్తే... కొన్ని కథలు సమాజంలోని అనేక డొల్లలను మనకు వెక్కిరిస్తూ కనిపిస్తాయి. వీరి 'క్లాష్' కథను ఒకసారి మనం చూసినట్టయితే అది అనేకానేక అంశాలకు అతి పెద్ద కాన్వాస్‌గా మనకు కనబడుతుంది. కథను చెప్పనుగానీ కథలోని ప్రధాన పాత్రతో రచయిత్రి చెప్పించిన తీరు అదేంటో మనకు క్షణంలో అర్థమవుతుంది. ఇక స్వాతి శ్రీపాద నవలల విషయానికి వస్తే అన్నీ కూడా సమాజం తీరుతెన్నుల్ని, జీవితాలను ప్రతిబింభించేవే. ఎనిమిది నవలల్లో దేని విశిష్టత దానిదే అయినా, నవలా రచయిత్రిగా స్వాతిని విలక్షణంగా నిలబెట్టేది మాత్రం 'పురాగమనం' నవల. చదువుకున్న, నగరజీవులైన ఒంటరి మహిళగా కథానాయిక పాత్రను స్వాతి తీర్చిదిద్దిన విధానం అనితరసాధ్యంగా చెబుతారు 'దేరా'. ఒక్కమాటలో చెప్పాలంటే నిత్యం సంఘర్షణలకు లోనయ్యే ఆధునిక మహిళ అంతరంగం ఇది.

కవయిత్రిగా, కథా రచయిత్రిగా, అనువాదకులుగా దశాబ్దాలుగా తన ముద్రను వేసి, తనదైన సంతకాన్ని స్థిరపరచుకున్న స్వాతి శ్రీపాదకు ప్రతిష్టాత్మక సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం లభించడం ప్రతిభకు అందిన అరుదైన గౌరవం, మరో తెలంగాణ సాహితీమూర్తికి దక్కిన స్ఫూర్తి పురస్కారం.

(ఈ రోజు రవీంద్ర భారతిలో సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం అందుకుంటున్న సందర్భంగా...)

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

ఖమ్మం

సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

నిస్వార్థ వ్యక్తి దేవరశెట్టి ఉపేందర్

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరంలోని త్రీ టౌన్‌కు చెందిన దేవరశెట్టి ఉపేందర్ దశదినకర్మకి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్‌లు హాజరై ఉపేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపేందర్ చాలా నిజాయితీ గలిగిన వ్యక్తి అని అన్నారు. ఎప్పుడూ రైతుల పట్ల, కార్మికుల పట్ల న్యాయంగా ఉండేవారని, ఎల్లప్పుడూ అందరితో కలుపుగోలుగా ఉండేవారన్నారు. అలాంటి వ్యక్తి మరణించటం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్‌రెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు, సిఐటియు నాయకులు కే.గోపి, మాచర్ల సైదులు, ఉపేందర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

- పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యురాలు బండి పద్మ

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యురాలు బండి పద్మ పిలుపునిచ్చారు. మండల పరిధిలో పెద్దమండవ గ్రామంలో సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, సిపిఐ(ఎం) జోన్ ఇంచార్జ్ టీఎస్ కళ్యాణ్, మండల నాయకులు కందిమల్ల తిరుపతి, మాదారపు సత్యనారాయణ, గ్రామ శాఖ కార్యదర్శి మాదారపు శ్రీనివాసరావు, నాయకులు యడ్లపల్లి నరసింహారావు, తాళ్లూరి రామనాథం, అబ్బూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలి

- సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇంచార్జీ బండి రమేష్

నవతెలంగాణ -కూసుమంచి

ప్రతి వ్యక్తి అధ్యయనం చేయటం ద్వారా కొత్త విషయాలను తెలుసుకోవచ్చని, తద్వారా సమాజ మార్పు కోసం, ఒక వ్యక్తిగా తన అభివృద్ధి కోసం కూడా ఎంతగానో స్టడీ సర్కిల్ ఉపయోగపడుతుందని సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ ఇంచార్జీ బండి రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యడవల్లి పద్మా రెడ్డి భవనంలో పార్టీ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ...సమాజంలో నిత్యం జరుగుతున్నటువంటి అనేక మార్పులని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ శాస్త్రీయ సమాజం కోసం కృషి చేయాలన్నారు. అందుకు మార్క్సిజం ఆలోచన విధానం మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు.స్టడీ సర్కిల్ మండల కన్వీనర్ బిక్కసాని గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్టడీ సర్కిల్లో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా నాయకులు యడవెల్లి రమణారెడ్డి, షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, కర్ణబాబు, గన్యనాయక్, వెంకటయ్యమండల కమిటీ సభ్యులు రాధాకష్ణ నరసింహారావు, వీరారెడ్డి ఉపేందర్, వెంగళ రావు, లెక్చరర్ పాపారావు, వీరబాబు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతర కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి బంగ్లాలో తెలంగాణా రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ అండ్ క్యాలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు గవ్వ రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గ్యారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, దానికి గృహనిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని కోరారు. హౌసింగ్ సిబ్బందిని అందరినీ గత ప్రభుత్వం వివిధ శాఖలకు పంపించగా తాము తిరిగి మాతృ సంస్థకి తీసుకురావడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొగ్గుల వెంకట రామిరెడ్డి, నాయకులు కంది రవీందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి, కుమార్, రమేష్, రఘు, లింగయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మగౌరయాత్ర విజయవంతం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు

నవతెలంగాణ-ఖమ్మం

మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరయాత్ర విజయవంతమయిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కెవి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు తలపెట్టిన ఛలో మానుకోట తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవయాత్ర ఆదివారం విజయవంతమైందని ఈ ఛలో మానుకోట ఆత్మగౌరవయాత్రకు ఖమ్మం జిల్లా వివిధ మండలాల నుండి సుమారుగా 150 ఉద్యమకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికి 250 చదరపు గజాల ఇంటి స్థలాన్ని మరియు గృహాన్ని నిర్మించుకునేందుకు 10 లక్ష రూపాయలు సహాయం చేస్తానని ప్రకటించిందని అన్నారు. 6 గ్యారంటీల పథకంలో 6వ గ్యారంటీగా ఈ అంశాన్ని పొందుపరిచిందని, మిగతా 5 గ్యారంటీల పథకాలను అమలు చేస్తూ ఆ అంశాలను పత్రికా ముఖంగా సమావేశంలో చెప్పడం జరుగుతుందని, 6వ గ్యారంటీ అయిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాత్రం ఎక్కడా కూడా ఏ ప్రజా ప్రతినిధి కూడా ప్రస్తావించడం లేదని అన్నారు. గత ప్రభుత్వం కూడా ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిందని, అప్పుడు ఉద్యమకారులందరూ తమ బలాన్ని గడిచిన ఎన్నికలలో గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసి ప్రభుత్వాన్ని గద్దెదించారని అన్నారు. ఇప్పటికైనా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, నేలవెల్లి వెంకటేశ్వరావు, భూక్యా శ్రీనివాస్ నాయక్, రాచమల్ల ఉమా యాదవ్, రెడ్డెబోయిన వరలక్ష్మి, మోదుగు ఆశీర్వాదం, గోపయ్య గౌడ్, యాకూబ్, జగదీష్, లింగనబోయిన సతీష్, బట్టు రాజేంద్ర నాయక్, బెల్లంకొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు .

విశ్వశాంతిలో వేమన జయంతి వేడుక

నవతెలంగాణ-సత్తుపల్లి

జీవనసార తత్వాన్ని సమాజానికి ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన బోధించారని సృజన సాహితీ వేదిక నిర్వాహకులు, బొల్లేపల్లి మధుసూదనరాజు, గార్లపాటి రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో సృజన ఆధ్వర్యంలో వేమన జయంతిని నిర్వహించారు. విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మధుసూదనరాజు, రామకృష్ణ మాట్లాడుతూ వేమన పద్యం తెలియనివారు సమాజంలో ఉండరంటే అతిశయోక్తి కాదన్నారు. వేమన పద్యాలు జీవిత సత్యాలుగా, సువర్ణాక్షరాలుగానే కాక జీవిత సమస్యలకు పరిష్కారం చూపుతాయన్నారు. పద్యాలను నేర్చుకోవడం వల్ల నైతిక, మానవీయ విలువలు, జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థి దశనుంచి వేమన పద్యాలు చదవడం, రాయడం నేర్చుకోవాలని సూచించారు. ఆ దిశగా కృషిచేస్తున్న విశ్వశాంతి పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వమే వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం వేమన పద్య పఠన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వశాంతి యాజమాన్య బాధ్యులు పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు శైలజ, మణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాగ్దానాలు అమలు చేయాలి

- సీఐటీయు, రైతుసంఘం, వ్యకాస డిమాండ్

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాదినేని రమేష్‌లు పిలుపునిచ్చారు. సీఐటీయు, వ్యకాస, రైతుసంఘాల ఆధ్వర్యంలో స్థానిక వర్తక సంఘం భవనంలో సదస్సు జరిగింది. ఈ సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్యాణ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్‌లు మాట్లాడుతూ ఈ పది సంవత్సరాల కాలంలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం, ఈ రాష్ట్రంలో గతంలో పాలించిన కేసీఆర్ ప్రభుత్వంగానీ, ఇప్పుడు పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంగానీ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, పేదవారి ఎకౌంట్లలో 15 లక్షల రూపాయలు చొప్పున ఖాతాలో వేస్తామని, ఇల్లు లేని పేదవాడికి ఇల్లు కట్టిస్తామని ఎన్నో వాగ్దానాలు మోడీ ప్రభుత్వం చేసిందని, అవన్నీ తుంగలో తొక్కారన్నారు. బూర్జువా, బడా పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ ఆదానీలకు, అంబానీలకు వేలకోట్ల రూపాయలు మాఫీ చేస్తున్నాడన్నారు.కార్మికులకు కనీస వేతనం రూ.28వేలు ఇవ్వాలని, ఆ చట్టాన్ని కూడా అమలు చేయకుండా ఇంకా కార్మిక చట్టాలకు తూట్లు పొడిచే విధంగా చట్టాలు చేస్తా ఉందన్నారు. కార్మికులు యూనియన్ సంఘాలు పెట్టనీయకుండా సమ్మెలు చేయకుండా వాళ్ళ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయకుండా రైతుల మీద, కార్మికుల మీద దమనకాండ ప్రయోగిస్తా ఉందన్నారు. 50 రోజుల నుండి రైతు సంఘం నాయకుడు జగజ్జిత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడంలో విఫలమైందన్నారు. అలాగే వ్యవసాయ కూలీలకు 12000 రూపాయలు ఇస్తామని ఆ హామీని అమలు చేయలేదన్నారు.. అలాగే రైతు భరోసా రైతులకు 15వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలలో ప్రకటించి వాటిని అమలు చేయకుండా సమయాన్ని పెంచుకుంటూ పోతావుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వై విక్రం, మెరుగు సత్యనారాయణ, భూక్య శ్రీనివాసరావు, ఎంఏ జబ్బర్, షేక్ మీరా, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, ఎస్.నవీన్‌రెడ్డి, బత్తిని ఉపేందర్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, 31 డివిజన్ కార్పొరేటర్ ఎర్ర గోపి, యర్రా మల్లికార్జున్, వజేనేపల్లి శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు రేపాకుల వెంకన్న

- తుది శ్వాస వరకు ఎర్రజెండాతో పయనం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



సమాజంలో జనన మరణాలు సహజమే కానీ కొందరు మరణానంతరం కూడా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంటారని, అలాంటి కోవకు చెందిన వ్యక్తులు కమ్యూనిస్టు బాటలో నడిచిన పాపాయిగూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు రేపాకుల వెంకన్న అకాల మృతి తీరని మనో వేదనను గురి చేసిందని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. రేపాకుల వెంకన్న సంతాప సభ పాపాయిగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ శనివారం ఖమ్మం నగరంలోని ఈనాడు ఆఫీస్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. వెంకన్న నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ఎర్రజెండా నీడలో ఉంటూ పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేశాడని అన్నారు. అలుపు ఎరగని ఆదర్శ కమ్యూనిస్టుని అన్నారు. ఆయన మరణం పార్టీకి ఈ ప్రాంతానికి తీరనిలోటని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతిమ యాత్రలో పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే బసీరుద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల కార్యవర్గ సభ్యులు అంగిరేకుల నరసయ్య, బింగి రమేష్, పద్మనాభల సుధాకర్, మండల కమిటీ సభ్యులు పప్పుల ప్రసాద్, కోడి లింగయ్య, దాసరి మహేందర్, కొలిచలం స్వామి, దొడ్డ లింగస్వామి, పాపాయిగూడెం గ్రామ శాఖ కార్యదర్శి జాల ఉమేష్, పార్టీ సీరియల్ నాయకులు దొండేటి ఆనందరావు, ప్రజాపంథా జిల్లా నాయకులు కమ్మ కోమ్మటి నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చామకూరి రాజు, గ్రామ అధ్యక్షులు చామకూరి చంద్రశేఖర్, పప్పుల ఉపేందర్, దొండేటి నిర్మల్‌రావు, రమణబోయిన రవి, చల్ల వెంకటేశ్వర్లు, పిట్టల పాపారావు, పప్పుల చిన్న, ఉపేందర్, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలి

- మున్సిపాలిటీ పరిధిలో పేదలకు జాబ్‌కార్డు ఇవ్వాలి
- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

భూమిలేని వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలని, సత్తుపల్లి మున్సిపాలిటీలో ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి మండల కమిటీ సమావేశం కాకాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి పనితో సంబంధం లేకుండా భూమిలేని పేదలందరికీ 12 వేల రూపాయలు పథకం అమలు చేయాలన్నారు. ప్రజా పాలనలో రేషన్ కార్డు కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందించాలన్నారు. కార్డులో పేరు లేని కుటుంబ సభ్యులను చేర్చాలన్నారు. ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. ఇళ్ల స్థలాలు లేనివారికి స్థలాలు కేటాయించి ఇంద్రమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామ సభలో ఎంపిక చేయాలన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో దాదాపు 5వేల కుటుంబాలు పేదరికంలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే అవకాశం లేకుండా ఉందని దీనివల్ల తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ప్రభుత్వం అని చెప్పుకొంటూనే పేదల్ని దగాచేసి పనులను పేదలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు పేదలందరికీ సంవత్సరానికి 12వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చి అమలుకు వచ్చేసరికి మున్సిపాలిటీ పరిధిలో పేదలకు వర్తించకుండా నిర్ణయం చేయడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వం తన ఆలోచనని మార్చుకొని మున్సిపాలిటీ పరిధిలో పేదలకు కూడా 12 వేల రూపాయలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి మునిసిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పనులు పేదలకు కల్పించే విధంగా ప్రజలందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇప్పించేందుకు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు బాల బుచ్చయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కువ్వారపు లక్ష్మణరావు, ఎలగం రాములు, ముత్తిని శ్రీను, దేవల్ల రామారావు, బండి వేలాద్రి, హసావత్ కృష్ణ, సనందన్ రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన మట్టా

నవతెలంగాణ-కల్లూరు

పట్టణ పరిధిలోని ఎన్ఎస్పి క్రాస్ రోడ్డుకు చెందిన తురక సుబ్బారావు-దుర్గ కుమార్తె అన్నప్రాసన వేడుకలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ పాల్గొని ఆదివారం చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పసుమర్తి చందర్రావు, మండల నాయుకులు, భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, లక్కినేని కృష్ణ, ఆలకుంట నరసింహారావు, పరిమి భరత్, కాంతారావు, ధరావత్ మోహన్ నాయక్, గ్రామ నాయుకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి 23 వరకు గ్రామ సభలు

నవ తెలంగాణ-బోనకల్



ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో రురావత్ రమాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల గ్రామపంచాయతీ కార్యదర్శుల సంయుక్త సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ గ్రామ కమిటీల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. లబ్ధిదారులు ఎంపిక గ్రామసభలలోనే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నాలుగు పథకాల లబ్ధిదారులు ఎంపిక నిరంతర ప్రక్రియ అని వారు తెలిపారు. రేషన్ కార్డులు తమకు రాలేదని ఎవరు ఆందోళన చెందవద్దని ఇది నిరంతర ప్రక్రియని వారు తెలిపారు. సమావేశంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి 23 వరకు గ్రామ సభలు

ఈనెల 21న లక్ష్మీపురం, జానకిపురం, చిన్న బీరవల్లి, గార్లపాడు, రామాపురం, పెద్ద బీరవల్లి, బ్రాహ్మణపల్లి, రాయన్నపేట గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రావాత్ రమాదేవి తెలిపారు. 22న తూటికుంట్ల, ఆళ్లపాడు, నారాయణపురం, సీతానగరం, కలకోట, మోటమర్రి, ముష్టికుంట్ల గ్రామాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. 23న గోవిందాపురం ఏ, రావల్లి, చొప్పకట్లపాలెం, చిరునోముల, గోవిందాపురం ఎల్, రావినూతల, బోనకల్ గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

ఖానాపురం చెరువుకి రక్షణ కల్పించాలి

- సీపీఐ(ఎం) ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని ఖానాపురం హవేలి 7వ డివిజన్ పరిధిలో ఖానాపురం చెరువుకి రక్షణ కల్పించాలని కోరుతూ మున్సిపల్ కమిషన్‌కి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలి పార్టీ కార్యదర్శి దొంగల తిరుపతిరావు మాట్లాడుతూ ఖానాపురం చెరువు వల్ల పాండురంగాపురం, ఖానాపురం, టేకులపల్లి, ఇండస్ట్రియా ప్రాంతాలకు నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందన్నారు. అలాంటి చెరువు అలుగు పగులకొట్టి నీటిని బయటికి పంపిస్తున్నారని, దాని వల్ల రాబోయే వేసవి కాలంలో బోర్లు ఆ ప్రాంతా ప్రజలకు నీటి ఏద్దడి ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. చెరువు అలుగుని పరిశీలించి నీటిని బయటికి పోకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హవేలి నాయకులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన


నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర శాసన సభ్యులు మల్లు భట్టివిక్ర మార్క ఆదివారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. నరసింహపురం గ్రామంలో ఏడు లక్షల రూపాయల అంచనా విలువతో సిమెంటు రోడ్డు, బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో 12 లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్డు, బనిగండ్లపాడు గ్రామంలో 19,25 లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 48 లక్షల రూపాయల నిధులతో వ్యవసాయ వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన గోడౌన్స్ ప్రారంభోత్సవం చేశారు. తక్కెళ్ళపాడు గ్రామంలో 13.50 లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి, సఖినివీడు గ్రామంలో 9.20 లక్షల రూపాయల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గప్రసాద్, డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు వెంకటకృష్ణారావు, ఎర్రమల పూర్ణచంద్రారెడ్డి, తలపురెడ్డి నాగిరెడ్డి, శీలం వెంకటరామిరెడ్డి, జయలక్ష్మి, యనమల శ్రీనివాసరెడ్డి, యన్నం పిచ్చిరెడ్డి, శీలం అక్కిరెడ్డి, పసుపులే టి వెంకటనారాయణ, గంట తిరుపతమ్మ, షేక్ ఇస్మా యిల్, మల్లెల లక్ష్మణరావు సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

మండలంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై మండలంలోని వివిధ గ్రామాల నుండి బీఆర్ఎస్ పార్టీలోకి మండల, గ్రామస్థాయి నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం సకినవీడు గ్రామంలో భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావ రామకృష్ణ, మాజీ ఎంపీపీ చావా అరుణ, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు పంబి సాంబశివరావు, వైస్ ఎంపీపీ రామకోటేశ్వరరావు, ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు మూల్పూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు భాస్కర్ రేడ్డి, మూల్పూరి స్వప్న కుమారి తదితరుల ఆధ్వర్యంలో వందల మంది బిఆ ర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాగద్వేషాలు లేకుండా మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అవకాశం వచ్చే విధంగా ఈ ఎన్నికలలో ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన మధిర ప్రజల రుణం తీర్చుకోవడానికి నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేయాలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఎర్రుపాలెం, మధిర మండలంలోని కొన్ని గ్రామాలు, సత్తుపల్లి నియోజకవర్గంలో ఉన్న మరి కొన్ని గ్రామాలకు సాగర్ జలాలు అందించడానికి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మధిరలో పాల విప్లవం తీసుకురావడానికి ఇందిరమ్మ డెయిరీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇప్పించడానికి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మె ల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నా రు.



6

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

అర్హుల ఎంపిక జరగకుంటే గ్రామ సభలను అడ్డుకుంటాం

నవతెలంగాణ-బోనకల్

మండలంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే గ్రామసభల్లో నిజమైన అర్హుల ఎంపిక జరగకుంటే గ్రామ సభలను అడ్డుకుంటామని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు హెచ్చరించారు. మండలంలోని కలకోట గ్రామంలో సిపిఐ శాఖ సమావేశం శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు పథకాలలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల సమక్షంలో ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ద్వారా అర్హుల జాబితా ఎంపిక చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు తెలిపారన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకే దక్కాలని, ఆ విధంగా ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ కమిటీలు కృషి చేయాలని కోరారు. రానున్న రోజుల్లో పేదల పక్షాన ప్రజా పోరాటాలు రూపొందించి, పేదలకు అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు యంగల ఏలేష్, మాతంగి శ్రీనివాసరావు, మత్స్యశాఖ సొసైటీ చైర్మెన్ బలుగూరి అచ్చయ్య, వెంకటమ్మ చావా రామకృష్ణ, వసంత, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్‌రేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, వృత్తిలో మరణించిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారికి ఇవ్వాలవాల్సిన ఎక్స్ గ్రేషియా సంవత్సరం నుండి ఇవ్వలేదని తెలిపారు. వీటిని వెంటనే ఇచ్చి బాధిత కుటుంబాలని ఆదుకోవాలని, ఎన్నికల ప్రణాళికలో నేల రోజుల లోపు ఐదు లక్షల ఎక్స్ గ్రేషియాను పది లక్షల ఎక్స్ గ్రేషియా గా పెంచుతాం అన్న హామీ అమలు చెయ్యాలని పేర్కొన్నారు. వృత్తి పెన్షన్ 2000 నుండి 4000 కి పెంచాలని, సభ్యులందరికి ద్విచక్ర వాహనాలు ఇస్తామని, లిక్కర్ షాపుల రిజర్వేషన్స్ 10 నుండి 25% పెంచి సొసైటీలకి ఇస్తామని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలు పునరుద్దరిస్తామని, జనగాం జిల్లాకు పాపన్న పేరు పెడతామని, ట్యాంక్ బండ్ పై పాపన్న విగ్రహం పెడతామాని, వృత్తిలో ఆధునికరణ తీస్కొని వచ్చి ఉపాధి మెరుగుపరుస్తామని తెలిపారు. చెప్పిన మాట నిలబెట్టుకొని తమ చిత్తశుద్ధి చాటుకోవాలని పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు సిగ్నల్స్ పై అవగాహన

నవతెలంగాణ-పెనుబల్లి



జాతీయ రోడ్డు వారోత్సవాల సందర్భంగా ఆదివారం ఆటో డ్రైవర్లకు రహదారిపై, సిగ్నల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ఇన్సూరెన్స్ పూర్తిగా ఉన్న వాహనాల్ని వినియోగించాలని, వాహనానికి మించి ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అవకాశం కల్పించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ అధికారి సీతారాములు, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత గిరిజనులకు రగ్గులు పంపిణీ

నవతెలంగాణ-పెనుబల్లి



సత్తుపల్లికి చెందిన నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పెనుబల్లి మండలం, రంగారావు బంజర గ్రామంలోని పేద హరిజన, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలకు ఆదివారం రగ్గులు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గాదె నరసింహారెడ్డి, తోట కిరణ్‌లు మాట్లాడుతూ సమాజంలోని పేద బడుగు వర్గాలకు చేసే సేవ మాధవ సేవతో సమానము అన్నారు. 2018 నుండి సంస్థ అధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు . ఈ కార్యక్రమానికి కావలసిన ఆర్థిక సహాయం 15,000 రూపాయలు నవభారత్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి దుద్దేపూడి గ్రామానికి చెంది ప్రస్తుతం అమెరికా కి చెందిన యూనివర్సిటీ లో డ్రగ్ సైంటిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ నాగరాజు మిరియాల సంస్థకు అందించారు. స్వచ్ఛంద సేవ సంస్థను గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామారావు, బొల్లిపోగు సురేష్, మాదిరాజు పుల్లారావు, సురేంద్ర సింగ్, బోలె పాషా పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యేనా?


- జెండాలు మోసి కందిపోయిన భుజాలకు పదవులు దక్కేనా?
- హల్‌చల్ చేస్తున్న రంగులు మార్చుతున్న ఖద్దర్ చొక్కాలు
- కమల్ రాజ్ వీర విధేయుడి కరివేద సుధాకర్ జంప్ జిలాని..

పదవుల కోసం కాంగ్రెస్ నాయకుల ఎదురుచూపులు..

నవతెలంగాణ-బోనకల్

జెండాలు మోసి కందిపోయిన భుజాలు ఎన్నో రోదిస్తున్నాయి. రంగులు మార్చిన ఖద్దర్ చొక్కాలు మాత్రం ప్రభుత్వ కార్యక్రమాలలో హల్ చల్ చేస్తున్నారు. ఇది మధిర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల ఆవేదన. రాష్ట్రంలో 10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని, నిర్బంధాలను ఎదుర్కొని పార్టీ కోసం అనేక కష్టాలను ఎదుర్కొంటూ ధైర్యంగా నిలబడ్డారు. అధికారం వచ్చిన తర్వాత అర్హత కలిగిన నాయకులు నియోజకవర్గంలో ఉన్న వివిధ నామినేటెడ్ పదవులు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కానీ అధికారం వచ్చి సంవత్సరం అయినా నియోజకవర్గంలో ఏ ఒక్కరికి ఇంతవరకు నామినేటెడ్ పదవి దక్కలేదు. దీంతో కార్యకర్తల్లో, నాయకుల్లో అసంతృప్తి నెలకొని ఉందని కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. మధిర నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వంలో రెండవ స్థాయిలో, ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. నియోజకవర్గంలో భట్టి మాట చెప్తే, అదే జీవోగా భావించి ఆర్డర్ వచ్చే పరిస్థితి ప్రస్తుతం నియోజకవర్గంలో ఉంది. ఎందుకంటే నియోజకవర్గంలో ఆయనే ఏకైక, తిరుగులేని నాయకుడు. ఇటువంటి పరిస్థితుల్లో నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు భర్తీకి ఎందుకు ఆలస్యం జరుగుతుందో తమకు అంతు పట్టడం లేదని నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్, మధిర శివాలయం చైర్మన్, రామాలయం, వినాయకుడి గుడి, గ్రంథాలయం, ఆత్మ కమిటీ, జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ డైరెక్టర్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఎమ్మెల్యే తర్వాత ప్రోటోకాల్ కలిగిన మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి సంవత్సరం నుంచి ఖాళీగా ఉంటుంది. జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు భర్తీ అయినా, మధిరలో మాత్రం భర్తీ చేయటం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు కూడా రిజర్వేషన్లు పెట్టడం, ఐదేళ్లకు ఒకేసారి రిజర్వేషన్లు తీయడంతో మధిర మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి బీసీలకు కేటాయించారు. దాని ప్రకారం ఎర్రుపాలెం మండలానికి చెందిన బండారు నరసింహారావును ఎంపిక చేశారని సోషల్ మీడియాలో మూడు నెలల నుండి ప్రచారం జరుగుతోంది తప్ప నేటికీ అధికారికంగా ప్రకటించలేదు. ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభంలో కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పేరు ప్రచారం బాగా జరిగింది. కానీ ఆ తర్వాత కిషోర్ పేరు మరుగునపడినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత ప్రాధాన్యత కలిగిన మధిర శివాలయం చైర్మన్ పదవి కూడా ఖాళీగానే ఉంది. ఇక్కడ శివరాత్రికి ఐదు రోజులపాటు భారీ స్థాయిలో ఉత్సవాలు జరుగుతాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు ఈ జాతరకు హాజరవుతారు. గత సంవత్సరం మహాశివరాత్రికి కూడా పాలకమండలి లేకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. ఈ సంవత్సరమైనా ఫిబ్రవరిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతరకైనా శివాలయంకి పాలకమండలి ఏర్పాటు చేస్తారా? లేదా? అనేది భక్తుల్లో, కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన నెలకొని ఉంది. రైతులకు అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ స్థాయిలో ఆత్మ కమిటీ చైర్మన్, మధిర తొలి గుడిగా ఖ్యాతి పొందిన మధిర రామాలయంతో పాటు శివాలయం, గ్రంథాలయం చైర్మన్ లను పార్టీ కోసం పనిచేసిన నాయకులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంటు ఎన్నికలకు ముందు కార్పొరేషన్ చైర్మెన్‌లను ప్రకటించింది. వాటిలో కూడా మధిర నియోజకవర్గానికి చెందిన ఏ ఒక్కరికీ కూడా ఆ పదవులు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా, జెండాను అంటిపెట్టుకొని ఉన్న నాయకులకు పదవులు రాకపోవడంతో అధికారంలో ఉన్నామన్న సంతోషం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో కష్టపడి పని చేసిన నాయకులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కార్యకర్తలు భట్టిని కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్‌గా లింగాల కమల్ రాజు ఉన్న సమయంలో అనేకమంది ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లో చేరారు. కమల్ రాజు అంటే నేనే, నేను అంటే కమల్ రాజు అంటూ అన్ని తామై కమల్ రాజుకు వీరా విధేయులుగా ఉంటూ చక్రం తిప్పిన కొంతమంది నాయకులు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరారు. ఇందులో బోనకల్ మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన నారాయణపురం సొసైటీ ఉపాధ్యక్షుడు కరివేద సుధాకర్ ఒకరు. కమల్ రాజు బోనకల్, మధిర మండలాలలో ఎక్కడ ఏ కార్యక్రమం ఉన్న అక్కడకు ముందుగానే వచ్చి ఆ కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై వేసుకొని వీర విధేయుడుగా పనిచేశాడు.



బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో కాంట్రాక్టర్ల కోసమే ఆనాడు బీఆర్ఎస్‌లో చేరినట్లు జగమెరిగిన సత్యం. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో కరివేద సుధాకర్ ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని కాంగ్రెస్‌లో చేరిపోయాడు. మధిర మున్సిపాలిటీలో తన ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ లో పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నట్లు ప్రచారం చేసుకుంటూ భట్టి సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని దృష్టిలో పడేందుకు పడరాని పాట్లు పడుతున్నాడని మధిర మున్సిపాలిటీకి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు. ఈ విధంగా మధిర, బోనకల్ మండలాల్లో కొంతమంది నాయకులు మల్లు నందిని దృష్టిలో పడేందుకు, ఆమె కటాక్షం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని కార్యకర్తలు, నాయకులు అంటున్నారు. ఇటువంటి వారు కేవలం పార్టీపై అభిమానంతో కాంగ్రెస్ లో చేరలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు రాలేదని, కేవలం ఆ బిల్లుల కోసమే కాంగ్రెస్ లో చేరినట్లు ప్రచారం సాగుతోంది. ఇటువంటి వారి పట్ల డిప్యూటీ సీఎం, మల్లు నందిని అప్రమత్తంగా ఉంటూ నిత్యం కాంగ్రెస్ జెండా మోసిన నాయకుల, కార్యకర్తలకు న్యాయం చేస్తారనే ఆశాభావం వ్యక్తం అవుతుంది.

క్రీడలతో ఐక్యత : సీపీ సునీల్ దత్

- కోలాహలాంగా ప్రారంభమైన పోలీస్ క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఖమ్మం



క్రీడలు ఐక్యతను చాటి చెబుతాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ -2025 ఖమ్మంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పోలీసు క్రీడాకారుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శాంతి కపోతాలు ఎగురవేసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, కల్లూరు సబ్ డివిజన్ల సివిల్ పోలీసులు, ట్రాఫిక్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్, స్పెషల్ వింగ్స్ స్టాఫ్ మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. పురుషులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంతో పాటు కబడ్డీ, షాట్పుట్, డిస్కస్త్రో, జావెలిన్, హైజంప్, లాంగ్జంప్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, 4x400 రిలే, 4x100 రిలే విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తొలిరోజు వాలీబాల్ పురుషుల విభాగంలో ఖమ్మం టౌన్ వర్సెస్ కల్లూరు టీమ్ ప్రారంభ మ్యాచ్‌ను పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శారీరక వ్యాయమం, క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, పోలీస్ శాఖలో మానసికంగా శారీరక సామర్థ్యాన్ని కలిగి వుంటేనే సమాజ సేవలో రాణిస్తారని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజిగా ఉండే పోలీసు సిబ్బందికి ఇలాంటి క్రీడా పోటీలు నూతన ఉత్సాహాన్నిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. పోలీస్‌శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని జోనల్, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోలీస్ క్రీడలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ట్రైనీ ఐపిఎస్ రుత్విక్ సాయి, ఏసీపీలు సాంబరాజు, నర్సయ్య, సుశీల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఎదుగుదల ఓర్వలేవా..?

- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య

నవతెలంగాణ-ఖమ్మం



మహిళల ఎదుగుదలను తాత మధుసూదన్ ఓర్చుకోలేకపోతున్నారని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య విమర్శించారు. ఆదివారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మల్లు నందిని విక్రమార్క పై తాత మధుసూదన్ విమర్శలు చేయడం మహిళల ఎదుగుదల పట్ల ఆయనకున్న వక్రబుద్ది బయటపడిందని స్పష్టం చేశారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, అలాంటి ఆమెపై విమర్శలు చేయడం సిగ్గు చేటని అన్నారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సామాన్య కార్యకర్తలకు కూడా పంచుతున్నారని, మల్లు నందిని విక్రమార్క పంపిణీ చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై నోరు విప్పని తాత మహిళను నిందించడానికి నోరు విప్పడం సిగ్గు చేటన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖ్యాతిని దెబ్బ తీయాలనే దురుద్దేశంతో బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ కుమారుడు హిమాన్షుకి ఏసిపి ర్యాంక్ స్థాయి అధికారిని నియమించి భద్రత కల్పించిందని, అప్పుడు మీకు కళ్ళు కనపడలేదా ఘాటుగా విమర్శించారు. పది ఏండ్లు అధికారంలో ఉండి రాష్ట్ర అభివృద్ధిని కుంటు పడేసి నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు పెడుతుంటే అది చూసి ఓర్వలేక లేని పోని ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకొని విమర్శిస్తున్నారు. భట్టి విక్రమార్క నాలుగు సార్లు ఏకధాటిగా ఎమ్మెల్యేగా గెలుపొందారని, స్థానిక ప్రజలకు భట్టి విక్రమార్క అంటే ఏంటో అక్కడ ఉన్న స్థానిక బిఆర్ఎస్ నేతలు అంటే ఏంటో తెలుసని తాత మధు పనిగట్టుకొని వెళ్లి చెప్పాల్సిన పని లేదని అన్నారు. ప్రజలు మీ పై విరక్తి చెందే ఇంట్లో కూర్చోబెట్టారని, ఇకనైనా మాట్లాడే ముందు మనం ఎక్కడ ఉన్నాం అని ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. నందిని విక్రమార్క ఏ కార్యక్రమం చేసిన తన స్వచ్ఛంధ సేవ సంస్థ ద్వారా మాత్రమే చేస్తారనేది గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా మహిళా సెక్రటరీ ఏలూరి రజిని, బలుసు లక్ష్మి, బిక్కిసాని స్వరూప, గుంటి భవానీ, చంద్రకళ, గొడుగు రమాదేవి, భార్గవి అనూష, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

వైరా బోడేపూడి వైద్య శిబిరం విజయవంతం

- 115 నెలలుగా వైద్య శిబిరం నిర్వహణ

నవతెలంగాణ-వైరాటౌన్



బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతి నెల మూడవ ఆదివారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వేంకటేశ్వరరావు భవనంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ఆదివారం 115వ నెల విజయవంతంగా నిర్వహించారు. బోడేపూడి వైద్య శిబిరం ద్వారా గత 115 నెలలుగా షుగర్, బిపి, కొలెస్ట్రాల్, గ్యాస్, అల్సర్ తదితర వ్యాధులకు నెల రోజులకు సరిపడా మందులను 100 రూపాయలకు అందిస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి, డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు బృందం ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఖమ్మం శరత్ మాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వైద్య బృందం విక్రమ్ సింగ్, శ్రీకాంత్, ప్రశాంత్, పాషా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 115 నెలలుగా బోడేపూడి వైద్య శిబిరం డాక్టర్ల బృందం క్రమం తప్పకుండా హాజరుకావడం, వాలంటీర్లు నిబద్ధతతో పని చేయటం వల్ల విజయవంతంగా ముందుకు సాగుతూ వేలాది మంది పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చీకటి భారవి మాట్లాడుతూ ప్రతి రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించ వచ్చునని అన్నారు. షుగర్, బిపి మందులు దీర్ఘకాలంగా వాడే వారు గుండె, కిడ్నీ, న్యూరో సంబంధించిన పరీక్షలు తరచూ చేయించుకోవాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు గుండె, శ్వాసకోశ అనారోగ్య లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో బోడేపూడి వైద్య శిబిరం వాలంటీర్లు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, తోట నాగేశ్వరరావు, బొంతు సమత, గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహనరావు, అనుమోలు రామారావు, మాదినేని రజిని, మల్లెంపాటి ప్రసాదరావు, కొంగర సుధాకర్, యనమద్ది రామకృష్ణ, పాసంగులపాటి చలపతిరావు, కంభంపాటి సత్యనారాయణ, ఐలూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలానికి చెందిన 84మంది లబ్దిదారులకు రూ.30లక్షల 78వేలు విలువ చేసే చెక్కులను అందించారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, మంగీలాల్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ నగేష్‌గౌడ్, రామసహాయం అరవింద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, విక్రమ్‌రెడ్డి, ఇస్లావత్ రవి, ఉప్పునూతల నాగేశ్వరరావు, చీమ్లా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే భౌతిక దాడులు

- అరవింద్ కేజ్రీవాల్‌పై రాళ్ళ దాడి దుర్మార్గం
- ఆమ్ ఆద్మీ పార్టీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి గుత్తా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరాటౌన్



ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ, ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభంజనం చూసి ఓర్వలేక బీజేపీ, దాని అనుబంధ సంస్థలు, మతోన్మాద శక్తులు భౌతిక దాడులకు సైతం పూనుకోవటం అత్యంత దుర్మార్గ పూరిత వైఖరి అని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి గుత్తా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. వైరాలో ఆదివారం జరిగిన ఆప్ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఆకస్మాత్తుగా తన మానిఫెస్టోలో ఢిల్లీ ప్రజలకు మాత్రమే ఉచిత విద్యుత్, సమాజంలో కొన్ని వర్గాలకి బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర అనేక తాయిలాలను ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందని ఆరోపించారు. ఢిల్లీ ప్రజలు ఎప్పుడు అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా పాలన నిర్వహించిన ఆమ్ ఆద్మీ పార్టీనే బలపరచటానికే సిద్ధం అయ్యారని, అందుకే బీజేపీ, దాని అనుబంధ సంస్థల కార్యకర్తలు కావాలనే రాళ్ళ దాడికి పూనుకున్నారని ఆరోపించారు. ఉదయిస్తున్న సూర్యున్ని ఆపటం ఎంత కష్టమో, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపును ఆపటం అంతే కష్టమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మీడియా ఇంచార్జి సూర్యదేవర సంగమేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయం కోసం పని చేసేవారే అసలైన విజేతలు

- నిరంతర ప్రయత్నం విజేత లక్షణం
- ఆశయానికి ప్రయాణం మాత్రమే...
- ఫలితం అనుభవాన్ని ఇవ్వాలే తప్ప దిగులును పెంచకూడదు

నవతెలంగాణ-బోనకల్



ఆశయం కోసం నిరంతరం ప్రయత్నం చేయడమే విజేతల లక్షణమని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం 'ఏది అసలైన విజయం' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో పల్లా కొండలరావు మాట్లాడుతూ అనుకున్నది సాధించడమే విజయం అయితే చెడు అనుకుని సాధిస్తే నిరర్థక విజయం అవుతుందన్నారు. ఫలితంతో సంబంధం లేకుండా నిరంతరం ప్రయత్నం చేయడం ఆశయం ఉన్నవారికి మాత్రమే సాధ్యం అవుతుందని చెప్పారు. పని చేస్తే ఏదో ఒక ఫలితం వస్తుందన్నారు. ఫలితం అనుభవాన్ని ఇవ్వాలే తప్ప దిగులును పెంచకూడదన్నారు. గెలిస్తే మరో గెలుపు కోసం, ఓడితే తిరిగి గెలవడం కోసం పని చేయాలని తెలిపారు. ఆశకు గమ్యం ఉంటే ఆశయానికి ప్రయాణం మాత్రమే ఉంటుందన్నారు. వారసులకు ఆస్తి కంటే ఆశయాన్ని వారసత్వంగా పంచాలన్నారు. ఆశయం కోసం పని చేసేవారికి గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించే శక్తి వస్తుందన్నారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించే వ్యవస్థను సాధించే ఆశయం కోసం పని చేసే శక్తులు ఐక్యంగా పని చేస్తే అసలైన విజయం గురించి తెలుసుకోవడంతోపాటు ప్రతి రోజూ ఆనందంగా జీవించడం సాధ్యం అవుతుందని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి కుక్కల కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు జొన్నలగడ్డ సునీత, బంధం శ్రీనివాసరావు, బోయినపల్లి కొండలరావు, పిల్లలమర్రి వెంకట అప్పారావు, గుగులోతు రామకృష్ణ, మచ్చ గురవయ్య, బోయినపల్లి పున్నయ్య, చలమల అజయ్ కుమార్, ఉప్పర శ్రీను, బొప్పాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ పరిశీలన

- 3700 ఎకరాలకు నీటిని అందిస్తాం
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్

నవతెలంగాణ-వేంసూరు



గూడూరు వేంసూరు ఎత్తిపోతల పథకం గత సంవత్సర కాలంగా ట్రాన్స్ఫార్మర్లు చోరీకి గురి అవ్వటం మోటర్లు రిపేరుకు రావడంతో ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో యుద్ధ ప్రాతికన మరమ్మతులు చేయించి ఆదివారం రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ స్థానిక నాయకులు చేత ట్రయల్ రన్ చేయించి పరిశీలించారు. ఈ సందర్భంగా మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు వేంసూరు ఎత్తిపోతల పథకం ఎన్ఎస్‌పి కాలువ ద్వారా 3700 ఎకరాలకు కృష్ణా జలాలు అందుతుందని, రైతులు సమన్వయంతో లిఫ్ట్ నిర్వహణ చూసుకొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో పంట పొలాలు సస్యశ్యామలం అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ఖబద్దార్..నోరు అదుపులో పెట్టుకోండి

నవతెలంగాణ-బోనకల్



బీఆర్ఎస్ నాయకులు ఖబద్దార్ అంటూ నోరు అదుపులో పెట్టుకోవాలని, దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు మహిళా కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అధ్యక్షురాలు చేబ్రోలు రమ హితవు పలికారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్ మల్లు నందిని విక్రమార్క మధిరలో రాజ్యాంగేతర శక్తిగా మారారంటూ పూర్తి నిరాధారమైన ఆరోపణలు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఖబద్దార్ బిఆర్ఎస్ నాయకుల్లారా మల్లు నందిని విక్రమార్క గురించి అవాకులు చవాకులు పేలటం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యకలాపాలలో షాడో ఎమ్మెల్యేగా మల్లు నదిని ఎక్కడ పాల్గొన్నారో నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రజా సమస్యలపై మాట్లాడటం చేతకాక ప్రజా సమస్య దొరకక నందిని విక్రమార్క ను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇది మీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తన భర్త ఉన్నప్పుడు వారి కుటుంబ రక్షణ బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందన్నారు. అది తెలియక సోయితప్పి బీఆర్ఎస్ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. బిఆర్ఎస్ నాయకులారా మీ స్థాయి మరిచి మాట్లాడుతున్నారు జాగ్రత్త అంటూ హెచ్చరించారు. నందిని విక్రమార్క పై మీరు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే విజ్ఞులైన ప్రజలు మీకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

జన గొంతుకగా నవతెలంగాణ

- తహసీల్దార్ నరేష్, సీఐ వెంకటేశ్వర్లు





నవతెలంగాణ-పినపాక

ప్రతినిత్యం జనస్వరంగా నవతెలంగాణ దినపత్రిక పురోగ మనిస్తుందని, ప్రజాశక్తి వారసత్వాన్ని పుని కిపుచ్చుకున్న నవతెలంగాణ నిజాయితీ నిబద్ధతే పునాదులుగా పయని స్తుందని తహసీల్దార్ నరేష్, సీఐ వెంకటేశ్వర్లు, ఎంపీఓ వెంకటేశ్వరరావులు అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఈ బయ్యారం పోలీస్ స్టేషన్‌లో సీఐ నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్-2025ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక ప్రజల దృష్టితోనే వార్తా విశ్లేషణలు, వ్యాఖ్యానాలు, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలకు కట్టుబడే వార్తా కథనాలు రాస్తుందని వారు అన్నారు. ఆర్థికంగా, అట్టడుగునున్న ప్రజల గొంతుకగా నిలుస్తున్న వెలుగు దీపిక నవతెలంగాణ అని వారు ప్రశంసించారు. సెన్సేషనలిజానికి స్పేస్ ఇవ్వకుండా యథాతథంగా వార్తల ప్రచురణ చేసే ఘనత నవతెలంగాణకే దక్కిందన్నారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం అన్న నినాదంతో 40 ఏళ్ల పైబడి ప్రజల గొంతుకను వినిపించిన ప్రజాశక్తి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని స్వరాష్ట్రంలో జనం గొంతుకగా నిలుస్తుందని వారు అన్నారు. కేవలం ప్రజలు, శ్రేయోభిలాషుల మన్ననలు వారి ఆర్థిక తోడ్పాటుతో నవతెలంగాణ ప్రస్థానం సాగిస్తోందని, కరోనా సృష్టించిన ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకొని ప్రజల గొంతును కాపాడేందుకు ఒక యజ్ఞమే చేసి తనకంటూ ఓ ప్రస్తానాన్ని చాటుకుంటూ వస్తుందని వారు అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ శ్రీరామ్ బృహస్పతి, సూపర్డెంట్ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రమేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కి అనూహ్య స్పందన



నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలోని సారపాకలోని బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. మండలంలోని పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు దాదాపు 160 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కాలేజ్ చైర్మెన్ డాక్టర్ బీఎస్ఆర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహించామన్నారు. పబ్లిక్ పరీక్ష రాయబోవు విద్యార్థులకు మాథ్స్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో ఇంకా ఎక్కువ పట్టు సాధించేలా ఈ పరీక్ష ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతలక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన పేర్కొన్నారు. తమ పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన ప్రతి స్కూల్ విద్యార్థులకు బహుమతులను రిపబ్లిక్ రోజు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆవరణలో అంగరంగ వైభవంగా జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయబడునని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ చైర్మెన్ డాక్టర్ బీయస్ఆర్, అధ్యాపక బృందం, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్తైన సాగేతర భూముల గుర్తింపు

- మండలంలో 98.27 ఎకరాలుగా నమోదు
- ఏవో శివరాం ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ప్రభుత్వం రైతు భరోసా అమలు చేయడానికి వ్యవసాయ సాగు భూములను గుర్తించే ప్రక్రియ చేపట్టింది. మండలాల వారీగా రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సర్వే నెంబర్‌లు, సబ్ డివిజన్‌లు వారీగా తనిఖీలు చేసారు. ఈ నేపధ్యంలో అశ్వారావుపేట మండలంలో తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో వ్యవసాయశాఖ మండలాధికారి శివరాం ప్రసాద్, ఆర్ఐ క్రిష్ణ, ఏఈవో సతీష్‌లు ఆదివారం నాటికి తనిఖీలు పూర్తి చేసారు. వ్యవసాయాధికారి శివరాం ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని 30 పంచాయతీలలో 4 వ్యవసాయ క్లస్టర్‌లలో 19 రెవిన్యూ గ్రామాలు పరిధిలో 130 సబ్ డివిజన్‌లలో మొత్తం 37,071 ఎకరాల వ్యవసాయ సాగు భూములను తనిఖీలు చేసారు. ఇందులో 98.27 ఎకరాలలో లే అవుట్, గృహాలు, పలురకాల వ్యాపార సముదాయాలతో వ్యవసాయేతర భూములుగా గుర్తించినట్లు తెలిపారు. ఆసుపాక 40.55, అశ్వారావుపేట 32.72, నారాయణపురం 12.10, మద్ది కొండ 7.06, నారం వారి గూడెం 3.07, గుంటిమడుగు 1.10, రామన్నగూడెం 1.00, వేదాంత పురం 0.12 మొత్తం 98.21 ఎకరాలుగా నమోదు చేసారు.

కౌన్సిలర్ భర్త రమేష్ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ-ఇల్లందు

మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ తోట లలిత శారద భర్త తోట రమేష్ శనివారం అకాల మరణం చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి స్వగృహానికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మెన్ జానీ పాష, పట్టణ అధ్యక్షులు దొడ్డ డానియల్ నియోజకవర్గ నాయకులు బొల్లా సూర్యం, మడుగు సాంబమూర్తి, చిల్ల శ్రీనివాస్, కౌన్సిలర్ పత్తి స్వప్న, మాజీ కౌన్సిలర్ కమల్ కోరి, శంకర్, రేనగంటి శ్రీను, కొప్పుల సమ్మయ్య, ఎస్.కే.వాజిద్, చీకుర్తి కుమార్ స్వామి, తదితరులు పాల్గొని పార్థివ దేహానికి నివాళులర్పించారు.

నేడు డ్రైవర్ల జిల్లా మహాసభ

నవతెలంగాణ-టేకులపల్లి

నేడు టేకులపల్లి మండలంలో జరిగే డ్రైవర్ల మహాసభను విజయవంతం చేయాలని ఆటో మోటార్ వర్క యూనియన్, టీయూసీఐ (అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, టేకులపల్లి ఏరియా కార్యదర్శి జర్పుల సుందర్ కార్మికులను కోరారు. ఆదివారం కేటీసీలో బాడీ లారీల యార్డులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆటో, మోటార్, జీబు, క్యాబ్, టాటా మ్యాజిక్ డ్రైవర్ల కనీస వేతనాలు, చట్టబద్ధహక్కుల కోసం, ఈ ప్రథమ మహాసభ టేకులపల్లి సేవాలాల్ గుడి ఆవరణంలో జరుగుతుందని, డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో నాగభూషణం, అనిల్, శ్రీను, రాములు, నరేష్, వెంకటేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- సీఐ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పినపాక

జాతీయ రోడ్డు భద్రతా మాస ఉత్సవాలు-2025లో భాగంగా ఈ.బయ్యారం పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ.బయ్యారం చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ ఆవరణ ఆటో స్టాండ్ వరకుతో ర్యాలీ నిర్వహించారు. అవగాహనా కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ఫోన్ డ్రైవింగ్, చిన్న పిల్లలకు బైకులు ఇస్తే జరిగే ప్రమాదాలు, వాటి కారణంగా తల్లిదండ్రులకు శిక్షలను వివరించారు. వాహనదారులు రోడ్డు మీదకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు తగ్గిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మాల్సూర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికేట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన శ్రీనివాస్



నవతెలంగాణ-కొత్తగూడెం

ఎన్‌సీసీ కార్ప్స్ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతోందని సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి గుండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆనందఖని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ సర్టిఫికేట్ పరీక్షా కేంద్రాన్ని శ్రీనివాస్ సందర్శించారు. కమాండింగ్ ఆఫీసర్ 11వ బెటాలియన్ ఎస్‌కె. భద్రాతో సంభాషించారు. ఈ పరీక్షలో కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్న క్యాడెట్లను చైతన్యపరిచారు. ఎస్‌కే భద్ర విద్యార్థుల సమగ్రాభివృద్ధిపై చూపుతున్న ఆసక్తిని అభినందించారు. ఈ సందర్భంగా సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో ఎన్‌సిసి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో భద్ర సానుకూలంగా స్పందించారు. సింగరేణి విద్యా సంస్థలకు చెందిన ఎన్‌సిసి ఉపాధ్యాయులు కె.శ్రీలత, సిహెచ్.ప్రశాంత్, రాజసింహ, రాజాగౌడ్‌లను కార్యదర్శి అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.పూల్ సింగ్, కొత్తగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలు ఉధృతం

- ఎల్‌అండ్‌టీ అధినేత సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి
- వ్యకాస, ఏఐకేఎస్, సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె.రమేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణలు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక మంచికంటి భవన్‌లో వ్యవసాయ కార్మిక, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవ సభకు రేపాకుల శ్రీనివాస్, కున్సోత్ ధర్మా కె.సత్యలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. అదేవిధంగా ఎల్ అండ్ టీ కంపెనీ అధినేత సుబ్రహ్మణ్యన్ వారంలో 90 గంటలు పని చేయాలని చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి దారుల లాభాల కోసం కార్మికుల శ్రమ దోపిడి చేయడం కోసం పని గంటలు పెంచాలంటున్నారన్నారు. కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలు, మతతత్వ దాడుల నుండి భారతదేశాన్ని రక్షించడానికి భవిష్యత్ పోరాటాల కోసం రైతులు-కార్మికులు ఐక్యం కావాలని అన్నారు. 19 జనవరి 1982లో జరిగిన దేశ వ్యాప్త కార్మిక, కర్షక సమ్మె సందర్భంగా రైతు నాయకుడు భోలా పాశ్వాన్ బనారస్-మీర్జాపూర్ రోడ్డులో (అప్పుడు బనారస్ జిల్లాలో, ఇప్పుడు చందౌలీ జిల్లాలో) బాబర్ బజార్ వద్ద కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు మరియు విద్యార్థులతో జరిగిన భారీ ర్యాలీకి నాయకత్వం వహిస్తున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల పిలుపు మేరకు ఈ భారత సమ్మె జరిగింది. ఆందోళన కారులు రోడ్డుపై శాంతి యుతంగా దిగ్బంధం నిర్వహించడంతో రవాణా పూర్తిగా నిలిచిపోయింది. శాంతి యుతంగా జరిగిన ఈ నిరసనలో ఎలాంటి హెచ్చరికలు లేకుండా పోలీసులు క్రూరంగా ఆందోళన కారులపై పోలీసులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. కామ్రేడ్ భోలా పాశ్వాన్ పోలీసు కాల్పుల్లో మరణించాడు. కానీ నిరసన ఆగలేదు. అతని తమ్ముడు, లాల్ చంద్ పాశ్వాన్, విద్యార్థి నాయకుడు అశోక్ అపారమైన ధైర్యాన్ని ప్రదర్శిస్తూ పోరాటానికి నాయకత్వం వహించారు. వారిని కూడా పోలీసులు కాల్చిచంపారు. మరో 32 మంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలీసులు ఇద్దరు అమరవీరుల మృతదేహాలను 75 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి వారి కుటుంబాలకు తెలియజేయకుండా ఖననం చేశారు. అదే రోజున తమిళనాడులోని వ్యవసాయ కార్మికులు కార్మిక సంఘాలతో కలిసి గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా సమ్మెలు నిర్వహించారు. ఏఐఏడీఎంకే ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు నిరసనకారులపై కాల్పులు జరపగా ముగ్గురు సహచరులు మరణించారు. నాగపట్నం జిల్లా తిరుమగ్నానం వద్ద పోలీసు కాల్పుల్లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు కామ్రేడ్ అంజన్, కామ్రేడ్ నాగూరన్ మరణించారు. తిరుతురైపూండిలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ కార్యకర్త కామ్రేడ్ గుణశేఖరన్ మరణించారన్నారు. అమర వీరులను స్మరిస్తూ కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 19న నిర్వహిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో కార్మికులు, కర్షకుల ఐక్య పోరాటాలకు బీజం వేసిన విజయవంతమైన సమ్మె ఇది. ఆనాటి పోరాట స్ఫూర్తితో వ్యవసాయ కార్మికులు, కార్మిక సంఘాలతో కలిసి రైతు ఒక సంవత్సర కాలం చేసిన సుదీర్ఘ పోరాటం తర్వాత బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించు కోవలసి వచ్చింది. ఈ కాలంలో జరిగిన అతిపెద్ద శాంతియుత పోరాటం ,700 మందికి పైగా రైతుల బలిదానంతో రైతు-కార్మికుల ఐక్యతతో సాధించిన విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు శెట్టి వినోద, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, సూరం ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, తులసీరాం, రాములు, రఘు, బాలు, సంధ్య, జ్యోతి, రుహీన, రాజు, గణేష్, అరుణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని సులానగర్, ముత్యాలంపాడు ఎక్స్ రోడ్డు గ్రామపంచాయతీలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సుమారు 50 కుటుంబాలు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన సోదరుడు సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య దేవా నాయక్ తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో 50 వేలకు పైగా మెజారిటీ ఇచ్చిన ప్రజలకు, నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసేవకు, అంకితం అవుతానని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సొసైటీ డైరెక్టర్ కుమ్మరి లావణ్య, దాస్యం కృష్ణమూర్తి, బానోత్ వెంకటేష్, బానోత్ సుక్కో, దాస్యం శ్రీలత, మాజీ వార్డు సభ్యులు బానోత్ వీరు, అజ్మీర జాను, లకావత్ లింబ్యా, కెన్యా, వీరభద్రం, లక్ష్మ, సక్రు, మాలోత్ మంగీలాల్, రామ్ కుమార్, దేవేందర్, ధరం సోత్ చత్రుతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు రెడ్యానాయక్, శివ, శివలాల్, శ్యామ్ బాబు, నర్సయ్య, రవి, భద్రు, పోశాలు, ఇది గణేష్, ఉదయ్, ఉండేటి ప్రసాద్, బద్రు, నరసయ్య, రవి, సర్దార్, లకావత్ శివలాల్, హనుమంతు, మధు రెడ్డి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- నవతెలంగాణ వార్త కథనానికి స్పందించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-దమ్మపేట



తెలంగాణ రాష్ట్రంలో పేదల అభ్యున్నతికోసం, పేదరిక నిర్మూలన కోసం నిరంతర ప్రక్రియగా ఒక ప్రణాళిక బద్ధంగా పేదరిక నిర్మూలనే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. ఆదివారం నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన పేదలపై రెవెన్యూ, పోలీస్ ప్రతాపం అనే వార్త కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం నవతెలంగాణతో మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువ కేటాయించాలని గత నెల డిసెంబర్ 26వ తేదీన దమ్మపేట మండలానికి పర్యటనకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. ఆ సందర్భంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి అధికశాతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన, ప్రవేశపెట్టబోతున్న సంక్షేమ పథకాలన్నీ పారదర్శకంగా నిజమైన లబ్దిదారులకు అందజేసే విధంగా ముందుకు సాగుతామని అన్నారు. ఇదే క్రమంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఖచ్చితంగా గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని పేద ప్రజలు ఎవరూ ఆందోళన పడవద్దని, అధైర్య పడవద్దని ఆయన అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దడమే తన ప్రధాన కర్తవ్యమని ఈ క్రమంలో నియోజకవర్గంలో ఇప్పటికే ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. పేద ప్రజలు అందరికీ రైతులకు, సామాన్యులకు తాను నిరంతరం అందుబాటులో ఉంటున్నానని ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి వెళ్ళి అక్కడ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నానని అన్నారు. తొలి ప్రాధాన్యతగా విద్య, వైద్య సదుపాయాలకు ప్రభుత్వ పెద్దలతోనూ ఉమ్మడి ఖమ్మం ముగ్గురు మంత్రులతోనూ నిరంతరం వారితో సమన్వయంగా ఉంటూ సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపుతున్నానని తెలిపారు. గిరిజనుల సమస్యలపై ఐటీడీఏ అధికారులతోనూ, కలెక్టర్, ఉన్నత అధికారులకు నివేదిక రూపంలో తెలియజేస్తున్నాని పేర్కొన్నారు. ఏ ఒక్క నిరుపేద అధైర్య పడవలసిన అవసరం లేదని ఇందిరమ్మ ఇళ్ళు నిర్మాణం అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మారుమూల ప్రాంతంలో నివశించే నిరుపేదలకు సైతం ఇళ్ళు దక్కేంతవరకూ తాను కృషిచేస్తానని దీంట్లో ఎటువంటి అపోహలకు ఆస్కారం లేదని తెలిపారు. తాను ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని ఏ గ్రామానికి ఏ హామీలు ఇచ్చానో వాటన్నింటిని పక్కాగా అమలు చేయడానికి ముందు వరుసలో ఉన్నానని నియోజకవర్గ ప్రజలకు నిరంతరం తాను అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. శనివారం దమ్మపేట శివారు గ్రామం మల్లారం కాలనీలో పేదప్రజల ఇళ్ళ సమస్యను తాను త్వరలోనే పరిష్కరిస్తానని అక్కడ అర్హులు ఎవరికీ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను తమ ప్రభుత్వంపై రుద్దితే సహించేది లేదని గత పాలకులు సవ్యంగా వ్యవహరించినట్లయితే ప్రస్తుతం ఈ సమస్యలు ఉండవని కొంతమంది రాజకీయ నిరుద్యోగులు లేని సమస్యలను ఉన్నట్లు సృష్టిస్తున్నారని వారు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

విద్యుత్ రంగం కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు
- తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విద్యుత్ రంగ కార్మికులు రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ప్రగతికి అందిస్తున్న సేవలకు వెలకట్టలేమని వారి సేవలను ఎంత కొనియాడినా తక్కువేనని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2025 డైరీ వాల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఈశ్వరరావు అధ్యక్ష వహించగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకం అమలులో విద్యుత్ రంగం కార్మికుల శ్రమ కీలకమైందని గుర్తు చేశారు. విద్యుత్తు ఉత్పత్తి పంపిణీ సక్రమంగా ఉంటేనే రాష్ట్ర ప్రగతి సక్రమంగా ఉంటుందని పేర్కొన్నారు. వరదలు వచ్చినా వర్షాలు వచ్చినా ప్రజలకు ఎటువంటి ఆటంకం లేకుండా 24 గంటలు సేవలందిస్తున్న విద్యుత్ రంగా కార్మికులు నిజమైన ప్రజా సేవకుల ను స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్య మంత్రి ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆర్టిజన్లను కన్వర్షన్ చేయటం అన్యాన్ కార్మికులకు బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించడం ఈపీఎఫ్ నుండి జీపీఎఫ్‌లోకి విద్యుత్తు రంగ ఉద్యోగులను కార్మికులను మార్పు చేయటం వంటి కీలకమైన సమస్యలపై కార్మికుల తరపున కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. పోరాటాల చరిత్ర గలిగిన సీఐటీయూ సంఘంలో హక్కుల కోసం మీరు నిర్వహించే పోరాటాలన్నీ విజయ వంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.స్వామి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.కుమారా చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, జాయింట్ సెక్రెటరీ బొల్లి వెంకటరాజు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చంద్రారెడ్డి, వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు ఎం.ప్రసాద్, కే.మధు, సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు స్వప్న, వెంకటేశ్వరరావు, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

29 గ్రామపంచాయతీలలో 21, 22, 23న గ్రామసభలు

- ఎంపికైన లబ్ధిదారుల జాబితాలు ప్రకటిస్తాం
- తహసీల్దార్ రవికుమార్



నవతెలంగాణ-ఇల్లందు

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 29 గ్రామపంచాయతీలలో 21, 22, 23న గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కోట రవికుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల పథకాలలో ఎంపికైన లబ్ధిదారుల లిస్ట్ చదివి వినిపిస్తారని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే నమోదు చేస్తారని తెలిపారు. అభ్యంతరాలు లేకపోతే లిస్ట్ యధావిధిగా ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. గ్రామ సభలలో ఎండీఓ ధన్సింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారి పి.సతీష్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

21న మంగళవారం...

లచ్చగూడెం, మామిడి గుండాల, ధనియాలపాడు, తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్, సిఎస్పి బస్తీ, మసివాగు, ముత్తారపు కట్ట, బోయ తండా రొంపేడు, మిట్టపల్లి, మొండితోగు.

22 బుధవారం...

పూబెల్లి, సుదిమల్ల, బాలాజీ నగర్ ,ఇంద్రానగర్ ,సుభాష్ నగర్, మర్రిగూడెం, పోలారం, మామిడిగూడెం, రేపల్లెవాడ, ఒడ్డు గూడెం.

23 గురువారం...

బొజ్జాయిగూడెం, రాఘబోయినగూడెం, మాణిక్యారం, పోచారం తండ, కొమరారం, కొమ్ముగూడెం.

ఎనిమిదేళ్ళకు కొత్త కార్డుల జారీకి సన్నాహాలు

- సర్వే 2024 ప్రకారం 18234 కుటుంబాలు
- ప్రస్తుతం వినియోగంలో ఉన్న రేషన్ కార్డ్‌లు 17521
- సర్వేలో కార్డ్‌కు వచ్చిన దరఖాస్తులు 1781
- వేయి కళ్ళతో ఎదురుచూస్తున్న పేదలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

పౌరుడికి ఆధార్ ఎంత కీలకమో నేడు పేదవాడికి అంతకంటే ప్రధాన ఆధారం రేషన్ కార్డు అనే చెప్పుకోవచ్చు. దేశంలో ప్రతీ పౌరుడు దారిద్రరేఖ ఎగువ లేక దిగువ అని నిర్ణయించేది రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా జారీ చేసే ఈ రేషన్ కార్డే. పేదలు, మధ్యతరగతి కుటుంబాలు కల్యాణ లక్ష్మి మొదలుకొని కానుపు, అనంతరం పిల్లలు చదువు, పెద్దలు ఆరోగ్యం అవసరం అయిన ఏ రాయితీ పొందాలన్నా ఈ కార్డే ప్రామాణికం. అందుకే ఈ కార్డు కోసం ప్రతీ పేద ఎదురు చూస్తుంటాడు. తెలంగాణ రాష్ట్రంలో ఈ కార్డులు కోసం గత ఎనిమిదేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు తెలంగాణ ప్రభుత్వం కార్డులు ఇవ్వాలని నిర్ణయించడంతో వారు ఎంతో ఆనందంతో ఉన్నారు. మండలంలో 2011 జనాభా గణన ప్రకారం నాడు 16 పంచాయతీల్లో మొత్తం 15906 కుటుంబాలు ఉన్నాయి. 2016లో నాటి ప్రభుత్వం జారీ చేసిన లెక్కల ప్రకారం నేడు అమలులో ఉన్న మొత్తం 17,521 కార్డులు వినియోగంలో ఉన్నవి. 2024 కుటుంబ సమగ్ర గణన ప్రకారం 30 పంచాతీలలో మొత్తం 18,234 కుటుంబాలు ఉనికిలోకి వచ్చాయి. ఈ సర్వేలోనే 1781 కుటుంబాలు తమకు రేషన్ కార్డ్ కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు స్థానిక సిబ్బంది చే మండల స్థాయి అధికారులు తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్‌లు అర్హతలను అంచనా వేస్తున్నారు.

చోరీకి గురైన ముత్యాలమ్మ గుడి హుండీ

నవతెలంగాణ-మణుగూరు

అశోక్ నగర్ టెలిఫోన్ ఎక్సంజ్ ఎదురుగా ఉన్నటి వంటి ముత్యాలమ్మ గుడిలో అర్ధరాత్రి దొంగలు హల్ చెల్ చేశారు. గేట్ పగలు గొట్టి లోపలికి వెళ్లి అమ్మ వారి హుండీ పగలగొట్టి హుండీలో డబ్బులు దొంగతనం చేశారు. ఎస్‌హెచ్‌ఓ సతీష్ కుమార్, ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్ చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఏమి దోచుకొని వెళ్లారు అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నవతెలంగాణ
8
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన తెలుపుతూ సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

17వ యూసుఫ్ కప్ 2025 విజేత కొత్తగూడెం

- క్రికెట్ పోటీల నిర్వహణలో బూర్గంపాడు యూత్ ఆదర్శం
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



మండల కేంద్రంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ హోరా హోరీగా సాగింది. ఫైనల్లో సారపాక, కొత్తగూడెం జట్లు తలపడగా మొదట బ్యా టింగ్ చేసిన ఫరీద్ ఎలెవన్ కొత్తగూడెం జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది. 155 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటుపల్లి ఎలెవన్ సారపాక జట్టు 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 138 పరు గులే చేసి ఓటమి చవిచూసింది. కొత్తగూడెం జట్టు లోని బ్యాటర్ నితిన్ 56 పరుగులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. ఈ పోటీలను ఆర్గ నైజింగ్ కమీటీ సభ్యులు సోహైల్ పాషా, సర్వే శ్వరావు, గోనెల నాని, భజన సతీష్, భజన ప్రసాద్, అబ్దుల్ సలీమ్, కన్నె బోయిన సారధి, సత్తి పండు, శనగ కిషోర్, బబ్బు రాయుడు, మందా ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

క్రికెట్ పోటీల నిర్వహణలో బూర్గంపాడు యూత్ ఆదర్శం : ఎమ్మెల్యే

బూర్గంపాడులో గత 17 సంవత్సరాలుగా చనిపోయిన తమ మిత్రుడు పేరిట క్రికెట్ పోటీలు నిర్వహించటంలో బూర్గంపాడు యూత్ ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బూర్గంపాడు కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు అనేవి యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసి వారి ప్రతిభను ప్రపంచ నలుమూలలు చాటి చెప్పడానికి దోహదపడతాయని ఆయన తెలిపారు. టోర్నీ స్పాన్సర్ గూగోలోత్ కిషోర్ శివ రాం నాయక్, బుద్ధరాజు నవీన్ బాబులు క్యాష్ ప్రైజ్ విజేతలకి అందజేయగా, ట్రోఫీ స్పాన్సర్స్ డేగల రాజు యాదవ్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అదేవిధంగా ఈ పోటీల్లో అత్యంత క్రీడా ప్రతిభను చూపిన టోర్నీ మాన్ ఆఫ్ ది సిరీస్‌గా అంతర్మయి (చేజింగ్ ఎలెవన్ పాల్వంచ), బెస్ట్ బ్యాట్మాన్‌గా ప్రణయ్ (చేజింగ్ ఎలెవన్ పాల్వంచ), బెస్ట్ బౌలర్‌గా రియాజ్ (చేజింగ్ ఎలెవన్ పాల్వంచ), బెస్ట్ కీపర్‌గా మల్లికార్జున్ (ఏబిఆర్ గ్రీన్ ఎలెవన్, బూర్గంపాడు), బెస్ట్ ఫీల్డర్‌గా నాగ (ఫరీద్ ఎలెవన్, కొత్తగూడెం)లను ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బ్రిలియంట్ స్కూల్ కరస్పాం డెంట్ డాక్టర్ బీఎస్ఆర్, సొసైటీ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంక టేశ్వరరెడ్డి, బి-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజ కవర్గం అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రమేష్, బిజ్జెం వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు అభివృద్ధి చెందాలంటే కొత్త గనులు రావాలి

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పల్లె యాత్ర

నవతెలంగాణ-మణుగూరు



భవిష్యత్తులో మణుగూరు మనగడ కొనసాగాలంటే కొత్త బొగ్గు గనులను విస్తరణ పెంచాలని సామాజిక కార్యకర్త పల్లె యాత్ర సభలో అఖిలపక్ష నాయకులు, కర్నే రవి అన్నారు. ఆదివారం పల్లె యాత్రలో భాగంగా తిర్లాపురం అఖిలపక్ష పార్టీల, కుల సంఘాలు, మహిళా సంఘాలతో ప్రారంభ యాత్ర సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మండలంలోని పలు సమస్యలు, మణుగూరు బీటీపీఎస్ నుండి ఏటూరునాగారం వెళ్లే ప్రధాన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేసారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి పలు సమస్యలతో కూడిన వినతులు సమర్పించారు. గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుపరచాలని, రోడ్లు, డ్రయినేజీలు ఏర్పాటు చేసి గ్రామపంచాయతీలను అభివృద్ధి పరచాలన్నారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ రైల్వే ట్రాక్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. మణుగూరు మండలంలో సింగరేణి కొత్త గనులు ఏర్పాటుచేసి మణుగూరు అభివృద్ధి చేయాలని కోరారు. సింగరేణి, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పినపాక సత్యమేవ జయతే నూతన ప్రెస్ క్లబ్ ఎన్నిక

- నూతన అధ్యక్షులుగా నిట్టా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పినపాక



మండలంలోని సీతారాంపురం వివేకానంద ఉచిత (గ్రూప్స్) కోచింగ్ సెంటర్ నందు సత్యమేవ జయతే నూతన ప్రెస్‌క్లబ్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా నిట్టా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అడేం యాకన్న, ప్రధాన కార్యదర్శిగా గుడికందుల రాజశేఖర్, గౌరవ అధ్యక్షులుగా కొంపెల్లి సంతోష్, గౌరవ సలహాదారుడిగా బోడ లక్ష్మణ్ రావు, ట్రెజరర్‌గా గుమాస్ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా గాడూదల దిలీప్, క్రీడా విభాగం రేసు కోటిలను ఎన్నుకున్నారు. మొత్తం 16 మంది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నిట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుంటామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా తమ క్లబ్‌ను సంప్రదించాలన్నారు. ఆ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి తీర్చే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. పినపాక సత్యమేవ జయతే ప్రెస్ క్లబ్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు గోడిశాల చంద్రం, దొడ్డ శ్రీనివాస్, కొంపెల్లి మల్లేష్, కొంపెల్లి నాగేష్, తోకల శంకర్, వీరముష్టి ఉదయ్ కుమార్, గుమాసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి పై దాడి...కేసు నమోదు

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

ఆటో డ్రైవర్ పై దాడి చేసిన ఘటనలో గ్రామీణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిన సంఘటన మండల పరిధి రాజాపురంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజాపురంకు చెందిన కోరం మధు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి రెడ్డిగూడెంకు చెందిన నల్ల పోతుల కొమరెల్లితో పాటు మరి కొంతమందిని పాల్వంచ నుండి రెడ్డిగూడెం తీసుకెళ్తూ.. రాజపురం ఓ కిరాణా షాప్ వద్ద ఆటో ఆపాడు. కొమురెల్లితో పాటు ఆటోలోని ప్రయాణికులు పెద్దగా అరుస్తుండగా మధు వారించాడు. దీంతో మధు, కొమురెల్లిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ మధుని కొమరల్లి గాజు సీసాతో కొట్టి, చంపుతానని బెదిరించాడు. మధుకు రక్త గాయాలయ్యాయి. ఆదివారం మధు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామీణ హెడ్ కానిస్టేబుల్ హరిబాబు కొమురెల్లిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- మొద్దులగూడెంలో మహాసభల గోడపత్రికల ఆవిష్కరణ

నవతెలంగాణ-దమ్మపేట



ఈ నెల 25 నుండి 28 వరకూ సంగారెడ్డిలో జరుగు సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం మహసభల పోస్టర్‌లను మొద్దులు గూడెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ సభలకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బి.వి.రాఘవులు, బృందకరత్, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొని దిశ నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, కొలికిపోగు శ్రీనివాసరావు, నబి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి



- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు

నవతెలంగాణ-బూర్గంపాడు



భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును రక్షించుకోవడం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల పెయింటర్స్ యూనియన్ కార్యాలయం నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిర్మారంగ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు వివక్షత చూపుతున్నాయని ఆయన విమర్శించారు. కార్మికుల కోసం ఖర్చు పెట్టవలసిన సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం దొడ్డిదారిన అడ్డగోలుగా ఖర్చు పెడుతుందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వపరంగా నిర్మించే అటువంటి అన్ని రకాల నిర్మాణ పనులకు స్థానిక కార్మికులను పనిలోకి తీసుకొని ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో సొంత ఇల్లు లేని నిర్మాణ రంగ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇల్లులు మంజూరు చేయాలని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ఫలితాలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని, అందుకోసం యూనియన్‌లో సంఘటితం అవ్వాలని ఆయన అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సీఐటీయూ పోరాట ఫలితమని ఆయన పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు లక్ష్యాలను ప్రభుత్వాలు నీరుగారిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రమాద బీమా పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని, సహజ మరణం పరిహారాన్ని ఐదు లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు అమలు చేసే పథకాలను ప్రయివేటు పరం చేయాలని చూసిన ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ పోరాటం చేయబట్టే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకుందని ఆయన పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం యూనియన్‌గా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. యూనియన్ కార్యాలయం పోరాటాలకు వేదికగా ఉండాలని ఆయన అన్నారు.

అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడులను తీసుకొచ్చి నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తుందని ఆయన విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాసే కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5వ తేదీన లేబర్ కోడ్ ప్రతులను దహనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పని గంటల పెంచాలని, కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు ఉండకూడదని బీజేపీ ప్రభుత్వం నియం తృత్వంగా వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల ఆదాయాలు పెరగటం లేదని ఆయన తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో వేతనాల పెరుగుదల, ఉపాధి అవకాశాల కోసం పోరాటాలు చేయటమే మార్గమని ఆయన పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయం వద్ద బూర్గంపాడు మండల పెయింటర్స్ యూనియన్ సీనియర్ నాయకులు మండల కార్యదర్శి ఎర్లంకి అప్పారావు జెండా ఆవిష్కరించారు. కార్యాలయం శిలాఫలకాన్ని కోటంరాజు ఆవిష్కరించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పతల నరసింహారావు, పెయింటర్ సీనియర్ మండల గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, పెయింటర్ సీనియర్ నాయకులు సగ్గెం శ్రీను, తోట మల్లయ్య, సిహెచ్ రమణయ్య, ఓర్సు పండు, నునే వెంకన్న, ప్రేమ్‌చందు, కోటయ్య పెరిక స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం మండలంలో పర్యటించారు. మండలంలోని చిన్నగొల్ల గూడెంలో కందుకురి మహాలక్ష్మడు-రమాదేవి దంపతుల మనవరాలి ఓణీల వేడుక, మనవడి పంచల వేడుకలో పాల్గొన్న మెచ్చా చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం మండల కేంద్రం దమ్మపేటలో ఇటీవలే చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పోతినేని వెంకట్ రావును, కక్కిరాల రత్నాకర్ రావులను వారి నివాసాలకు వెళ్లిన మెచ్చా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతు బంధు సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, జలగం వాసు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసు బాబు, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీను, పాకనాటి శ్రీను, రాంబాబు, రూపా రాంబాబు, గణేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయానికే పనులు పూర్తి చేయాలి

- అభివృద్ధి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ నిధులతో ప్రారంభించిన అభివృద్ధి పనులు నిర్దేశించిన సమయానికి గుత్తేదారులు నాణ్యతతో పూర్తి చేయాలని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు కాంట్రాక్టర్లను అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉదయం నుండే పట్టణంలోని అశోక్ నగర్, కొత్త కాలనీ, ఏఎంసీ కాలనీ, సుభాష్ నగర్, జగదీష్ కాలనీ తదితర ప్రాంతాలలో పంచాయతీ ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించి ఇటీవల ఎమ్మెల్యే నిధులతో ప్రారంభమైన సీసీ రోడ్లు డ్రైన్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా నివాస ప్రాంతాలలో పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ... అభివృద్ధి పనులలో గుత్తేదారులు జాప్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అశోక్ నగర్ కొత్త కాలనీ ఏర్పడి 40 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ శివారు ప్రాంతాలలో వీధిలైట్లు సేడ్ ట్రైన్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వెంటనే కొత్త కాలనీకి కావలసిన విద్యుత్ స్తంభాలను పంచాయతీ విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేసి కావలసిన స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 21 నుండి రేషన్ కార్డుల కొరకు గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో లబ్దిదారులు ఆయా గ్రామ సభలకు హాజరై రేషన్ కార్డులు పొందేలాగా పంచాయతీ అధికారులు చొరవ చూపాలని తెలిపారు. పట్టణంలోని పర్యటిస్తూ ఎమ్మెల్యే వీధి పక్కన చిన్న తోపుడు బండి వద్ద అల్పాహారాన్ని తీసుకొని సామాన్యుడిలా ప్రజలకు చేరువయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, బొంబోతుల రాజీవ్, గాడి విజయ్, అరికల తిరుపతిరావు, ఎండి నవాబు, బండారు నాగేశ్వరరావు, పుల్లగిరి నాగేంద్ర, స్థానిక ప్రజలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలి

- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల అవగాహనా సదస్సు
- సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎస్పీ

నవతెలంగాణ-కొత్తగూడెం



ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేద్దామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులు స్పష్టం చేశారు. ఆదివారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముందుగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కొత్తగూడెంలో ట్రాఫిక్ సమస్యను, పార్కింగ్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంలో పోలీసు వారు చేపట్టే కార్యక్రమాలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల సూచనలు పాటించాలి : ఎమ్మెల్యే

ట్రాఫిక్ నియంత్రణ కేవలం పోలీసులదే కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి. మద్యం, నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణం. రోడ్ల అభివృద్ధికి తగినన్ని నిధులు రాబడుతున్నామని, రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేసుకువాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సెంటర్లు ప్రమాదాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, తహసీల్దార్ పుల్లయ్య, ఆర్టీవో వెంకటనారాయణ, ఆర్ అండ్‌బి డిఈ, నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ శేషాంజనస్వామి, ఆర్టీసీ డిపో మేనేజర్, వేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

- ఆనాటి జ్ఞాపకాలను కలిసి పంచుకున్న చిన్ననాటి స్నేహితులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

వారందరూ భద్రాచలం పట్టణంలోని కుర్రాజుల గుట్ట జడ్పీ హైస్కూల్లో పదో తరగతి వరకు కలసి విద్యను అభ్యసించి అనంతరం వివిధ రంగాలలో స్థిరపడి సుమారు 23 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకున్నారు. ఒకచోటకు చేరుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ చిన్ననాటి గుర్తులను మెమరీ వేసుకుంటూ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన నిర్వహించున్నారు. ఒకరికి ఒకరుగా విడిపోని స్నేహంగా జీవితాంతం స్నేహ బంధాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. వివరాలకు వెళ్తే 2001-2002 సంవత్సరంలో పట్టణంలో ప్రస్తుత నన్నపనేని మోహన హైస్కూల్ ఒకప్పటి కొర్రాజుల గుట్ట జడ్పీ హైస్కూల్లో పదో తరగతి వరకు విద్యనభ్యసించిన విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం ఎటపాకలోని నక్కా వెంకన్న తోటలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం పేరుతో మళ్లీ ఒకచోట కలుసుకొని ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులను నేర్పిన గురువులను గుర్తు చేసుకుంటూ అమరులైన గురువులకు నివాళులు అర్పించారు. ఒకరి కష్టాలు మరొకరు పంచుకుంటూ అందరూ ఒకటిగా సమాజ సేవలో సైతం రానించాలని నిర్ణయించుకున్నారు. ఈ సమ్మేళనంలో తీసుకొన్న నిర్ణయాలను అమలుపరుస్తూ ప్రతి సంవత్సరం కలుసుకొని భవిష్యత్తులో చేయవలసిన కార్యక్రమాలపై చర్చించుకుందాం అని నిర్ణయించుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నవతెలంగాణ భద్రాచలం పాత్రికేయులు దారిశెట్టి సతీష్ బాబు, రాజేష్, రవితేజ, రాంప్రసాద్, ఆదినారాయణ, చంద్రశేఖర్, మనసే, రాజశేఖర్, సత్యనారాయణ, యర్రంశెట్టి. రమేష్, సాయిబాబు, కృష్ణ, గుప్తా, బాలకృష్ణ, సాగర్, మురళి, రవీందర్ రెడ్డి, జయకష్ణ, నక్షతం ఉష, కామాక్షి, భవాని, రాజరాజేశ్వరి, లావణ్య, సంధ్య, రాజేశ్వరి, రామలక్ష్మి, జ్యోతిర్మాయి, అరుణ, కల్పణ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి చైర్మెన్‌తో నిర్మాణాత్మక సమావేశాల కోసం కార్మికుల ఎదురుచూపులు

- డైరెక్టర్ పాతో జరిగి 2 నెలలైనా సమావేశపు ఊసులేవి
- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మంద

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి చైర్మెన్‌తో నిర్మాణాత్మక సమావేశాల కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారని, డైరెక్టర్ పాతో జరిగి 2 నెలలైనా సమావేశపు ఊసులేవి అని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి దాదాపు ఏడాది గడిచినా గుర్తింపు పత్రం కాల పరిమితిపై తేలని దృష్ట్యా ఆలస్యంగా అక్టోబర్‌లో ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత గుర్తింపు ప్రాతినిధ్య సంఘం నాయకులకు యాజమాన్యంతో పలు సంప్రదింపుల విషయాలపై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో యాజమాన్యం ఆయా ఏరియాలో ప్రతినెల జీఎం స్థాయిలో సమావేశాల నిర్వహణ, 3 నెలలకొక సారి కార్పొరేట్ స్థాయిలో డైరెక్టర్ (పా) సంస్థ చైర్మెన్ వద్ద నిర్మాణాత్మక సమావేశాలను నిర్వహిస్తున్నారన్నారు. గర్జన సంఘం అలుసుతోనే మార్చి వరకు ఉత్పత్తి మాసాల దృష్ట్యా నిలిపే బదిలీలు జూలై వరకు పొడిగించిందనే విమర్శలు, ఎన్నికలకు ముందు వరకు చేసిన పోరాటాలతో తెచ్చిన ఒత్తిడి గెలిచిన తర్వాత ఆ మేరకు పూర్తిస్థాయిలో చేయలేక పోతున్నారని పలువురు కార్మికులు గుసగుసలు ఆడుతున్నారన్నారు.

కార్మిక సమస్యలపై సీఎండితో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అలవెన్స్‌లపై ఐటీ మాఫీ సొంతింటి పథకం మారుపేర్ల అంశాలతో పాటు పలు క్యాడర్ స్కీములు కోల్ ఇండియా మాదిరి సవరణలు చేయాలని, రిటైర్మెంట్ రోజే బెనిఫిట్స్ ఇప్పించాలని, సంస్థకు రావాల్సిన బకాయిలపై ఒత్తిడి చేయాలని, సమయానికి నిర్వహించాల్సిన సమావేశాలను సక్రమంగా నిర్వహించి కార్మిక సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గా డిమాండ్ చేస్తున్నామన్నారు.



పేదలపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య

- మాస్‌లైన్ జిల్లా నాయకులు అమర్లపూడి

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేటలోని మల్లారం కాలనీ వద్ద నిరుపయోగంగా ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ స్థలాల్లో నిరుపేదలు గుడారాల నిర్మించుకొని నివసిస్తున్నండగా వారిపై మండల రెవిన్యూ, పోలీసు అధికారులు విశిక్షణా రహితంగా దాడులు నిర్వహించటం దుర్మార్గమైన చర్య అని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న ఆ డబల్ బెడ్ రూమ్ స్థలాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులకు అక్కడ నిరుపేదలు గుడారాలు ఏర్పాటు చేసుకోవడంతో గుర్తుకు రావటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పుడైనా వెంటనే నిరుపేదలకు స్థలాలతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు తోడం దుర్గమ్మ, పండూరి వీరబాబు, అనిల్ కుమార్, పెళ్లూరి జగదీష్, పి.శంకర్, గంగాధర నాగమణి, జుంజునూరి ముక్తేశ్వరి, కడమంచి నాగవల్లి, దాసరి సుజాత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-అశ్వారావుపేట



సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్నారు. ఈ మహాసభలు విజయవంతానికి చేపట్టే ప్రచార సామగ్రి గోడ పత్రికలను ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, చిరంజీవిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలు సందర్భంగా 25 నిర్వహించే ప్రజా ప్రదర్శనకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సోడెం ప్రసాద్ రావు, మండల కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు మడిపల్లి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

గ్రామసభలోనే లబ్ధిదారుల ఎంపిక జరగాలి

ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కారేపల్లి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలలో నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లి మండలం ఎర్రబోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ఇండ్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు అధికారులు నిర్వహిస్తున్న సర్వే జాబితాలో లేక పోవటం బాధ్యత రహిత్యమన్నారు. జరిగిన తప్పిదాన్ని సవరించి దరఖాస్తులు లేకున్నా సర్వే నిర్వహించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. 10 ఏండ్లుగా పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదని, లబ్ధిదారుల ఎంపికను రేషన్ కార్డులతో ముడి పెట్టకుండా చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కరపటి సీతారాములు, కల్తి రామచంద్రు, కుర్సం శ్రీను, పూనెం బాబు, చరప వీరస్వామి, కరపటి లక్ష్మయ్య ఈసం వెంకన్న, పాయం ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలనలో ప్రతి అర్హుడుకి ప్రభుత్వ పథకాలు అందాలి

కాంగ్రెస్ పార్టీ అడహక్ మండల కమిటీ కన్వీనర్ దీపక్ నాయక్

నవతెలంగాణ-రఘునాథపాలెం

మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రఘునాథ పాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అడహక్ కమిటీ కన్వీనర్ వాంకుడోత్ దీప్లా నాయక్ అధ్యక్షతన మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మార్చి 26న అమలు కాబోతున్న ప్రభుత్వ పథకాలను గురించి వారు చర్చించారు. ప్రజా పాలనలో ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రజా పాలనలో ప్రతి పేదవాడికి న్యాయం చేయలని, ప్రతి గ్రామంలో ఉన్న ఇందిరమ్మ కమిటీలు, బాధ్యత తీసుకోవాలన్నారు. రేషన్ కార్డు , ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, పథకాలలో అర్హుడై ఉండి అనర్హుడుగా జాబితాలో ఉన్నట్లయితే, వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, వాటిని అధికారులు వెంటనే పరిశీలించి గుర్తించాలని, వారన్నారు. సమావేశంలో ఖమ్మం మార్కెట్ చైర్మన్ ఎర్రగళ్ల హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాత రఘురాం, అడహక్ కమిటీ సభ్యులు రెంటాల ప్రసాద్, తేజావత్ వెంకన్న ధరావత్ రామ్మూర్తి నాయక్, బుక్య బాలాజీ నాయక్, చెరుకూరి పూర్ణచంద్రరావు, కేలోత్ దేవ్ సింగ్ నాయక్, బండి వెంకన్న, కుటుంబాక సీతారాం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడిని జయించవచ్చు : ఎస్సై

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ప్రెస్‌క్లబ్, పోలీస్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ప్రెస్ క్లబ్ జట్టు విజయం సాధించింది. అంబేద్కర్‌యూత్ ఆధ్వర్యంలో కారేపల్లి, కామేపల్లి మండలాల స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈసందర్భంగా అంబేద్కర్ యూత్ ప్రెస్, పోలీస్ జట్లకు క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించింది. ఇరు జట్టులో ఉత్సహంగా ఆటలో పాల్గొని తమ జట్టు విజయం కోసం శ్రమటోడ్చారు. అంతకు ముందు ప్రెస్ టీం కెప్టెన్ పాలిక శ్రీను, పోలీస్ టీం కెప్టెన్ ఎస్సై ఎన్.రాజారాంలు టాస్ వేసి ఆటను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వృత్తి పరంగా రెండు విభాగాలు ఎంతో వత్తిడితో కూడుకున్నవన్నారు. క్రీడలతో ఎంతటి ఒత్తిడినైనా జయించవచ్చున్నారు. యువత తమ దృష్టి చేడు వ్యసనాల నుండి దృష్టి మరలించి తమ కేరియర్‌పై దృష్టి పెట్టాలన్నారు. జీవితంలో ఒత్తిడిని జయిస్తే విజయం దరి చేరుతుందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూక్యా తిలక్‌కిషోర్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు కే.వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యూత్ నాయకులు ఆదెర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

21 నుండి లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

నవతెలంగాణ-కారేపల్లి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 21వ తేది నుండి మూడు రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా సహకార అధికారి జీ.గంగాధర్ తెలిపారు. ఆదివారం గ్రామసభల నిర్వహణపై ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ మండలంలోని 41 గ్రామపంచాయతీలలో 21,22,23 తేదీలలో తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించి దరఖాస్తుదారుల జాబితాను ప్రకటించాలన్నారు. లబ్ధిదారులను ఎంపికను గ్రామసభలో ప్రకటించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎస్సై ఎస్.రాజారాం, ఏవో బీ.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య స్కూల్ ప్రవేశాలను దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కారేపల్లి

ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. ఫిబ్రవరి 16వ తేదివరకు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గల 23 ఏకలవ్య పాఠశాలలలో 1380 ఖాళీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి ప్రవేశ పరీక్ష నిర్వహించి దానిలో వచ్చిన మార్కులు ఆధారంగా రిజర్వేషన్ పాటిస్తూ విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. దరఖాస్తులను టీఎస్‌ఈఎంఆర్ఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ చేసుకోవచ్చన్నారు. గిరిజన, తల్లిదండ్రులు లేని, దివ్యాంగులైన తల్లిదండ్రులు గల విద్యార్థులు ఐదవ తరగతి చదివి ఉండి మార్చి 2025 నాటికి 10 నుంచి 13 ఏండ్ల లోపు వయస్సు ఉండి ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం పట్టణ ప్రాంతం రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతం వారి ఆధాయం రూ. 1.50 లక్షలు లోపు ఉండాలన్నారు. మార్చి 16 న ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షా రుసుం రూ.100 ఉంటుందని తెలిపారు. సింగరేణి ఏకలవ్య స్కూల్ 6వ తరగతిలో 30 మందికి బాలికలకు, 30 మంది బాలురకు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మాజీ ఎంపీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం మాజీ ఎంపీటీసీ బానోత్ లాల్ నాయక్ తండ్రి బానోత్ దేవ్లానాయక్ ఆనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ మాజీ ఎంపీటీసీ లాలునాయక్‌ను ఫోన్‌లో ఆదివారం పరామర్శించారు. దేవ్లానాయక్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. దేవ్లానాయక్ కుటుంబాన్ని జీవన్‌లాల్ యూవసేన రాష్ట్ర నాయకులు అజ్మీర వీరన్న పరామర్శించారు.

బ్రహ్మంగారి ఆలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రారంభానికి వైరా ఎమ్మెల్యేకు మాలోత్ రాందాస్ నాయక్‌ను అలయ కమిటీ ఆహ్వానించింది. ఆదివారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఇంటికి వెళ్ళి అయనకు ప్రారంభోత్సవ ఆహ్వానాన్ని అందజేశారు.మార్చి 2న పోతూలిరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీగోవిందమాంబ సమేత బ్రహ్మం గారి విగ్రహాలతో పాటు ధ్వజ స్తంభప్రతిష్టను నిర్వహించనున్నారు. ఆహ్వాన పత్రం అందించిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షకార్యదర్శులు తుమ్మోజు రాంమ్మూర్తి, వేములూరి కోటాచారి, పోలోజ రామాగారిన కల్లూరి నాగాచారి, గుండోజు బ్రహ్మాచారి, సంగు నాగేశ్వరరావు, మోజేపల్లి వాసుదేవచారి పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వే

నవతెలంగాణ-ముదిగొండ

గోకినేపల్లి గ్రామంలో రైతుభరోసాపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాగులో లేని భూములపై విస్తృతంగా సర్వే నిర్వహించారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26న రైతు భరోసా నిధులను వ్యవసాయ యోగ్యమైన భూములకే వేస్తామని ప్రకటించిన విషయము విధితమే. ఈనేపథ్యంలో అధికారులు వ్యవసాయేతర భూములపై మండలంలో గత మూడు రోజుల నుండి క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే నిర్వహిస్తున్నారు. సాగుకు యోగ్యమైన భూములతోపాటు, సాగు చేయని భూముల నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి టి వేణు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కె సునీతఎలిజిబెత్, ఏఈఓ ఆకారపు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వికలాంగ యువకుడు మృతి

నవతెలంగాణ-కూసుమంచి



మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన(వికలాంగుడు) వికలాంగుల సంఘం మండల కార్యదర్శిగా పనిచేస్తున్న నేతగాని గోపి ప్రయాణిస్తున్న మూడు చక్రాల మోటార్ సైకిల్‌ను కొనిజర్ల మండలంలో కారు ఢీ కొట్టడంతో శనివారం మృతి చెందారు. ఆదివారం నాయకన్ గూడెం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, వికలాంగుల సంఘం జిల్లా, మండల నాయకులు నివాళులర్పించారు.

దామోదర్ మృతిపై భిన్నాభిప్రాయాలు..

- ఎన్కౌంటర్‌లో మృతి చెందాడా? సజీవంగా ఉన్నాడా..?
- దామోదర్ మృతిపై తెలంగాణ మావోయిస్టు పార్టీ ఎందుకు స్పందించలేదు?
- సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ గంగ పేరిట లేక ఎందుకు విడుదల అయ్యింది?

నవతెలంగాణ-చర్ల





సరిహద్దు చతీస్‌గడ్ బీజాపూర్ జిల్లా ఊసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 16వ తేదీన మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన భారీ ఎన్కౌంటర్లో తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శి సెంట్రల్ కమిటీ సభ్యుడైన దామోదర్ అలియాస్ బడే చొక్కారావు మృతి చెందాడని వచ్చిన కథనాలపై నటింట పలు అనుమానాలు, భిన్నాభిప్రాయాలు, విభిన్న ఆలోచనలు వెల్లువెత్తుతున్నాయి. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు 50 లక్షల రివార్డు గల దామోదర్ ఎన్కౌంటర్లో మృతి చెందాడా? జీవించి ఉన్నాడా? అనే అనుమానాలు ప్రతి ఒక్కరిలో ఆలోచింప చేస్తున్నాయి. ఈ క్రమంలో నవతెలంగాణ చేసిన పరిశీలనలో కొన్ని అనుమాన స్పంద మైన విషయాలు చెక్కర్లు కొడుతున్నాయి. దామోదర్ మృతి పై ఇప్పటి వరకు ఇటు తెలంగాణ పోలీస్ కాని అటు చతీస్‌గడ్ పోలీసులు కానీ ఎటువంటి స్పష్టమైన ప్రకటన ప్రకటించలేదు. 30 సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులైన ఎల్లయ్య సమ్మక్కలను విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిన దామోదర్ చదివినది ఇంటర్మీడియట్ అయిన దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతూ మావోయిస్టు పార్టీకి వెన్నుపూసల ఉన్నాడని పలువురు విశ్లేషిస్తున్నారు. దామోదరకు నలుగురు అక్క చెల్లెలు రామారావు అనే అన్న ఉండేవాడు. అన్న కొంతకాలం క్రితమే మృతి చెందాడు. దామోదర్ అజ్ఞాతంలోనే మావోయిస్టు రజితని అర్ధాంగిగా చేసుకున్నాడు. మంచి క్రమశిక్షణ నిబద్ధత కలిగిన షూటర్‌గా పలువురి మన్ననలు పొందాడు.

దామోదర్ మృతిపై తెలంగాణ మావోయిస్టు పార్టీ ఎందుకు స్పందించలేదు

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా తాడువాయి మండలం కాలవపల్లిలో జన్మించి తన కుటుంబ సభ్యులు ఎన్కౌంటర్లో మృతి చెందారు. దీంతో పోలీస్ పై ఉక్రోషంతో మావోయిస్టు పార్టీలోకి వెళ్లి దినదిన అభివృద్ధి చెంది సెంట్రల్ కమిటీ సభ్యుడిగా మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగాడు. అనేక ఆటు పోటు లను ఎదుర్కొని మావోయిస్టు పార్టీని కంటికి రెప్పలా కాపాడిన దామోదర్ మృతి చెందాడని వస్తున్న కథనాలపై ఇప్పటివరకు తెలంగాణ మావోయిస్టు పార్టీ ఎందుకు స్పందించలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మావోయిస్టు పార్టీలో ఎవరు వీరమరణం పొందిన స్పందించే తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ మోస్ట్ వాంటెడ్ దామోదర్ మృతిపై ఎందుకు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని పేపర్లు, ఛానళ్లు దామోదర్ మృతి చెంది ఉండకపోవచ్చు అని భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ ఉంటే మావోయిస్టు పార్టీ ఎటువంటి ప్రకటన చేయకుండా మౌనంగా ఉండడానికి కారణం ఏమిటని పలువురు విశ్లేషిస్తున్నారు.

దామోదర్ మృతి చెందాడని దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ లేక ఎందుకు విడుదల చేసింది

తెలంగాణ రాష్ట్రంలో నిర్బంధాలు తాళలేక చతీస్‌గడ్ అడవుల్లో తలదాచుకుంటున్న తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు పార్టీ కమిటీ ఎన్కౌంటర్లకు కండన, బందులకు పిలుపులు ఇస్తూ లేఖలు పత్రికేయులకు పంపే సాంప్రదాయం ఉంది. సాక్షాత్తు మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎన్కౌంటర్లో మృతి చెందితే తెలంగాణ రాష్ట్ర స్పందించకుండా చతీస్‌గడ్ దక్షిణ బస్తర్ కమిటీ కార్యదర్శి గంగా పేరిట దామోదర్ మృతి చెందాడనే లేక విడుదల కావడంలో ఆంతర్యం ఏమిటి?. చతీస్‌గడ్ పోలీసులు కేవలం 12 మంది మావోయిస్టులు మృతి చెందారని పత్రిక ప్రకటన ఇవ్వడం జరిగింది. ఎన్కౌంటర్లో ఒక్క తెలంగాణ మావోయిస్టు కూడా లేకుండా ఉన్న తరుణంలో కేవలం రాష్ట్ర కార్యదర్శి దామోదర్ ఎలా ఉంటాడు అనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. దామోదర్ మృతి చెందాలంటే ఆయనకున్న నాలుగు అంచల భద్ర సేదించే లోపు 40 నుండి 50 మంది సెంట్రీ మృతి చెందాల్సి ఉంటది కదా...అలా జరగలేదు కాబట్టి దామోదర్ మృతి చెందకపోవచ్చు అని.... ఎన్కౌంటర్ సమయంలో సెంట్రీ లేకపోవడమే దామోదర్ మృతి చెందాడని మరోపక్క భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అన్నిటికీ కాలమే సమాధానం చెప్పవలసి ఉంది. అప్పటివరకు వేచి చూద్దాం.

ఎస్సీ వర్గీకరణ చేసి తీరాల్సిందే...

ఇది మాల, మాదిగల సమస్య కాదు

ఎస్‌సి వర్గీకరణకు మేధావుల సంఘీభావ సదస్సులో వక్తలు

పలు ప్రజా సంఘాల, బిసి సంఘాల, రాజకీయ పార్టీల సంఘీభావం

నవతెలంగాణ-ఖమ్మం



ఎస్సీ వర్గీకరణ వెంటనే చేసి తీరాల్సిందేనని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఇది మాల, మాదిగల మధ్య గొడవ కాదని, రెండు కులాల సమస్యగా చూడొద్దని హితవు పలికారు. జాషువా సాహిత్య వేదిక, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక, బిసి సంఘాల జెఏసి, తెలంగాణ పీపుల్స్ జెఏసి ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ-మేధావుల సంఘీభావ సదస్సు ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగింది. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు ముప్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు, కుల, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు పాల్గొని ప్రసంగించి సంఘీభావం తెలిపారు. ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు ఐవి రమణారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగల పంచాయతీ కాదన్నారు. కొంతమంది అలా వ్యవహరిస్తూ చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అట్టడగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలనేది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారన్నారు. అందుకే సమాజంలో అట్టడుగున ఉన్న మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అందరూ సమైక్యంగా ఉండాలన్నారు. అదే సందర్భంలో మాల, మాదిగలు రెండూ అణగారిన వర్గాలనేది గమనించాలన్నారు. సదస్సులు, సమావేశాలకు పరిమితం కాకుండా ఒక కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. 40 ఏళ్లగా వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం అభినందనీయమని, అందరూ అండగా ఉండాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమగ్ర సర్వే ద్వారా 91 శాతంగా బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనార్టీలు ఉన్నట్లు తెలుస్తోందని, వీరంతా ఐక్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని సూచించారు. ఈ సదస్సులో కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, చోటే బాబా, కోట రాంబాబు, బిఆర్ఎస్ నుండి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, టీడీపీ నుండి కూరపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ నుండి శింగు నర్సింహారావు, సీపీఐ(ఎం) నుండి ఎం.సుబ్బారావు, మాస్‌లైన్ నుండి ఆవుల అశోక్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నుండి అవునూరి మధు, ఆప్ నుండి ఎస్.తిర్మల్, పిఆర్‌టియు నుండి మనోహర్‌రాజు, యుటిఎఫ్ నుండి జివి నాగమల్లేశ్వరరావు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నుండి గురుమూర్తి, జూనియర్ లెక్చరర్స్ నుండి నయిం పాషా, బార్ అసోసియేషన్ నుండి శ్రీనివాసరావు, ప్రముఖ సిఏ మందా కృష్ణ తదితరులు ప్రసంగించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ లాయర్ మేకల సుగుణారావు, దేవిరెడ్డి విజయ్, జాషువా సాహిత్య వేదిక సభ్యులు కోండ్రు బ్రహ్మం, నామా పురుషోత్తం, కన్నెగంటి వెంకటయ్య, ఐనాల సైదులు, గద్దపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆలోచింపజేసిన సంకల్పం నాటిక

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలోనెల నెలా వెన్నెల 90వ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన సంచాలనాత్మక నాటిక సంకల్పం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. విశాఖపట్నం జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో సంకల్పం నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. మహిళా పాత్రధారులతో ఆద్యాంతం ఈ నాటిక కొనసాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఉత్తమ రైతుగా ఎదిగి రైతే దేశానికి రాజని నిరూపించింది. వనం శ్రీముఖి శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది. తొలుత కీర్తిశేషులు సరళాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవి మారుత్ మాట్లాడుతూ కళలను ప్రోత్సహించాలని అన్నారు. ఎంతో శ్రమ కోర్చి కళారూపాలను తయారు చేస్తున్న కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జిల్లా లక్ష్మీనారాయణ, తిరుమల చార్యులు ,వనం కృష్ణవేణి, నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్, మెటమర్రి డాక్టర్ నాగబత్తిని రవి, దేవేందర్, సదానందం, లక్ష్మీనారాయణ, యాంకర్ మొగిలి గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండల పరిధిలోని లక్ష్మీనగరం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద భద్రాచలం నేతాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ఆదివారం విజయవంతం అయింది. ఈ వైద్య శిబిరాన్ని డాక్టర్ హేమంత్ కాకర్ల, డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎముకలు వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కాకర్ల మాట్లాడారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు హేమంత్. కాకర్ల, ప్రముఖ చిన్న పిల్లల వైద్యునిపుణులు డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డి, జనరల్ వైద్యులు డాక్టర్ సుకన్యరెడ్డి వైద్య సేవలు అందించగా, ఈ వైద్య శిబిరానికి వచ్చిన 250 మందికి రూ. 2500ల విలువగల ఎముకల సాంద్రత బిఎండి పరీక్ష, అలాగే గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్ష, షుగర్ పరీక్ష ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వహకులు జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఆటలతో శరీర దృఢత్వం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



ఆటలతో శరీర దృఢత్వం పెరుగుతుందని పని విధానాలలో పడి ఆటలకు పాటలకు దూరమైన పరిస్థితిల నుండి బయటపడాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెం రిపబ్లిక్ డే సందర్భంగా పురస్కరించుకొని కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రామవరం సాధన గ్రౌండులో క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ శారీరక మానసిక పునరుత్తేజానికి వీలు కలిగిన మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ క్రీడల వల్ల నూతన ఉత్తేజాన్ని చేకూర్చుకుంటారని, కోర్టు కుటుంబంలోని సభ్యులు అందరూ కలిసి విధంగా క్రీడలు ఆడుకోవడం వలన ఒకరికొకరు స్నేహం పెంపొందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, కే.శిరీష, వి.శివానాయక్, న్యాయవాదులు పలివెల సాంబశివరావు, పోసాని రాధాకృష్ణమూర్తి, అణుబ్రోలు రాంప్రసాదరావు, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు. గెలుపొందిన జ్యూడిషల్ డిపార్ట్మెంటు టీము విన్నర్స్, లాయర్స్ టీం రన్నర్స్, క్రీడాకారులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతుల ప్రధానం చేయబడుతుందని, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి దూదిపాల రవికుమార్ తెలిపారు.

జనాదరణ పొందేలా 'నవతెలంగాణ' నూతన డైరీ

- వూకె కిశోర్ బాబు, కోండ్రు మంజు భార్గవి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సరం 2025 డైరీ ప్రింటింగ్ జనాదరణ పొందేలా ఆకర్షణీయంగా ఉందని స్థానిక అక్షర సమిధ వ్యవస్థాపకులు వూకె కిశోర్ బాబు, తాజా మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి దంపతులు కొనియాడారు. ఆదివారం మండల పరిధిలోని అనంతోగు గ్రామం వారి స్వగృహంలో నూతన సంవత్సరం 2025 నవతెలంగాణ దినపత్రిక డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పాలకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పరిష్కరించే విధంగా చేయడంలో నవతెలంగాణ దినపత్రిక ది అందెవేసిన చెయ్యని చెప్పారు. రానున్న కాలంలో మండల సమస్యలు పరిష్కారానికి మరింతగా కృషి చేస్తుందని దంపతులు ఇరువురు అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారానికి ప్రజలకు, ప్రభుత్వానికి, అధికారులకు నడుమ వారధిగా నవతెలంగాణ దినపత్రిక నిలుస్తుందన్నారు.

సబ్ ప్లాన్ నిధులను దళితవాడలకు ఖర్చు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ

నవతెలంగాణ-నేలకొండపల్లి



రాష్ట్ర ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను చట్ట ప్రకారం దళితవాడలకు మాత్రమే ఖర్చు చేయాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు పాపెట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కెవిపిఎస్ మండల కార్యాలయంలో సంఘం మండల జనరల్ బాడీ సమావేశం పొట్టపెంజర స్టాలిన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరిస్తుందని విమర్శించారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు దళితవాడలకు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఇందిరమ్మ ఇండ్లు ఎస్సీలందరికీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుండి 2021 ఎస్సీ కార్పొరేషన్‌లో ఎంపిక కాబడిన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. లేనియెడల ఎస్సీలందరిని సమీకరించి ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు.





అనంతరం కెవిపిఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పెద్దపాక భాస్కరరావు, కార్యదర్శిగా పొట్టపెంజర స్టాలిన్, ఉపాధ్యక్షులుగా శ్యామలేటి నరేందర్ తోపాటు 14 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, పెద్దపాక భాస్కరరావు, శ్యామ్ లేట్ నరేందర్, మందుల లచ్చయ్య, బొడ్డు మధు, చేకూరి నాగేశ్వరరావు, భూక్య రమేష్, బొడ్డు వేణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన్న జయంతి వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

వేమన జయంతి సందర్భంగా ఆయన ఫోటోకి పూలమాలవేసి రాఘవ నిలయరెడ్డి అసోసియేషన్ సభ్యులు, రాఘవ నిలయం కార్యదర్శి రమణారెడ్డి సుధాకర్‌రెడ్డి, గాదె మాధవరెడ్డి మాట్లాడుతూ. 15 వ శతాబ్దానికి చెందిన ప్రజాకవి గాయకుడు ఆధ్యాత్మికవేత్త ప్రజలందరినీ సన్మార్గంలో దైవభక్తిలో బ్రతకటానికి విలువలు బ్రతకటానికి ఆహారం బ్రతకటానికి సన్మార్గం ఎలా తెలుసుకోవాలో పద్యాల రూపంలో తెలియపరచిన మహనీయుడు అని ఆయన సేవలను కొనియాడారు. విశ్వదాభిరామ వినరవేమ అనగానే గుర్తొచ్చే కవి ఎవరైనా ఉన్నారా అని అంటే ఇన్ని వందల సంవత్సరాల తరువాత కూడా ప్రతి తరానికి గుర్తొచ్చేది వేమన ఎంతో శివ భక్తుడైన వేమన రెడ్డి 5000.. పైచిలుకు పద్యాలని తెలుగులో అనుసంధానం చేసి అందరికీ అర్థమయ్యేలా కవిత్వాన్ని రచించిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో గాదె మాధవరెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు దారా బాలాజీరావు, మోత్కూరి వీరయ్య, యశోద రాంబాబు, మెడికల్ షాప్ మధు, షేక్ అజీమ్, శ్రీధర్‌రెడ్డి, విద్యాసాగర్, చలపతిరావు, మేనేజర్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధం

నవతెలంగాణ-కల్లూరు



సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, కావలసిన రైతులు అందుకు సిద్ధం కావాలని తెలంగాణ అమ్మ మ్యాను ఫ్యాక్చరింగ్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పుచ్చకాయల సత్తిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం హైదరాబాదులోని అగ్రికల్చర్ కమిషనరేట్ జరిగిన మ్యానుఫ్యాక్చర్స్ మిషనరీ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ రాష్ట్ర అధికారులు పాల్గొని త్వరలోనే సబ్సిడీ సంబంధించిన నిధులను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. 50 కోట్లు బడ్జెట్ ఉన్నది, సబ్సిడీ ఇస్తామనీ మన రైతులకు ఉపయోగపడే పనిముట్ల గురించి చర్చించడం జరిగింది. ఈ సబ్సిడీ ఫిబ్రవరి మొదటి వారంలో మొదలుపెట్టే అవకాశం ఉంది. వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై తీసుకోవాల్సిన రైతులు సిద్ధం కావాలన్నారు. గతంలో సబ్సిడీ నిలిపివేయడంతో రైతులు వ్యవసాయం పరికరాలు తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారని ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఇస్తుందని ఆ సమావేశంలో అధికారులు తెలిపారని చెప్పారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా



- అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వనోళ్లు ఏదేదో మాట్లాడుతున్నరు
- కోటీశ్వరులకు రైతు బంధు ఇచ్చి కష్టజీవులను విస్మరించారు
- అపోహలు వీడి కూలీ భరోసాను స్వాగతించండి :మాజీమంత్రి హరీశ్‌రావుకు మంత్రి సీతక్క కౌంటర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'భూమి లేని ఉపాధి కూలీలకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉపాధీ కూలీలకు రెండు దఫాల్లో ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందివ్వబోతున్నది. దేశానికే ఆదర్శంగా నిలవబోతున్నది. యావత్ దేశం ఈ స్కీం పట్ల ఆసక్తి చూపుతుండగా..తెలంగాణలోని కొన్ని రాజకీయ శక్తులు ఈ పథకంపై తప్పుడు గణాంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయి. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వని నేతలు ఇప్పుడు వారిపై కపట ప్రేమ నటిస్తున్నారు. రూ. 500 కోట్ల ఆస్తులున్న వారికి సైతం రైతు బంధు ఇచ్చి..రెక్కల కష్టం తప్ప ఎలాంటి ఆస్తి పాస్తులు లేని కూలీలను పట్టించుకోలేదు. ఇప్పుడు కూలీలకు ఆర్థిక చేయూతనందిస్తుంటే చూసి ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతున్నారు' అని మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబం యూనిట్‌గా అమలవుతున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సైతం అదే నిబంధన వర్తిస్తోందని తెలిపారు. ఎమ్‌జీనరేగా పోర్టల్ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయనీ, అందులో 22.64 లక్షల కుటుంబాలు కనీసం ఒక్క రోజు కూడా ఉపాధి పనుల్లో పాల్గొనలేదని తెలిపారు. కేవలం జాబ్ కార్డు కలిగి ఉన్నంత మాత్రాన ఉపాధి కూలీగా పరిగణించలేమని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా జీవనోపాధి పొందితేనే ఉపాధి కూలీగా పరిగణిస్తామని తెలిపారు. సుమారు 17.26 లక్షల వరకు కుటుంబాలే 20 రోజుల పనిని పూర్తి చేసుకున్నాయనీ, అందులో 11 లక్షల కు పైగా కుటుంబాలకు సొంత భూమి ఉండటంతో రైతు భరోసా లబ్ధిదారులుగా ఉన్నారని వివరించారు. ఎలాంటి భూమి లేని 6 లక్షలకు పైగా ఉపాధి కూలీ కుటుంబాలుంటాయన్న అంచనాతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పక్షపాతంతో వ్యవహరించకుండా గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

అప్పులబాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే కోరం, హరిప్రియ నివాళి





(ఫైల్)

నవతెలంగాణ-ఇల్లందు

అప్పులబాధతో ఆటో డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన రెడ్డబోయిన సుమంత్ (36) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, 8 నెలల కిందట కొత్త ఆటో కొనుగోలు చేశాడు. ఆటో కిరాయిలు లేక నెలవారీ కిస్తీలు చెల్లించలేకపోయాడు. దాంతో రూ.5లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. ఆటో గిరాకులు లేక, అప్పులు తీర్చలేక, ఇల్లు గడవడం కష్టంగా మారడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమార్తెలున్నారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే కోరం

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, వార్డు కౌన్సిలర్ వారా రవితో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సుమంత్ భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణ సహాయంగా రూ.5000 అందించారు. ప్రభుత్వం తరఫున కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ కూడా సుమంత్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.5000 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందనేది ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతన్నలు, ఆటో డ్రైవర్లను చూస్తే అవగతమవుతుందన్నారు.

నాపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై నో కామెంట్
- పేదల ఇండ్లను కూలిస్తే ఊరుకోబోం..

కొట్లాటకు సిద్ధం : ఎంపీ ఈటల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్నవారే తనపై సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి అంశంపై తాను ఎలాంటి కామెంట్ చేయబోనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదల ఇండ్లను కూలుస్తుంటే చూస్తూ ఊరుకోబోమనీ, కొట్లాటాకు తాము కూడా సిద్ధమేనని ప్రకటించారు. అత్యంత అవినీతి, అసమర్థ, మంత్రుల మధ్య సమన్వయం లేని ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సర్కారేనని విమర్శించారు. ప్రతి బిల్లు చెల్లింపులోనూ 7 నుంచి 10 శాతం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొన్ని రోజులు హైడ్రా పేరిట, మరికొన్ని రోజులు మూసీ పేరిట పేదల ఇండ్లను కూల్చిందని విమర్శించారు. దేశంలోనే అతిపెద్ద, అతిపురాతనమైన స్లమ్ బాలాజీనగర్, జవహర్‌నగర్ ప్రాంతమనీ, ఆ ప్రాంతంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా వలస వచ్చిన ఎంతోమంది కూలీలు, పేదలు నివసిస్తున్నారని తెలిపారు.

ప్రజలు కబ్జా చేసుకుని ఇండ్లు కట్టుకోలేదనీ, డబ్బులు పెట్టి కొని కట్టుకున్నారని చెప్పారు. బ్రిటీష్ కాలంలో ఈ భూమిని సైనికులకు కేటాయించారన్నారు. ఆ భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదనీ, కేర్ టేకింగ్ మాత్రమే చేపట్టాలని 1951లోనే స్పష్టంచేశారని తెలిపారు. సైనికులు కొందరు ఆ భూమిని అమ్ముకుంటే వారి నుంచి పేదలు కొనుక్కున్నారని చెప్పారు. గతంలోనూ కాంగ్రెస్ మంత్రి కమతం రాంరెడ్డి ఆ ప్రాంతంలో ఇండ్లను కూల్చాలని మిషన్లను పంపారనీ, ఇప్పుడు రేవంత్‌రెడ్డి కూల్చివేతలు చేయిస్తున్నారని విమర్శించారు. బాలాజీ నగర్‌లో పేదల ఇండ్లను కబ్జా చేసేవాళ్లు,అమ్మకాలు, కొనుగోలు చేసే బ్రోకర్లు ఎక్కువైపోయారనీ, రెవెన్యూ అధికారుల ఆగడాలు శృతిమించిపోతున్నాయని ఆరోపించారు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు చెల్లిస్తే తప్ప రేకుల షెడ్లు వేసుకునేందుకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. డబ్బులివ్వకపోతే ఇండ్లను కూల్చివేయిస్తున్నారని ఆరోపించారు. మల్కాజిగిరి ఎంపీగా పనిచేసిన సీఎం రేవంత్ కు ఈ ప్రాంత ప్రజల బాధలు తెలియవా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణకు సహకరిస్తారా? అన్న అంశంపై ఈటల స్పందిస్తూ..మిడిమిడి జ్ఞానంతో ఉన్నవాళ్లు, అవగాహన లేనివాళ్లు, ప్రభుత్వ పనివిధానం తెలియనివాళ్లు ఏదేదో మాట్లాడుతున్నారనీ, అన్ని డిపార్ట్ మెంట్లు బిల్లులు చేసి పంపిస్తే డబ్బులు రిలీజ్ చేసేది ఆర్థికశాఖ అని తెలిపారు. బిల్లులు రిలీజ్ అవ్వాలంటే 7 నుంచి 10 శాతం కమీషన్ లేనిదే రిలీజ్ చేయడం లేదని విమర్శించారు.

మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లకు

వినూత్న మెట్రో మార్గాలు

- సీఎం సూచన మేరకు జేబీఎస్‌ను ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేస్తాం : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో ఎండీ క్షేత్రస్థాయి పరిశీలన

ఈ రెండింటితో ఎయిర్‌పోర్ట్ కారిడార్ అనుసంధానం



సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే వారితోపాటు సికింద్రాబాద్, నగరంలోని ఉత్తర ప్రాంతాల నివాసితుల రాకపోకలు, ఇతర అవసరాలను తీర్చడానికి జేబీఎస్‌ను ఒక ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికలు రూపొందిస్తామని మెట్రో ఎండీ తెలిపారు. ఇందుకోసం

సులువుగా భూముల సమీకరణ..

జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, రక్షణశాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని వెల్లడించారు. ఈ క్షేత్ర పర్యటనలో హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు బి.ఎన్. రాజేశ్వర్, ఎం.విష్ణు వర్ధన్ రెడ్డి, ఎ. బాలకృష్ణ, డిప్యూటీ సీఈ(రైల్వేస్) జె.ఎన్.గుప్తా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ముఖ్యంగా మేడ్చల్, శామీర్‌పేట్ దిశగా సాగే కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు హైదరాబాద్ ప్రజల సౌకర్యవంతమైన ప్రయాణానికి కొత్త మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును ప్రారంభించారు. ఫేజ్-2 పార్ట్ 'బీ'లో ప్యారడైజ్ - మేడ్చల్ (23కి.మీ), జేబీఎస్-శామీర్‌పేట్ (22కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్ల విషయంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఇంజినీరింగ్ పరంగా ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.

బేగంపేట్ విమానాశ్రయ సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుంచి బోయినపల్లి వరకు రోడ్డు వంపు చాలా ఎక్కువగా ఉండటం, విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంత దూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం(తాడ్‌బండ్-బోయినపల్లి వైపు) రన్‌వే కింద దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. హెచ్ఎండీఏ మార్గానికి అనుసంధానంగా రెండు స్థాయిలపైన ఉండే డబుల్ ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఈ భూగర్భ సొరంగంలోకి దింపి, మళ్లీ రెండు స్థాయిల ఎలివేటెడ్ మార్గంగా పైకి తీసుకురావడం అనేది ఇంజినీరింగ్ పరంగా అనేక సమస్యల్ని సృష్టిస్తుంది. ఈ సమస్యలను విశ్లేషించి అనువైన మార్గానికి ప్రణాళికలు సిద్ధం చేయడానికి మెట్రో అధికారులు నడుం బిగించారు. అలాగే, ముఖ్యమంత్రి సూచించిన ప్రకారం మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభం స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచ స్థాయిలో ఒక హబ్‌ని ఏర్పాటు చేయడం, ఈ కారిడార్లు కొంత దూరం వెళ్లిన తర్వాత వాటిని విడదీసి, రెండు మెట్రో కారిడార్లుగా రూపొందించడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని తమ క్షేత్ర పర్యటనను మెట్రో ఎండీ కొనసాగించారు. తన బృందంతో కలిసి కంటోన్మెంట్ ప్రాంతంలోని అనేక ప్రత్యామ్నాయ రోడ్లపై పూర్తిగా నడిచి, సాధ్యమైనంత ఉత్తమమైన మెట్రో రైలు అలైన్‌మెంట్ ఏర్పాటుకు పరిశీలనలు జరిపారు.

అన్నివిధాలా అనువుగా ఉండేలా..!

జేబీఎస్-సికింద్రాబాద్ క్లబ్‌రోడ్, స్టాఫ్‌రోడ్(పికెట్ కేవీ స్కూల్ రోడ్), మడ్‌ఫోర్ట్ రోడ్, టివోలి జంక్షన్ రోడ్, డైమండ్ పాయింట్ జంక్షన్, సెంటర్ పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట్ జంక్షన్, బోయినపల్లి (సరోజిని పుల్లారెడ్డి బంగ్లా) రోడ్‌టీ తాడ్‌బండ్-ఆంజనేయ స్వామి ఆలయం రోడ్-తాడ్‌బండ్ జంక్షన్-ఎయిర్ పోర్ట్ ఆఫీస్ జంక్షన్-బోయినపల్లి చెక్ పోస్ట్ రోడ్ మొదలైనవి వీరు కాలినడకన పరిశీలించిన మార్గాల్లో ఉన్నాయి. క్లిష్టమైన మలుపులను, విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించే విధంగా, ప్రయివేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులకు సూచించారు. అలైన్‌మెంట్ వీలైనన్ని ఎక్కువ నివాస కాలనీలకు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు ప్రయోజనకరంగా ఉండాలని, స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ-రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణీకులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆయన ఆదేశించారు.

రెండు మెట్రో కారిడార్లను కలపడమే బెటర్


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్టుగా జేబీఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్‌లను కలపడం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. దీనివల్ల బేగంపేట్ విమానాశ్రయం దిగువన సొరంగం ద్వారా మెట్రో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితిని నివారించి, బోయినపల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని, అక్కడ నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను, వయాడక్టును జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లైఓవర్లకు అంతరాయం కలగకుండా నిర్మించవచ్చన్నారు. దాంతో మేడ్చల్-జేబీఎస్-ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-విమానాశ్రయ లింక్ కూడా ఏర్పడుతుందని, దాదాపు 60 కిలోమీటర్ల సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జేబీఎస్-శామీర్‌పేట్ మెట్రో అలైన్‌మెంట్ విషయానికొస్తే, సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ఉన్న ప్రస్తుత మొదటి మెట్రో పిల్లర్ నుంచి డబుల్ ఎలివేటెడ్ స్ట్రక్చర్‌గా కరీంనగర్ హైవేపై హెచ్ఎండీఏ నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌పై నేరుగా పొడిగించవచ్చని ఆయన వివరించారు.

రాజ్యాంగాన్ని అవమానిస్తారా ?

భగవత్‌పై రాహుల్ మండిపాటు

పాట్నా : అయోధ్యలో రామమందిర ప్రతిష్టతోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం లభించిందంటూ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. భగవత్ వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానిస్తున్నాయని ఆయన విమర్శించారు. బీహార్ రాజధాని పాట్నాలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ ప్రసంగిస్తూ కులగణనపై కాంగ్రెస్ ఇచ్చిన హామీని పునరుద్ఘాటించారు. యాభై శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించి బీసీలు, దళితులు, ఎస్టీలకు అన్ని రంగాలలో సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు.

'గంగానది గంగోత్రిలో పుట్టలేదని మోహన్ భగవత్ చెబుతారు. మన దేశానికి 1947 ఆగస్ట్ 15న స్వాతంత్ర్యం రాలేదని, ఆ తర్వాత వచ్చిందని అంటారు. ఆయన ఇలా చెప్పడం రాజ్యాంగాన్ని కించపరచడమే అవుతుంది' అని రాహుల్ ధ్వజమెత్తారు. 'రాజ్యాంగంలోని భావనలు అవసరం లేదని భగవత్ బాహాటంగానే చెబుతున్నారు. రాజ్యాంగం స్వాతంత్ర్య ఫలం కాదని అంటారు. ఆయన రాజ్యాంగ భావనలను దేశం నుంచి, ప్రజల నుంచి, సంస్థల నుండి దూరం చేస్తున్నారు' అని చెప్పారు. రాజ్యాంగం కేవలం ఓ పుస్తకం కాదని, అది వేలాది సంవత్సరాల దేశ ఆలోచనలను ప్రతిబింబిస్తోందని అన్నారు. అందులో కోట్లాది దళితులు, బీసీలు, గిరిజనులకు జరుగుతున్న అన్యాయానికి సంబంధించిన బాధలు ఉన్నాయని తెలిపారు. ఆ బాధలను అది పూర్తిగా తొలగించలేకపోయినప్పటికీ కొంత తగ్గిస్తుందని చెప్పారు. రాజ్యాంగం గంగ వంటిదని, అది దేశంలోని ప్రతి మూలకూ ప్రవహించాలని కోరుకుంటున్నామని రాహుల్ అన్నారు.



రాహుల్ గాంధీపై మరో ఎఫ్ఐఆర్

కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్‌జిత్ చాటియా అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు అస్సాం రాజధాని గువహటిలోని పాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బిఎన్ఎస్ సెక్షన్ 152, 197 (1)డి ప్రకారం.. దేశ సార్వభౌమత్వం, ఐక్యత , సమగ్రతకు హాని కలిగించే చర్యల కింద నాన్‌బెయిలబుల్ కేసు నమోదైంది.

దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని ఇటీవల రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఈనెల 15న కాంగ్రెస్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన సమయంలో ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేతగా, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి ఉందని, దానికి బదులుగా ఆయన అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారని చాటియా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు.

కుంభమేళాలో అగ్ని ప్రమాదం

- సెక్టార్ 19లో పేలిన రెండు సిలిండర్లు



ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహిస్తున్న కుంభమేళాలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. కుంభమేళాలోని సెక్టార్ 19లో రెండు సిలిండర్లు పేలడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. తాత్కాలిక టెంట్లకు మంటలు అంటుకున్నాయని, మరింత వ్యాపించే అవకాశం ఉందని అన్నారు. ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి వుందని అన్నారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలికి చేరుకున్నాయని, మంటలను అదుపు తెచ్చేందుకు యత్నిస్తున్నాయని అన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు తెలిపారు.

నా కుమారుడికి ఉరిశిక్ష విధించినా అభ్యంతరం లేదు

- సంజయ్ రాయ్ తల్లి



కోల్‌కతా : తన కుమారుడికి ఉరిశిక్ష విధించాలని కోర్టు నిర్ణయిస్తే అభ్యంతరం లేదని నిందితుడు సంజయ్ రాయ్ తల్లి ఆదివారం తెలిపారు. కోల్‌కతా అభయ కేసులో సివిక్ పోలీస్ వాలంటరీ సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారిస్తూ సిల్దా కోర్టు శనివారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. శిక్ష వివరాలను సోమవారం వెల్లడించనుంది. ఈ తీర్పుపై సంజయ్ రాయ్ తల్లి మాలతీరాయ్ (70) స్పందించారు. ముందు మీడియాతో మాట్లాడేందుకు కొద్దిగా సంకోచించారు. ఒక మహిళగా, ముగ్గురు కుమార్తెల తల్లిగా బాధితురాలి తల్లి ఆవేదన, బాధ తనకు తెలుసునని అన్నారు. హత్యాచారానికి గురైన ట్రైనీ వైద్యురాలు కూడా తన కుమార్తెలాంటిదేనని అన్నారు.అతని నేరం రుజువైనందున కోర్టు అతనిని ఉరితీయాలని నిర్ణయించినా ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. తల్లిగా ఒంటరిగా ఏడుస్తానని, కానీ, తలరాతను అంగీకరించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు విచారణ సమయంలో కాని, లాకప్‌లో కాని సంజయ్ రాయ్‌ని కలిశారా అని మీడియా ప్రశ్నించ లేదని, ఎందుకు కలవాలని సమాధానమిచ్చారు.

షరతులు లేకుండా రైతు భరోసా

- గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక
- ఎలాంటి అపోహలకు తావులేదు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఎర్రుపాలెం

వ్యవసాయ యోగ్యమైన రైతుల భూములకు ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి 12 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందించబోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామంలో రూ.1.56 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరి చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, లబ్ధిదారులను గ్రామ సభల్లో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎంపిక చేస్తారని, ఎలాంటి అపోహలు, అనుమానాలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ప్రజా పాలనలో ప్రజలందరి సమక్షంలోనే నిర్ణయాలు తీసుకుంటారని, గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను తయారు చేస్తారన్నారు. లిస్ట్‌లో పేర్లు రానివారికి అక్కడే సమస్య పరిష్కరిస్తారని క్లారిటీ ఇచ్చారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మండలంలో ఉన్న చెరువులు అడవులను రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. మండలంలో టూరిజం అభివృద్ధితో స్థానిక ప్రజల ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రష్యా-ఇరాన్ భద్రతా ఒప్పందం 'చరిత్రాత్మకం'

- మధ్యప్రాచ్య నిపుణుడు ఫర్హాద్ ఇబ్రహిమోవ్

మాస్కో : రష్యా, ఇరాన్ లు "చరిత్రాత్మక ఒప్పంద"తో తమ సహకారాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి తీసుకువెళ్లాయని మాస్కోకు చెందిన వాల్డాయ్ డిస్కషన్ క్లబ్‌లో మధ్యప్రాచ్య నిపుణుడు ఫర్హాద్ ఇబ్రహిమోవ్ అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ శుక్రవారం మాస్కోలో ఒక ప్రధాన ద్వైపాక్షిక భద్రతా ఒప్పందంపై సంతకం చేశారు. రాబోయే 20 సంవత్సరాల పాటు ఈ ద్వైపాక్షిక ఒప్పందంతో ఏర్పడిన వ్యూహాత్మక భాగస్వామ్యం ఆధారంగా రష్యా, ఇరాన్ లు సమగ్ర భద్రత, నావికా, ఆర్థిక, మానవతా సహకారాన్ని పెంచుకుంటాయి.

"ఈ ఒప్పందం నిజంగా చారిత్రాత్మకం. రష్యా ఇరాన్ లు పరస్పర సహకారంలో కొత్త స్థాయికి చేరుకున్నాయి"అని ఇబ్రహిమోవ్ అన్నారు. రెండు బ్రిక్స్ దేశాలు సారూప్య ప్రపంచ దృక్పథాలను కలిగివున్నాయని, ఇవి కీలక వ్యూహాత్మక భాగస్వాములుగా ఉంటాయని ఆయన అన్నారు. మధ్యప్రాచ్యంలో తమ సంబంధాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే రష్యా ఇరాన్‌ను అత్యంత విలువైన భాగస్వామిగా చూస్తుంది. "వాస్తవానికి, ఇరాన్ చాలా కాలంగా రష్యాను దాని అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వాములలో ఒకటిగా భావిస్తోంది. కొన్నిసార్లు మాస్కోను మిత్రదేశంగా కూడా అభివర్ణిస్తోంది" అని ఇబ్రహిమోవ్ పేర్కొన్నారు.



"అంతర్జాతీయ సంబంధాల వ్యవస్థలో కొత్త ప్రపంచ క్రమాన్ని ఏర్పరచడంలో సహాయపడే శక్తిగావుండే సామర్థ్యం ఇరాన్ కు ఉందని రష్యా భావిస్తోంది" అని ఆయన అన్నారు. ప్రపంచంలోఅమెరికాను సవాలు చేయగల దేశాలలో రష్యా ఒకటి అని, టెహ్రాన్ అమెరికాను "మొత్తం ప్రపంచం, ముఖ్యంగా మధ్యప్రాచ్యం భద్రతకు అతిపెద్ద ముప్పు"గా చూస్తుందని ఆయన అన్నారు. దశాబ్దాలుగా పాశ్చాత్య ఆంక్షల కింద నివసిస్తున్నందున, ఒప్పందంలోని ఆర్థిక సహకార నిబంధనలు ఇరాన్‌కు చాలా ముఖ్యమైనవి అని ఇబ్రహిమోవ్ అన్నారు. అయినప్పటికీ, ఒప్పందంలోని భద్రతా అంశాలు ప్రత్యేకంగా ఏ దేశానికి వ్యతిరేకంగా లేవని ఆయన నొక్కి చెప్పారు.

శుక్రవారం క్రెమ్లిన్ వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన ఒప్పందం ప్రకారం, రెండు దేశాలపై దాడి జరిగితే రష్యా ఇరాన్ లు దురాక్రమణదారునికి - సైనికంగా లేదా ఇతరత్రా - ఎలాంటి సహాయం అందించవు. "ఈ కుదిరిన ఒప్పందాలు రష్యా-ఇరాన్ సంబంధాలు మరింత బలోపేతం చేయడానికి దోహద పడతాయి"అని పుతిన్ శుక్రవారం పెజెష్కియన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో అన్నారు.

ముగిసిన సింగపూర్ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

పాటు మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు దావోస్‌కు బయల్దేరి సోమవారం చేరుకున్నారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన నేపథ్యంలో, ఈసారి మరిన్ని ఎక్కువ పెట్టుబడులు తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని సదస్సులో వివరించనున్నారు. సింగపూర్ పర్యటన విజయవంతం కావటంతో సీఎం బృందం దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది.

విజయవంతమైన సింగపూర్ పర్యటన

ఈ నెల 17 నుంచి 19 వరకు సింగపూర్లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం బిజీ బిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చలు జరిపింది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఈ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవటం కీలక పరిణామం. ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ. 3,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ లో భారీ ఐటీ పార్క్ ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.

సింగపూర్ నదిలో సీఎం పడవ ప్రయాణం

సింగపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పడవలో ప్రయాణించారు. ఫెర్రీలో ప్రయాణిస్తూ నది పునరుజ్జీవం, నీటి నిర్వహణపై సింగపూర్ అనుసరించిన విధానాలను పరిశీలించారు. నూతన భవనాలు నిర్మించేటప్పుడు చారిత్రక భవనాలను పరిరక్షించిన తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



ముందే మాట్లాడుకోండి..

పెండ్లి చేసుకోబోయే ఇద్దరికీ ఒకరికొకరు నచ్చడమేకాదు, అన్ని విషయాల్లోనూ ఏకాభిప్రాయం అవసరం. అన్ని అంశాల్లోనూ సాధ్యం కాకపోతే, కొన్ని ప్రధానమైన విషయాల్లోనైనా ఇద్దరూ ఒకేమాట మీద ఉండాలి. అప్పుడే పెండ్లి తర్వాత అభిప్రాయభేదాలు రాకుండా సంతోషంగా ఉంటారు. అయితే ఈ మధ్య విడిపోతున్న జంటల్ని గమనిస్తే ఆర్థికపరమైన ఇబ్బందులే ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి కాబోయే జీవిత భాగస్వామితో కొన్ని ఆర్థికపరమైన విషయాలు ముందే చర్చిస్తే మంచిది. ఆ ఆర్థికపరమైన అంశాలు ఏంటో ఈ రోజు తెలుసుకుందాం.

ముందుగా మీకు కాబోయే జీవిత భాగస్వామితో మీ ఆర్థిక విషయాల గురించి నిజాయితీగా మాట్లాడండి. మీ ఆదాయం, పొదుపు, అప్పులు, ఆర్థిక లక్ష్యాలు, ఖర్చుల గురించి చర్చించండి. ఇలా చేయడం వల్ల కాబోయే దంపతుల ఆర్థిక నేపథ్యం తెలుస్తుంది. అలాగే పరస్పర ఆర్థిక ప్రాధాన్యతలను తెలియజేయడానికి వీలవుతుంది. ఇలా చేయడం వల్ల ఒకరిపై ఒకరికి నమ్మకం పెరుగుతుంది.

ఆర్థిక లక్ష్యాలు


కాబోయే దంపతులు స్వల్ప లేదా దీర్ఘకాలిక లక్ష్యాలపై చర్చించుకోవాలి. ఇల్లు కొనడం, పెట్టుబడులు పెట్టడం లాంటివే కాకుండా, కుటుంబ ప్రణాళికల గురించి కూడా చర్చించుకోవాలి. పిల్లలు పుట్టిన తర్వాత వారి పెంపకం, చదువుల కోసం డబ్బు పొదుపు గురించి మాట్లాడుకోవాలి. వ్యక్తిగత, ఉమ్మడి లక్ష్యాల గురించి చర్చించుకోవడం కూడా మంచిది.

పెండ్లి, హనీమూన్ ఖర్చులు

పెండ్లి ఖర్చులు, హనీమూన్ కోసం కొంత బడ్జెట్‌ను పక్కకు తీయాలి. పెండ్లికి పెట్టబోయే ఖర్చుపై కాబోయే దంపతులిద్దరూ ముందుగా చర్చించుకోవాలి. తదనుగుణంగా మీ ఆర్థిక ప్రణాళికలను ప్లాన్ చేయండి. అయితే వీలైనంత వరకు తక్కువ ఖర్చుతో పెండ్లి చేసుకోవడం మంచిది. ఈ ఖర్చుల కోసం అప్పులు చేయకుండా ఉండడం మరీ మంచిది.

ఖర్చులలోనూ భాగస్వామ్యం

కాబోయే దంపతులిద్దరూ ఉద్యోగులైతే ఇంటి అద్దె, కిరాణా సామాగ్రి, ఇతర ఖర్చులను ఇద్దరు షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. కొంతమంది ఖర్చులను సమానంగా విభజించుకుంటారు. మరికొందరు వ్యక్తిగత ఆదాయం ఆధారంగా ఖర్చు చేస్తుంటారు. ఈ విషయాలపై కాబోయే జంట ముందే మాట్లాడుకుంటే వారి భవిష్యత్‌కు మంచిది.



అత్యవసర నిధి

వైద్యం, ఉద్యోగం పోయినప్పుడు ఈ అత్యవసర నిధి ఉపయోగపడుతుంది. అలాగే మీకు ఆర్థిక భద్రతను అందిస్తుంది. దీని కోసం మూడు నుండి ఆరు నెలలకు సరిపడా డబ్బులను ఆదా చేయడం మంచిది. ఇలా భాగస్వామ్య అత్యవసర నిధిని ప్రారంభించడం వల్ల మీరు కష్ట సమయాల్లో లోన్‌లు, అప్పులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఇలాంటి విషయాలపై కూడా కాబోయే జంట చర్చించుకోవాలి.

ఆడంబరాలు వద్దు

మీ దగ్గర డబ్బులు లేనప్పుడు పెండ్లి విషయంలో ఆడంబరాలను పోవద్దు. వీలైనంత వరకు తక్కువ ఖర్చుతోనే మ్యారేజ్ చేసుకోండి. ఒకవేళ అప్పు తీసుకుని పెండ్లి చేసుకునేటప్పుడు అది మీ స్తోమతకు మించిపోకుండా చూసుకోండి. ఆర్థిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఎడ్యుకేషన్ లోన్స్, క్రెడిట్ కార్డు, పర్సనల్ లోన్స్ వంటి అప్పులను తీర్చేయండి. ముందుగా అధిక వడ్డీ రేటు ఉన్న అప్పులను కట్టేయండి. దీని వల్ల మీకు కొంత భారం తగ్గుతుంది.

ఆరోగ్య బీమా పాలసీ

ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పాలసీ చాలా అవసరం. అత్యవసర సమయాల్లో ఇది బాగా ఉపయోగపడుతుంది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ గురించి కూడా కాబోయే దంపతులు చర్చించుకోవాలి.

ఉమ్మడిగా పెట్టుబడులు

దంపతులిద్దరూ కలిసి పెట్టుబడులు పెట్టడం వల్ల బలమైన ఆర్థిక భవిష్యత్తు ఉంటుంది. పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, స్టాక్స్‌లలో పెట్టుబడులు పెట్టడంపై కలిసి చర్చించుకోండి. జాయింట్ ఇన్వెస్ట్‌మెంట్ ఖాతాను ఓపెన్ చేయండి. అలాగే ఏవైనా ఆస్తులను కూడా కొనుగోలు చేయవచ్చు.

పొదుపుపై చర్చలు

ఖర్చు, పొదుపుపై ఎక్కువగా చర్చించుకోండి. మీ దీర్ఘకాల, వ్యక్తిగత లక్ష్యాల కోసం నెలవారీగా ఎంత పొదుపు చేయాలనుకుంటున్నారో చర్చించుకోండి. దీని ప్రకారం మీ భవిష్యత్తును ప్రారంభించుకోండి.

వీలునామా

ఎస్టేట్ ప్లానింగ్ అనేది కూడా ముఖ్యమే. కానీ దీన్ని చాలా మంది పట్టించుకోరు. పెండ్లయిన తర్వాత వీలునామాను రాయడం వల్ల ఒకవేళ ఏదైనా జరగరానిది జరిగితే మీ ఆస్తులు మీరు అనుకున్నవారికి సురక్షితంగా దక్కుతాయి. ఈ విషయంపై కూడా ముందే చర్చించుకోవడం మంచిది.

గుండె ఆరోగ్యానికి...

గుండె ఆరోగ్యంగా ఉండాలంటే వారానికి కనీసం 150 నిమిషాలు మితమైన వ్యాయామం చేయాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. అయితే.. గుండె బలోపేతానికి నిపుణులు చెబుతున్న ఉత్తమ వ్యాయామాలు ఏమిటో చూద్దాం....

రోజూ నడవాలి

నడక చాలా సులభమైన వ్యాయామం. ముఖ్యంగా స్పీడ్ వాక్ గుండె బలోపేతానికి ఒక మార్గం. ఇది హృదయ స్పందన రేటును పెంచుతుంది, ఇతర వ్యాయామాల కంటే సులభంగా ఉంటుంది. ఏ సమయంలోనైనా.. ఎక్కడికైనా నడవవచ్చు. ఇందుకు కావలసిందల్లా మంచి సౌకర్యవంతమైన బూట్లు. రోజుకు కనీసం 60 నిమిషాలు నడవాలి.

బరువు శిక్షణ

బరువు శిక్షణ కండరాల బలాన్ని పెంపొందించడానికి, కొవ్వును కరిగించేందుకు ఎంతో సహాయపడుతుంది. బరువును అదుపులో ఉంచుకునేందుకు జిమ్‌కి వెళ్లవచ్చు. అలాగే ఇంట్లోనే వ్యాయామాలూ చేయవచ్చు. పుష్-అప్‌లు, స్క్వాట్‌లు, పుల్-అప్‌లు కండరాలను బలోపేతం చేయడానికి, ఎముక, గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

స్విమ్మింగ్

స్విమ్మింగ్ అనేది కేవలం రిఫ్రెష్ వ్యాయామం మాత్రమే కాదు. స్విమ్మింగ్... పూర్తి శరీర వ్యాయామం. ఇది మన శరీరాన్ని మాత్రమే కాకుండా గుండెను కూడా బలోపేతం చేస్తుంది. ఇతర వ్యాయామాల మాదిరిగా కాకుండా స్విమ్మింగ్ మన శరీరం మొత్తాన్ని బలోపేతం చేస్తుంది.

యోగాతో

యోగా... గుండె ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. యోగా చేయడం వల్ల మీ కండరాలు బలపడతాయి. వాటిని సరైన అమరికలోకి తీసుకురావచ్చు. కొన్ని రకాల యోగా మీ హృదయ స్పందన రేటును పెంచుతుంది. అదే సమయంలో మీ రక్తపోటును తగ్గిస్తుంది.

సైక్లింగ్ చేయాలి

సైక్లింగ్‌తో మనం ఊహించిన దానికంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది మీ హృదయ స్పందన రేటును పెంచడంలో సహాయపడుతుంది. సైక్లింగ్ మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

స్కిప్పింగ్ తప్పనిసరి

స్కిప్పింగ్ కూడా చాలా మంచి వ్యాయామం. ఇది మీ హృదయ స్పందన నిమిషానికి 150-180 బీట్స్‌లో ఉంచుతుంది. ఇది రక్తం ఒత్తిడితో ప్రవహించేలా చేస్తుంది. శరీరాన్ని పూర్తిగా శుభ్రపరుస్తుంది. శరీరం అంతటా ఆక్సిజన్, పోషకాల బదిలీ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఈ వ్యాయామం ఎప్పుడైనా చేయవచ్చు. రోజుకు 15 నిమిషాలు సరిపోతుంది.

ట్రంప్ ప్రమాణస్వీకార వేళ హోరెత్తిన నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

'స్టాండప్... ఫైట్ బ్యాక్', 'ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బి సైలెంట్' అంటూ వారంతా నినాదాలు చేశారు. 'సఖి ఫర్ సౌత్ ఆసియా సర్వైవర్స్' సహా పలు స్వచ్ఛంద సంస్థలు పీపుల్స్ మార్చ్ పేరిట నిరసన చేపట్టాయి. పీపుల్స్ మార్చ్‌ని గతంలో ఉమెన్స్ మార్చ్ అని పిలిచే వారు. 2017 నుంచి ప్రతి సంవత్సరం ఇది జరుగుతోంది. ట్రంప్ వ్యతిరేక పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శించిన నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టెస్లా యజమాని ఎలన్ మస్క్ సహా ట్రంప్ సన్నిహిత మద్దతుదారులను కూడా వారు వదిలిపెట్టలేదు. 2017 జనవరిలో ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు సైతం వీరు ఇదే రకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

నగరంలోని మూడు వేర్వేరు పార్కుల నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు లింకన్ మెమోరియల్ సమీపాన కలిసిపోయాయి. 'ఫాసిజానికి తలవంచబోమని సమాజానికి చాటిచెప్పేందుకే భారీ ప్రదర్శన చేపట్టాం' అని పీపుల్స్ మార్చ్ తెలిపింది. ప్రమాణస్వీకారానికి ముందు అనేక కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ట్రంప్ ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నారు. అదే సమయంలో నిరసన ప్రదర్శనలు జరగడం గమనార్హం. అబార్షన్ యక్షన్ నౌ, టైమ్ టు యాక్ట్, సిస్టర్‌సాంగ్, ఉమెన్స్ మార్చ్, పాప్యులర్ డెమొక్రసీ ఇన్ యాక్షన్, హ్యారియట్స్ వైల్డెస్ట్ డ్రీమ్స్, ది ఫెమినిస్ట్ ఫ్రంట్ నౌ, ప్లాన్డ్ పేరెంట్‌హుడ్, ది నేషనల్ ఉమెన్స్ లా సెంటర్ యాక్షన్ ఫండ్, సియర్రా క్లబ్, ఫ్రంట్‌లైన్ వంటి స్వచ్ఛంద సంస్థలు ఈ ప్రదర్శనలో భాగస్వాములయ్యాయి. న్యూయార్క్, సియాటెల్, చికాగో వంటి ఇతర నగరాలలో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. తాము మహిళలు, సమానత్వం, ఇమ్మిగ్రేషన్‌కు మద్దతుగా వచ్చామని బ్రిట్టానీ మార్టినెస్ అనే యువతి చెప్పారు. ట్రంప్ విధానాలు, విలువలపై నిరసనకారులు మండిపడ్డారు.

మరోసారి రైతు ఉద్యమానికి తలవంచిన మోడీ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)



మంత్రిత్వ శాఖకు చెందిన అధికారుల ప్రతినిధి బృందం దల్లేవాల్‌తో సమావేశమైంది. సంయుక్త కిసాన్ మోర్చ, కిసాన్ మజ్దూర్ మోర్చకు చెందిన ప్రతినిధులతో కూడా అధికారులు సమావేశమయ్యారు. వైద్య సాయం పొందితే ఆరోగ్యం కుదుటపడుతుందని, అప్పుడు ప్రతిపాదిత సమావేశంలో పాల్గొనవచ్చునని దల్లేవాల్‌కు అధికారులు నచ్చచెప్పారు. అందుకు దల్లేవాల్ అంగీకరించారు. దల్లేవాల్‌కు సెలైన్ ఎక్కించి వైద్య సాయం అందిస్తున్న చిత్రాలను రైతులు విడుదల చేశారు.

ప్రతిపాదిత సమావేశం చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫిబ్రవరి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుంది. రైతులు నిరసన తెలుపుతున్న కన్నౌరిలో వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ విలేకరులతో మాట్లాడుతూ క్షీణిస్తున్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపిందని చెప్పారు. చర్చలకు ఆహ్వానిస్తూ దల్లేవాల్, రైతు సంఘాలకు ఆయన లేఖలు కూడా రాశారు. ప్రతిపాదిత సమావేశంలో రైతులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు. పంట ఉత్పత్తుల కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లపై గత 11 నెలలుగా రైతు సంఘాల ఆధ్వర్యంలో అన్నదాతలు శంభు, కన్నౌరి సరిహద్దు పాయింట్ల వద్ద ఆందోళన సాగిస్తున్న విషయం తెలిసిందే.

'సాగే'దెట్లా?

(మొదటిపేజీ తరువాయి)

రైతులు, ప్రజలను సమీకరించి సమరశీల పోరాటం సాగించాయి. విజయం సాధించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయాన్ని సాధించింది. వరి ధాన్యం కొనేందుకు ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా సర్కారుపై వత్తిడి తెచ్చి తెలంగాణ రైతు సంఘం విజయం సాధించాయి. రైతు ఆత్మహత్యలకు నష్టపరిహారం, రైతు బీమా వంటి పథకాలను సాధించింది. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా న్యాయ పోరాటం చేసింది.

కాంగ్రెస్ హామీల్లో 'కౌలు రైతు' కీలకమైంది

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కౌలు రైతును గుర్తించబోమంటూ తేల్చి చెప్పింది. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతును గుర్తిస్తామంటూ చెప్పింది. దీంతోపాటు రైతు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 60శాతం పూర్తి చేసింది. రైతు భరోసా ఎకరాకు ఐదు వేల ఉన్న దాన్ని రూ. 7500కు పెంచుతామంటూ ప్రకటించింది. రూ.6వేలకు మాత్రమే పెంచింది. వానాకాలానికైతే ఇవ్వనేలేదు. యాసంగికి ఇస్తామని ప్రకటించింది. కౌలు రైతుల విషయంలో నాన్చుడు దోరణి ప్రదర్శిస్తున్నది. సాగులో కౌలు రైతులు (25 లక్షల మంది) 35 శాతం ఉన్నారు. వారి పక్షాన తెలంగాణ రైతు సంఘం నికరంగా పోరాడుతున్నది. వారికి రుణార్హత కార్డులు ఇవ్వడం వల్ల బ్యాంకు రుణాలు, పెట్టుబడి సాయం, తమ పంటను అమ్ముకునే అవకాశం వంటి సౌకర్యాలు లభిస్తాయి.అందుకే కౌలు రైతుల గుర్తింపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిపెంచబోతున్నది.

తెగిన గాలిపటంలా సాగు ప్రణాళిక

సాగు ఎటువైపు పోతుందో సర్కారుకు స్పష్టత లేదు. వ్యవసాయ ప్రణాళిక రూపొందించకపోవడంతో ఆహార సమతుల్యత ఏర్పడుతున్నది. పండ్లు, కూరగాయలను 60శాతం దిగుమతి చేసుకుంటున్నాం. 'ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేయాలి. మన అవసరమెంత? రైతులకు ఏ విధంగా అవగాహన కల్పించాలి' అనే విషయాల్లో సర్కారుకు స్పష్టత లేదు. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులకు మద్దతు ధర లేదు. దానికి అనుబంధంగా కొన్ని పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరమున్నది. కల్తీ, నకిలీ విత్తనాలతో రైతు మోస పోతున్నారు. ఎరువు, పురుగు మందులు ఎలా వాడాలో షాపు యాజమానులే చెబుతున్నారు.

శిక్షణ పొందిన అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో కూడా ప్రాధాన్యతా క్రమంలో నిర్మించాల్సి ఉన్నది. నారాయణ పేట- కోడంగల్ ఎత్తిపోతల పథకం తరహాలో వెనకబడిన ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తున్నదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ట్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రూ. 20 నుంచి రూ.25 లక్షల ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నది. అక్కడ మార్కెట్ ధర కోటి రూపాయలు పలుకుతున్నది. ఈ సమస్యలన్నింటిపై రైతు సంఘం పోరాట కార్యాచరణ రూపొందిస్తున్నది.

సమగ్ర భూ సర్వేతోనే సమస్యలు పరిష్కారం

దశాబ్దాల క్రితం భూమికి హద్దులు నిర్ణయించారు. కాలక్రమేణా హద్దుల్లో ఎన్నో మార్పులు జరిగాయి. సమగ్ర భూ సర్వేతోనే పలు సమస్యలు పరిష్కారమవుతాయని తెలంగాణ రైతు సంఘం భావిస్తున్నది.

రికార్డులకు, భూ సరిహద్దులకు తేడాలు రావడంతో రైతు సమస్యలు పెరిగాయి. బీఆర్ఎస్ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్ నుంచి కాస్తుకాలమ్ తొలగించడంతో సమస్య మరింత జటిలమైంది. రైతులు సాగు హక్కును కోల్పోయారు. రైతుల్లో అసంతృప్తి పెరిగింది. ఆత్మహత్యలు జరిగాయి. అధికారులపై దాడులు జరిగాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ధరణి పోర్టల్ రద్దు చేస్తామని ప్రకటించింది. అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి తెచ్చింది. కాస్తు కాలమ్‌ను పొందుపరించింది.

మద్దతు ధర సాధనకు ఐక్య ఉద్యమాలు

- టి. సాగర్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రైతు సంఘం

(మొదటిపేజీ తరువాయి)

కోసం భూమి సేకరిస్తున్నది. కానీ పరిహారం విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నది. వీటన్నింటిపై భవిష్యత్తులో రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తాం.



హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్క్

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి అజిత్‌రెడ్డి, క్యాపిటల్ ల్యాండ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న పతంజలి ప్రకటనలు

తిరువనంతపురం : ఆరోగ్య రక్షణ ఉత్పత్తులపై పతంజలి ఆయుర్వేద్ తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తోందంటూ దాఖలైన ఫిర్యాదును పురస్కరించుకొని కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు బాబా రాందేవ్, ఆయన సన్నిహితుడు ఆచార్య బాలకృష్ణలపై బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. పతంజలి ఆయుర్వేద్ ఉత్పత్తులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తున్నారంటూ కేరళకు చెందిన ఓ వైద్యుడు మూడు సంవత్సరాల క్రితమే కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేరళలో పది, ఉత్తరాఖండ్‌లో ఒక కేసు నమోదైంది. కన్నూర్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ కేపీ బాబు దాఖలు చేసిన పలు ఫిర్యాదులను పురస్కరించుకొని కేరళ ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్రంలోని తన కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. 1954వ సంవత్సరపు డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కొన్ని పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు బీపీ, సుగర్ వ్యాధులను నయం చేస్తాయని, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తాయని వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. అయితే ఇలాంటి ప్రకటనలు జారీ చేయడాన్ని డీఎంఆర్ చట్టం నిషేధిస్తోంది. కొన్ని ప్రత్యేక అనారోగ్యాలను నయం చేస్తామంటూ వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం ఈ చట్ట ప్రకారం నేరం. హరిద్వార్ కోర్టు 2024 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రాందేవ్‌కు ఆరుసార్లు సమన్లు జారీ చేసిందని, అయితే ఈ విచారణల నుండి ఎలాంటి ఫలితం రాలేదని ఫిర్యాదుదారు బాబు చెప్పారు.

రుణమాఫీ కాలే.. రైతుభరోసా రాలే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రంలో 402 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులకు శాపంగా మారాయని పేర్కొన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందనీ, వరుసగా జరుగుతున్న ఆత్మహత్యలే అందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 24 గంటలు గడవకముందే రుణభారంతో ఆదిలాబాద్‌లో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని అన్నారు. "కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంక్షోభంలోకి నెట్టారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగి పోతున్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పుల పాలవుతున్నారు. వడ్డీలు, అసలు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలేననీ, వాటికి సీఎం రేవంతే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు రూ. 500 బోనస్ అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదనీ, రైతు భరోసా రాలేదని ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల జారీలో కోతలు పెట్టబోమని ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. అయితే అది ప్రకటనలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్కార్ రేషన్ కార్డుల విషయంలో తప్పిదాలకు పాల్పడితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మూడు గంటలు ఆలస్యంగా అమల్లోకి కాల్పుల విరమణ..



జెరూసలెం : ముగ్గురు బందీలను విడుదల చేయనున్నట్టు హమాస్ పేర్లు ప్రకటించడంతో కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ ప్రకారం మూడు గంటలు ఆలస్యంగా ఒప్పందం ప్రారంభమైంది. స్థానిక కాలమానం ప్రకారం .. ఉదయం 11.45 గంటలకు గాజాలో హమాస్‌తో సంధి ప్రారంభమైనట్టు ఇజ్రాయిల్ ఓ ప్రకటనలో తెలిపింది. 15 నెలలుగా గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష మారణకాండను ఈ ఒప్పందం నిలువరించనుంది.

ఇజ్రాయిల్ కాల్పుల్లో 13 మంది మృతి

ఒప్పందం ఖరారైన చివరి నిమిషం వరకు ఇజ్రాయిల్ సైన్యం గాజాపై దాడులు చేస్తూనే ఉందని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. స్థానిక కాలమానం ప్రకారం .. ఉదయం 8.30 గంటల నుంచి ఇజ్రాయిల్ వైమానిక, ఫిరంగి దాడులు జరిపిందని, 13 మంది పాలస్తీనియన్లు మరణించారని పాలస్తీనా వైద్యులు తెలిపారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఆదేశాల మేరకే గాజా ప్రాంతంలో దాడి కొనసాగిస్తున్నట్టు సైన్యం పేర్కొంది. ఒప్పందం ప్రారంభం కావడానికి గంట ముందు విడుదల చేసిన ఓ ప్రకటనలో .. హమాస్ విడుదల చేయవలసిన బందీల జాబితాను ఇజ్రాయిల్ స్వీకరించే వరకు కాల్పుల విరమణ ఉండదని తాను సైన్యానికి సూచించినట్టు ప్రధాని కార్యాలయం తెలిపింది.



నైజీరియాలో పేలిన పెట్రోల్ ట్యాంకర్

అబూజ : ఉత్తర మధ్య నైజీరియాలో ఓ పెట్రోల్ ట్యాంకర్ పేలి దాదాపు 70మంది మరణించినట్టు అధికారులు శనివారం ధ్రువీకరించారు. నైజర్ రాష్ట్రంలోని సులేజా ప్రాంతంలో కొంతమంది జనరేటర్ ఉపయోగించి ఓ ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్‌లోకి పెట్రోల్ పంపు చేస్తున్న క్రమంలో ఈ పేలుడు జరిగింది. పెట్రోల్‌ను పంపు చేస్తున్న సిబ్బందితో పాటు చుట్టుపక్కల పదుల మీటర్ల దూరంలో ఉన్నవారు కూడా మరణించినట్టు నైజీరియా అత్యవసర ప్రతిస్పందన ఏజెన్సీ వెల్లడించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది.

ఆఫ్రికా ఖండంలోనే అత్యంత జనాభా కలిగిన నైజీరియాలో సరుకు రవాణాకు సమర్థవంతమైన రైల్వే వ్యవస్థ లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. గతేడాది సెప్టెంబర్‌లో నైజర్ రాష్ట్రంలో పెట్రోల్ ట్యాంకర్, ట్రక్కు ఢీకొనడం వల్ల దాదాపు 48మంది మృతిచెందారు. నైజీరియా ఫెడరల్ రోడ్ సేఫ్టీ లెక్కల ప్రకారం, 2020లో 1531 పెట్రోల్ ట్యాంకర్ ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో 535 మంది మరణించారు, 1142 మంది గాయపడ్డారు.


మేర్లపాక గాంధీ, వరుణ్ తేజ్

క్రేజీ కాంబినేషన్‌లో..

వరుణ్‌తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. ఈ భిన్న కలయికలో తెరకెక్కబోయే ప్రాజెక్ట్‌ను యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా వరుణ్ తేజ్ నటించబోయే తన 15వ చిత్రానికి సంబంధించి మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ అందరిలోనూ క్యూరియాసిటీని రైజ్ చేసింది.

పోస్టర్ ఒక ప్రత్యేకమైన కొరియన్ కనెక్షన్‌ను చూపిస్తుంది, దీనిలో ఫైర్ డ్రాగన్ లోగోతో కూడిన జాడి, మంటలతో చుట్టుముట్టబడి ఉంది. పోస్టర్ కొరియన్ టెక్స్‌తో సీక్రెట్‌ని మరింత పెంచుతుంది. 'మెన్ హంటింగ్ టర్స్ఫ్ హిలేరిస్' అనే ట్యాగ్ ప్రత్యేకంగా నిలుస్తుంది - ప్రేక్షకుల కోసం ఎంటర్టైనింగ్ అడ్వంచరస్ జర్నీని సూచిస్తుంది.

దర్శకుడు మేర్లపాక గాంధీ థ్రిల్స్, హ్యూమర్ బ్లెండ్ చేస్తూ అద్భుతమైన స్క్రిప్ట్‌ను రాశారు.

ఈ ఇండో-కొరియన్ హర్రర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నాడని పోస్టర్, ట్యాగ్‌లైన్ చెప్పకనే చెబుతోంది.

'తొలి ప్రేమ' వంటి భారీ విజయం తర్వాత, ఆయన మరోసారి సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్ చేస్తున్నారు. మార్చిలో ప్రొడక్షన్ ప్రారంభం కానుంది.

మిగిలిన నటీనటులు, సాంకేతిక సిబ్బందికి సంబంధించిన వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు.

అదృష్టంగా భావిస్తున్నా..


నరేష్ విజయ్‌కృష్ణ

'నా కెరీర్‌లో బీజీయస్ట్ ఇయర్ 2025. విభిన్న పాత్రలతో ఇటు థియేటర్‌లో అటు ఓటీటీలో ప్రేక్షకులను అలరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని నరేష్ విజయ్‌కృష్ణ అన్నారు.

నేడు (సోమవారం) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'గత పదేళ్ళుగా యాక్టర్‌గా మళ్ళీ మెట్టు మెట్టు ఎదుగుతూ వస్తున్నాను. సినీ పరిశ్రమలో సక్సెస్ ఫుల్‌గా 52 ఏండ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బిగ్ సక్సెస్‌తో స్టార్ట్ అయ్యాను. ప్రస్తుతం 9 సినిమాలు ఏకకాలంలో షూటింగ్‌లో ఉన్నాయి. ఇందులో రెండు లీడ్ రోల్స్ చేస్తున్నాను. నా పుట్టినరోజు సందర్భంగా రెండు పెద్ద కార్యక్రమాలు చేయబోతున్నాను. వాటిల్లో సినిమా మ్యూజియం, లైబ్రెరి అండ్ క్రియేటివ్ స్పెస్ ఫర్ యంగ్ పీపుల్. దీనిని ఘట్టమనేని ఇందిరా దేవి పేరుతో ప్రారంభించాం. అలాగే జంధ్యాల నా గురువు. ఆయన్ని చరిత్రలో ఒక భాగంగా ఉంచాలని జంధ్యాల పేరుతో డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ థియేటర్‌ని ఆరంభించాం. దీంతోపాటు జంధ్యాలపై ఓ అద్భుతమైన పుస్తకం తయారు చేశాం. దీనికి సీనియర్ రైటర్ సాయినాథ్ సహకరించారు. ఈ పుస్తకాన్ని అమ్మ విజయనిర్మల పుట్టిన రోజు ఫిబ్రవరి 20న రవీంద్రభారతిలో ఘనంగా లాంచ్ చేస్తున్నాం. అలాగే ఈ ఏడాది ప్రతిష్టాత్మక విజయ కృష్ణ అవార్డ్‌ని అభిమానుల సమక్షంలో జయసుధకి ఇవ్వబోతున్నాం. జంధ్యాల వజ్రోత్సవ ఉత్సవాల సందర్భంగా యోగిబేర్ కలెక్టీవ్స్ వారి థియేటర్‌లో జంధ్యాల రాసిన రెండు నాటకాలతోపాటు ఆయన దర్శకత్వం వహించిన మూడు సినిమాలను, అలాగే విజయనిర్మల డైరెక్షన్ చేసిన మూడు సినిమాలను ప్రదర్శించనున్నారు' అని తెలిపారు.

'అగ్గిపుల్లే అలా గీసినట్టు'..


రుక్సర్ థిల్లాన్, కిరణ్ అబ్బవరం

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్.

ఈ చిత్రాన్ని శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ నిర్మాణ సంస్థ ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'అగ్గిపుల్లే..'ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'అగ్గిపుల్లే అలా గీసినట్టు, కోపంగా చూడకే కొట్టినట్టు, గాలి దుమారమే రేగినట్టు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు...' అంటూ బ్యూటిఫుల్ మెలొడీతో సాగుతుంది పాట. కిరణ్ అబ్బవరం, సామ్ సీఎస్ కాంబినేషన్‌లో వచ్చిన 'క' మూవీ సాంగ్స్ ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ఆడియో మీద అందరిలోనూ హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. అలాగే 'క' వంటి బ్లాక్‌బస్టర్ తరువాత కిరణ్ అబ్బవరం నటిస్తున్న సినిమా కావడంతో కథపరంగా కూడా అంచనాలు తారా స్థాయిలో ఉన్నాయి. అందరి అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందనే దీమాని మేకర్స్ వ్యక్తం చేస్తున్నారు. ఓ వైవిధ్యమైన ప్రేమకథగా దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. అలాగే దీన్ని ప్రేమికుల రోజు కానుకగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ - సుధీర్, ఎడిటర్ - ప్రవీణ్.కేఎల్, సినిమాటోగ్రఫీ - డానియేల్ విశ్వాస్, మ్యూజిక్ - సామ్ సీఎస్, నిర్మాతలు : రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ, రచన, దర్శకత్వం - విశ్వ కరుణ్.

భారత్ చరిత్ర సృష్టించింది. ప్రథమ ఖోఖో ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా చాంపియన్‌గా అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా 39 జట్లు పోటీపడిన ఉత్కంఠభరిత ప్రపంచకప్‌లో భారత మహిళల, పురుషుల జట్లు విజేతలుగా నిలిచాయి. అమ్మాయిలు నేపాల్‌ను చిత్తు చేయగా.. అబ్బాయిలు సైతం నేపాల్‌పై ఘన విజయం సాధించారు.

అమ్మాయిలు, అబ్బాయిలు ఖోఖో చాంపియన్స్

- అరంగేట్ర ప్రపంచకప్ టైటిల్స్ మన సొంతం
- ఖోఖో ప్రపంచకప్ 2025

నవతెలంగాణ-న్యూఢిల్లీ



ఖోఖో ప్రపంచకప్‌లో భారత్ అద్భుతం చేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ప్రపంచకప్‌లో ఇటు అమ్మాయిలు, అటు అబ్బాయిలు విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో భారత మహిళల జట్టు 78-40తో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. భారత పురుషుల జట్టు 54-36తో నేపాల్‌ను చిత్తు చేసింది. మెన్స్ ఫైనల్లో సూయాశ్ (భారత్) ఉత్తమ ఎటాకర్‌గా, మెహుల్ (భారత్) ఉత్తమ ఆటగాడి అవార్డులు అందుకున్నారు. మహిళల ఫైనల్లో అన్ను కుమారి (భారత్), చైత్ర బి (భారత్)లు ఉత్తమ ఎటాకర్, ఉత్తమ ప్లేయర్ అవార్డులు దక్కించుకున్నారు. ఖోఖో ప్రపంచకప్ విజేతలుగా నిలిచిన భారత జట్లకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు వెల్లువెత్తాయి.

ఏకపక్షంగా కొట్టేశారు :

న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన మహిళల ఫైనల్లో నేపాల్‌ను భారత్ చిత్తు చేసింది. నాలుగు క్వార్టర్ల ఆటలో తిరుగులేని ప్రదర్శన చేసింది. 78-40తో భారీ విజయం అందుకుంది. ఆరంభం నుంచి నేపాల్‌పై ఎదురుదాడి చేసిన అమ్మాయిలు.. నేపాల్ అమ్మాయిల బ్యాచ్‌ను మూడు సార్లు సింపుల్ టచ్‌తో అవుట్ చేసింది. కెప్టెన్ ప్రియాంక తొలి టర్న్‌లో అద్భుతంగా రన్ చేసింది. ఆఖరు వరకు ఆధిక్యం నిలుపుకోవటంతో పాటు ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ కొట్టిన భారత్ 38 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

పురుషుల విభాగం ఫైనల్లోనూ అదే ప్రదర్శన పునరావృతం అయ్యింది. అమ్మాయిల స్థాయిలో ఆధిపత్యం చెలాయించకపోయినా.. అద్భుత విజయమే అందుకున్నారు. నాలుగు టర్న్‌ల్లోనూ దుమ్మురేపిన టీమ్ ఇండియా సమర్థవంతంగా నేపాల్‌ను నిలువరించింది. 54-36తో సూపర్ విక్టరీ సాధించింది. మెహుల్, సుయాశ్‌లు అద్భుతంగా రాణించారు. ఖోఖో తొలి ప్రపంచకప్ లో మహిళల, పురుషుల విభాగాల్లో భారత్ చాంపియన్‌గా నిలువగా... రెండు విభాగాల్లోనూ నేపాల్ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

27 నుంచి తెలంగాణ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్

పోస్టర్ ఆవిష్కరించిన ఎన్నారై డాక్టర్ సతీశ్ కత్తుల



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల అండర్-17 టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 27 నుంచి ఆరంభం కానుంది. హైదర్‌గూడలోని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నారై వైద్యులు నాథ రమణ మూర్తి గోకుల, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పోస్టర్‌ను ప్రముఖ అంకాలజిస్ట్, భారత సంతతి అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు సతీశ్ కత్తుల ఆవిష్కరించారు. 'తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చెందాలి. ఈ టోర్నమెంట్ నిర్వహణతో ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రానుండటం అభినందనీయం' అని సతీశ్ కత్తుల అన్నారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..' ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి 9 జిల్లాలు సహా టీడీసీఏ ఎలెవన్ జట్లు పోటీపడుతున్నాయి. టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రికెటర్ల నుంచి మూడు జట్లను తయారు చేస్తాం. మార్చి మూడో వారంలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టు ఇక్కడికి రానుంది. తెలంగాణ ఉమ్మడి జిల్లాల జట్లు, అమెరికా క్రికెట్ అకాడమీ జట్టుతో పోటీపడనున్నాయి. అంతర్జాతీయ స్థాయి పోటీతత్వం అనుభవం తెలంగాణ గ్రామీణ క్రికెటర్లకు దక్కనుంది' అని అన్నారు. తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల కన్వీనర్లు మహ్మద్ మతీఫ్, సురేందర్ రెడ్డి సహా కుమారస్వామి, బసివి రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

భారత జట్టు మేనేజర్‌గా దేవరాజ్!

చాంపియన్స్ ట్రోఫీలో కీలక బాధ్యతలు



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యదర్శి ఆర్. దేవరాజ్‌కు బీసీసీఐ కీలక బాధ్యతలు అప్పగించింది. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే భారత జట్టుకు టీమ్ మేనేజర్‌గా దేవరాజ్ వ్యవహరించనున్నాడు. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం కానుంది. పాకిస్థాన్ పర్యటనకు భారత ప్రభుత్వం అనుమతి నిరాకరించటంతో టీమ్ ఇండియా మ్యాచులను దుబాయ్‌లో షెడ్యూల్ చేశారు. 1983 ప్రపంచకప్ సాధించిన భారత జట్టుకు హైదరాబాద్‌కు చెందిన మాన్‌సింగ్ టీమ్ మేనేజర్‌గా వ్యవహరించగా.. సుదీర్ఘ విరామం అనంతరం మరోసారి హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్‌కు ఈ బాధ్యతలు దక్కటం పట్ల హైదరాబాద్ క్రికెట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

త్వరలో మెట్రో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్

- 2వేల గజాల్లో 80-90కోట్లతో పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మాణం
- సుమారు 250 కార్లు, 200 టూవీలర్ పార్కింగ్‌కు అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఈ వారంలో ట్రయల్ రన్ నిర్వహించేలా అధికారుల ప్రయత్నాలు

ఏడేండ్ల తర్వాత నాంపల్లిలో 'ఎంఎల్‌పీ' అందుబాటులోకి..



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలో ఎక్కడాలేని విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌లోని నాంపల్లిలో అందుబాటులోకి తీసుకురానున్న ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్(ఎంఎల్‌పీ) పనులు దాదాపు పూర్తి కావొచ్చి ఎట్టకేలకు నగర ప్రజలకు అందుబాటులోకి వచ్చేస్తోంది. హైదరాబాద్ నాంపల్లిలో సుమారు అర ఎకరం స్థలంలో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో రూ.80కోట్లకుపైనే ఖర్చు చేసి ఈ 15 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. చిన్న చిన్న ప్యాచ్ పనులు రెండ్రోజుల్లో పూర్తి చేసి.. ఈ వారంలోనే ట్రయల్ రన్ నిర్వహించేలా మెట్రో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఈ పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తే.. నగరంలో వాహన పార్కింగ్ సౌక్యరాల్లేక.. ఇబ్బంది పడుతున్న నగరవాసులకు కొంతమేర ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. ముఖ్యంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు, గాంధీభవన్, ఆ పరిసరా ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారికి సులువు కానుంది. ఇదిలావుంటే ఈ 'ఎంఎల్‌పీ'ని నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన భూమి పూజను 2018 సెప్టెంబర్‌లో అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విషయం తెలిసిందే.

కరోనా ఎఫెక్ట్, ఇతర కారణాలతో పెరిగిన వ్యయం..!

నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో హెచ్ఎంఆర్ఎల్‌కు చెందిన అర ఎకరం స్థలంలో(2వేల గజాలు) 15 అంతస్తులుగా ప్రీ ఫ్యాబ్రికేటెడ్ విధానంలో మల్టీ లెవల్ పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం, అయిదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన ఒక ఫిల్మ్ థియేటర్ ఉండనున్నాయి. మొత్తం 1,00,044 చదరపు అడుగుల నిర్మిత ఏరియాలో 68శాతం పార్కింగ్ కోసం, మిగిలిన 32శాతం వాణిజ్య సదుపాయాలకు కేటాయించారు. పార్కింగ్ జాగాలో 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలు నిలిపే అవకాశముంది. పీపీపీ విధానంలో మెస్సర్స్ భారీ ఇన్‌ఫ్రా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ 50 ఏండ్ల రాయితీ కాలంతో ఈ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది.

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో, మనుషుల ప్రమేయం లేకుండానే పార్కింగ్ వ్యవస్థ నిర్వహణ ఉంటుంది. ఇందుకోసం జర్మనీకి చెందిన పాలిస్ సంస్థ సహకారం తీసుకుంటున్నారు. ట్రాన్స్‌పోర్టర్, షటిల్, టర్న్ లిఫ్ట్, టర్మినల్ వంటి నాలుగు రకాలుగా వాహనాలను పార్కింగ్ చేసే వ్యవస్థలు ఉంటాయి. అయితే మొత్తం రూ. 50-60 కోట్లతో పీపీపీ విధానంలో అందుబాటులోకి తెస్తామనుకున్నా.. ఈ ప్రాజెక్టు కాస్త.. కరోనా ప్రభావం, డెట్ ఫైనాన్సింగ్ సమస్యలు, గ్లోబల్ సప్లయ్ చైన్ అంతరాయాలు తదితర కారణాలతో రూ.80 నుంచి 90 కోట్లకు చేరినట్టు తెలుస్తోంది.

పార్కింగ్‌కు ఒక నిమిషం.. తిరిగి పొందడానికి 2 నిమిషాలు..!

మల్టీలెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు ఇన్ అండ్ అవుట్ టెర్మినల్స్.. వాహనాల నిలుపుదల కోసం టర్న్ టేబుల్ ఉంటుంది. ఈ టేబుల్‌పై వాహనదారుడు తమ వాహనాన్ని వదిలి, తమ నిర్దేశిత పనులకు హాజరుకావచ్చు. ఎంఎల్‌పీలోనికి వాహనం ప్రవేశించిన సమయంలో వాహనదారులకి స్మార్ట్‌కార్డు జారీ అవుతుంది. తరచూ ఎంఎల్‌పీని వినియోగించేవారికి 'ఆర్ఎఫ్ఐడీ' కార్డులు జారీచేయనున్నారు. వాహనదారులకి ఏ టెర్మినల్ కేటాయించినది ముందుగానే తెలియజేస్తారు. వాహనం కొలతలు ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల వర్గీకరణ జరుగుతుంది. ఎస్‌యూవీ లేదా సెడాన్ వాహనానికి తగినట్టుగా పార్కింగ్ బేలు కేటాయించబడతాయి. ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో కేటాయించిన స్థలంలో పార్క్ చేస్తుంది. ఈ మేరకు విశాలమైన, సౌకర్యవంతమైన టర్న్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. ముంబయి, ఢిల్లీలో ఉన్న ఎంఎల్‌పీ పార్కింగ్ వ్యవస్థల్లో వాహనదారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి ఇక్కడ ఉండదని మెట్రో అధికారులు చెబుతున్నారు. పార్క్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి, డ్రైవర్ పార్కింగ్ రుసుము చెల్లించి, పార్కింగ్ టిక్కెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే, ట్రాన్స్‌పోర్టర్-షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారునికి అందజేస్తుంది. అదేవిధంగా డ్రైవర్ కారుని రివర్స్ తిప్పుకోవాల్సిన అవసరం లేకుండా అందజేస్తుంది. పార్కింగ్ కోసం కేవలం ఒక నిమిషం కంటే తక్కువ సమయం, తిరిగి పొందడానికి 2 నిమిషాలు మాత్రమే పట్టనుంది. ఇందులో ద్విచక్రవాహనానికి గంటలకు రూ.10, కారుకు రూ.25-30 వసూలు చేసే అవకాశం ఉందని మెట్రో అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో 719 మంది అభ్యర్థులు

- కేజ్రీవాల్ స్థానంలో అత్యధికంగా పోటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో పోటీ చేస్తున్నారు. మొత్తం 1,040 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణ గడువు తరువాత 981 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. పరిశీలన అనంతరం 477 నామినేషన్లను తిరస్కరించారు. దీంతో 719 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా, ఇద్దరు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రుల కుమారులైన బీజేపీకి చెందిన పర్వేష్ వర్మ (సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు), కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ (షీలా దీక్షిత్ కుమారుడు) న్యూఢిల్లీ స్థానంలో అరవింద్ కేజ్రీవాల్‌తో తలపడుతున్నారు. అయితే ఈ స్థానం నుంచి అత్యధికంగా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గరిష్ఠంగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు 23 మంది పోటీలో నిలిచారు. మరోవైపు పటేల్ నగర్, కస్తూర్బా నగర్ స్థానాల్లో అత్యల్పంగా 5 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో ఒకే దశలో పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో.. నిందితుడికి 24 వరకూ పోలీస్ కస్టడీ



ముంబయి : బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో అరెస్టు చేసిన వ్యక్తికి ముంబయి కోర్టు ఆదివారం ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. అలీఖాన్‌పై దాడి కేసులో అంతర్జాతీయ కుట్ర కోణంపై దర్యాప్తు జరపాల్సి ఉందనే పోలీసుల వాదనను కోర్టు అంగీకరిస్తూ ఈ నెల 24 వరకూ కస్టడీకి అనుమతించింది. అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిగా అనుమానిస్తూ ఒక వ్యక్తిని ముంబయి పోలీసులు శనివారం థానేలో అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటలకు బాంద్రాలోని హలీడే కోర్టులో నిందితుడ్ని పోలీసులు హాజరపర్చారు. దాడికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్ జాతీయుడని, అతని చర్య వెనుక ఉద్దేశాన్ని కనుగొనల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అంతర్జాతీయ కుట్రపై కూడా అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడు 31 ఏండ్ల షరీఫుల్ ఇస్లాం షెహజాదా అని, ఇతను ఐదారు నెలలుగా ముంబయి, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నాడని, ఇతని వద్ద భారత నివాసానికి సంబంధించిన ఎలాంటి సరైన ధ్రువీకరణ లేదని పోలీసులు మీడియాకు తెలిపిన సమాచారంలో వెల్లడించారు. భారత్‌లోకి ప్రవేశించిన తరువాత తన పేరును విజయ్‌దాస్‌గా మార్చుకున్నాడని, హౌస్ కీపింగ్ ఏజెన్సీలో పని చేస్తున్నాడని ముంబయి పోలీసులు తెలిపారు. ఇంట్లోకి చొరబడ్డం నిందితుడికి ఇదే మొదటిసారి చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేయడంలో ముంబయి పోలీసులకు ఒక లేబర్ కాంట్రాక్టర్ సహాయం చేసినట్లు ఒక అధికారి తెలిపారు. థానేలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్‌లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. గురువారం బాంద్రాలోని తన నివాసంలోనే సైఫ్ అలీఖాన్‌పై పలుమార్లు కత్తితో దాడి జరిగింది. ముంబయిలోని లీలావతి ఆస్పత్రిలో సైఫ్ చికిత్స పొందుతున్నాడు. ఐసీయూ నుంచి సాధారణ గదికి సైఫ్‌ను తరలించినట్టు వైద్యులు తెలిపారు. సైఫ్ ఆరోగ్య స్థితి నిలకడగానే ఉందని పోలీసులు చెప్పారు.

భూములిస్తే శానిటేషన్ వర్కర్లకు ఇండ్లు కట్టిస్తాం

- కేంద్రం పరిధిలో భూమి ఉంది : ప్రధాని మోడీకి కేజ్రీవాల్ లేఖ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే, ఢిల్లీ ప్రభుత్వం శానిటేషన్ వర్కర్లకు ఇండ్లు కట్టించి ఇస్తుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రధాని మోడీకి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై భూమి కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ "పారిశుధ్య కార్మికులు మురికివాడల్లో నివసిస్తుండటం చూశాను. దీనిపై ప్రధానికి లేఖ రాశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. ఆ పథకం కింద సబ్సిడీతో భూములను కేంద్రం కేటాయిస్తే అప్పుడు ఢిల్లీ ప్రభుత్వం వారికి ఇండ్లు కట్టించి ఇస్తుంది" అని కేజ్రీవాల్ తెలిపారు. తొలుత ఎన్‌డీఎంసీ, ఎంసీడీ పారిశుధ్య కార్మికులకు కేంద్రం భూమి కేటాయిస్తే, వారి వేతనాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఆ మొత్తాన్ని చెల్లించడం జరుగుతుందని చెప్పామని అన్నారు. ఇది పేద ప్రజలకు ఉద్దేశించిన పథకం అయినందున ప్రధాని అంగీకరిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయవచ్చునని అన్నారు.

" ఎన్‌డీఎంసీ, ఎంసీడీ ఏరియాల్లో నివసిస్తున్న పారిశుధ్య కార్మికులకు సంబంధించి ప్రధాన అంశాన్ని మీ ద ృష్టికి తెస్తున్నాను. నగర పరిశుభ్రతలో ఈ పారిశుధ్య కార్మికులు కీలకంగా ఉన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు ప్రభుత్వం కేటాయించిన నివాసాల్లో ఉంటారు. అయితే రిటైర్మెంట్ తరువాత ఆ నివాసాలను విడిచిపెట్టాల్సి ఉంటుంది. వీరికి సొంతంగా ఇండ్లు కొనుక్కొనే స్తోమత కానీ, భారీ అద్దెలు చెల్లించగలిగే స్తోమత కానీ లేదు. భూములకు సంబంధించిన అంశం కేంద్ర పరిధిలోకి వస్తున్నందున, తగ్గింపు ధరలతో వారికి భూములు కేటాయించాలని కోరుతున్నాను. వారికిచ్చే ప్రభుత్వ జీతాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఆ మొత్తాన్ని కార్మికులు చెల్లిస్తారు. ఇందుకు సంబంధించిన పథకాన్ని ప్రారంభించి క్రమంగా దానిని ఇతర ఉద్యోగులకు కూడా విస్తరించాలని మిమ్మల్ని కోరుకుంటున్నాను. ఈ ప్రతిపాదనను మీరు అంగీకరించి కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేస్తారని ఆశిస్తున్నాను" అని ప్రధానికి రాసిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు.

ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనది

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈసారి రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనదని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేక మైనదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్టం చేస్తోందని పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుందని అన్నారు. యువత స్టార్టప్ సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. సమాజంలోని పరిస్థితులు మారుతున్నాయని, దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందని అన్నారు. దేశాభివ ృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చిందన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886